ఉమా సంహిత

శ్రీ గణేశాయ నమః

శ్రీ శివ మహా పురాణము

ఉమా సంహిత

శ్రీ గౌరీ శంకరాభ్యాం నమః

శ్లో ॥ యో ధత్తే భువనాని సప్త గుణవాన్ స్రష్టా రజస్సంశ్రయః
సంహర్తా తమసాన్వితో గుణవతీం మాయామతీత్యస్థితః ।
సత్యానందమనంత బోధమమలం బ్రహ్మాది సంజ్ఞాస్పదం
నిత్యం సత్త్వ సమన్వయా దధిగతం పూర్ణం శివం ధీమహి ॥

తా ॥ గుణములకు అధిష్ఠానమగు ఏ పరమేశ్వరుడైతే రజోగుణమును ఆశ్రయించి ఏడు లోకములను ధరించి పాలించుచున్నాడో; తమోగుణము నాశ్రయించి సంహరించుచున్నాడో; ఏ పరమేశ్వరుడు త్రిగుణాత్మికయగు మాయకు అతీతుడై ఉన్నాడో; అట్టి సత్యస్వరూపుడు, ఆనందఘనుడు, సర్వపరిచ్ఛేద రహితుడు, జ్ఞాన ఘనుడు, సంసార దోష వర్జితుడు, బ్రహ్మ-విష్ణు-రుద్రులను పేర్లతో వ్యవహరింపబడువాడు, నిత్యుడు, సాత్త్విక భావమును పెంపొందించు కొనుట వలన లభించు వాడు, పూర్ణుడు అగు శివుని మేము ధ్యానించు చున్నాము.

శ్రీకృష్ణ-ఉపమన్యు సంవాదము

సూత మహర్షి ఋషులతో ఇలా అంటున్నాడు: "ఓ! తపోధనులారా! మా గురువుగారైన వ్యాస భగవానుడు సనత్కుమారుని వలన తెలుసుకొన్న ఉమా సంహితను నేను మీకు చెపుతున్నాను వినండి! పూర్వం వసుదేవ తనయుడైన శ్రీకృష్ణుడు పుత్రార్థియై శివుని గూర్చి తపస్సు చేయగోరి కైలాసానికి వెళ్ళాడు. అక్కడ శ్రేష్ఠమైన హిమవత్పర్వత శిఖరంపై తపస్సు చేస్తూన్న ఉపమన్యు మహర్షిని చూచి భక్తితో చేతులు జోడించి ప్రణామం చేసి వినయంగా ఇలా ప్రశ్నించాడు.

"ఓ! ఉపమన్యూ! నీవు మహా ప్రాజ్ఞుడవు! శివ భక్తులలో అగ్రగణ్యుడవు! నేను పుత్రార్థినై శివానుగ్రహాన్ని పొందగోరి వచ్చాను. భక్తులకు సర్వదా ఆనందాన్ని కలిగించే శివుని మహిమను, తత్త్వాన్ని, నీ అనుభవాన్ని నీ ముఖకమలం నుండి శ్రవణం చేయాలని ఉవ్విళ్ళూరుతున్నాను. ఆపై నీవు చెప్పిన దానిని చక్కగా మనసుకు పట్టించుకొని శివుని గూర్చి తపస్సుకు ఉపక్రమిస్తాను. శివానుగ్రహం లేనివాడు ఈ లోకంలో ఎట్టి అభ్యుదయాన్ని పొందలేడు గదా!"

శ్రీకృష్ణుని భక్తికి, వినయానికి మిక్కిలి సంతోషించి, శివుని మనసులో ధ్యానించి ఉపమన్యు మహర్షి ఇలా చెప్పసాగాడు: "మహా శైవాగ్రగణ్యుడవైన వాసుదేవా! విను. మహేశ్వరుని మహిమను నేను ప్రత్యక్షంగా చూచాను. నేను తపస్సు చేస్తూండగా సమస్త పరివార సహితుడైన శంకరుని, ఆయన యొక్క ఆయుధాలను చూచాను. విధి, మాధవ, ఇంద్రాది బృందారక బృందమంతా కరకమలాలను జోడించి శిరసున గీలించి ఆయనను పరివేక్షించి స్తుతిస్తూండగా... ఆ సుందర దృశ్యాన్ని తన్మయత్వంతో దర్శించాను. తన స్వరూపంలో మూడు అంశలతో ప్రకాశించువాడు, నిత్యానంద స్వరూపుడు, ఒక అంశచే జగద్రూపంగా ప్రకటమైన వాడు, మహా దంష్ట్రుడు, అగ్నిజ్వాలా మండితుడు, సహస్రకోటి మార్తాండ మండల తేజో విరాజమానుడు, సహస్రాక్షుడు, సహస్ర పాదుడు, సహస్రానేక దివ్యాయుధ సంపన్నుడు, విరాట్ స్వరూపుడు ఐన శంకరుని దివ్య రూపాన్ని దర్శించాను.

కల్పాంతమందు సర్వ జగత్తును ఆయన ఉపసంహరిస్తాడు. ఆయన చెంత పరమ గుహ్యమైన ఆయన శూలాన్ని వీక్షించాను. దానికి 'విజయము' అని పేరు. అది భూమిని చీల్చగలదు. సముద్రాలను శోషింప చేయగలదు. జ్యోతిర్మండలంలోని నక్షత్రాలన్నిటిని సూదితో పువ్వులను గ్రుచినట్లు పూలదండగా గ్రుచ్చగలదు. యవనాశ్వుని కుమారుడైన మాంధాత చక్రవర్తిని అది పూర్వం ససైన్యంగా వధించింది. బల గర్వితుడైన లవణాసురుడు పూర్వం శత్రుఘ్నుని ఆలానికి ఆహ్వానించగా క్షణంలో ఆ రాక్షసుని సంహరించింది. పరశురాముడు ఏ కుఠారంతో ఇరవై ఒక్క సార్లు దుష్ట క్షత్ర కులాన్ని నరికాడో కల్పాంతదహన రూపమైన ఆ గండ్రగొడ్డలిని శివ సన్నిధిలో పరికించాను. వేయి అంచులు గలది, సాటిలేనిది అగు సుదర్శన చక్రాన్ని తిలకించాను. పినాకమనే ధనుస్సును, శక్తిని, కత్తిని, పాశాన్ని, అంకుశాన్ని, గదను ఇంకా పేర్లు తెలియని అనేక శస్త్రాస్త్రాలను అవలోకించాను. కృష్ణా! ఒక్క వాక్యంలో చెపుతున్నాను విను! లోకాలోకాలతో కూడియున్న ఈ ఖగోళమంతా ఆయన చుట్టూ కుమ్మరిసారెలా పరిభ్రమిస్తూ ఉండగా దిగ్భ్రమతో ఆ దివ్య రూపాన్ని దర్శించాను.

నాయందు ప్రసన్నుడైన శంకర భగవానుడు నాకు త్రికాలజ్ఞానాన్ని, ఆయన యొక్క నిత్య సన్నిధిని అనుగ్రహించాడు. జరా, మరణాదులు లేకుండ ఆకల్పాంతం చిరంజీవివై వర్ధిల్లమని వరమిచ్చాడు. నేను కోరదగినవి ఏమీ మిగలకుండ అన్నిటిని అనుగ్రహించాడు. వేయేల! ఆయన ఈశత్వాన్ని నాకు అనుగ్రహించాడు! వాసుదేవా! భక్తవత్సలుడైన శంకరుడు నిన్ను తప్పక అనుగ్రహిస్తాడు. ఆయనను గూర్చి తపస్సు చెయ్యి. పూర్వం అనేక మంది ఆయనను ఆరాధించి అభీష్ట సిద్ధిని పొందారు. శివారాధనా తపస్సును అనగా పాశుపతవ్రత దీక్షను నేను నీచే నడిపిస్తాను.

శ్రీకృష్ణుడు తపస్సుచేసి శంకరుని అనుగ్రహించే వరాలను పొందుట

ఉపమన్యు మహర్షి ఇలా పలికి గతంలో దేవదానవులలో ఋషులలో, ఋషిపత్నులలో చక్రవర్తులలో, సామాన్యులలో శివుని ఆరాధించి ఆయన అనుగ్రహాన్ని పొందిన వారి గాథలన్నిటిని చెప్పాడు. చెప్పి భుక్తి, ముక్తి దాయకమైన 'నమశ్శివాయ' మంత్రాన్ని ఉపదేశించి శ్రీకృష్ణునికి దీక్షను ఇచ్చాడు. మాధవుడు తన కాలి బొటన వ్రేలిపై శరీరం బరువునుంచి పదహారు మాసాలు శంభుని గూర్చి తపస్సు చేశాడు. ఆయన నిష్ఠకు సంతసించిన పరమేశ్వరుడు పార్వతీ సహితుడై దర్శనమిచ్చి ఎట్టి దుర్లభమైన వరాలనైనా కోరుకొమ్మని పల్కగా శ్రీకృష్ణుడిలా ప్రార్థించాడు: "ఓ దేవదేవా! మహాదేవా! నా యందు నీవు ప్రీతుడవైనచో ఎనిమిది వరాలచే నన్ననుగ్రహించు. నిత్యము శివ ధర్మము నందు నా బుద్ధి నిలుచుగాక! శాశ్వతమైన కీర్తి కలుగును గాక! స్థిరమైన నీ సన్నిధి లభించును గాక! నీ యందు నిత్య భక్తి సిద్ధించును గాక! నా కుమారులందరకు ఒక్కొక్కరికి పదిమంది పుత్రులు కలిగి నా వంశం తామర తంపరయై వర్ధిల్లు గాక! నా శత్రువులు సంగ్రామ రంగంలో వధింపబడుదురు గాక! నాకు శత్రువులవలన అవమానం కలుగకుండును గాక! నేను యోగులందరకు ప్రియాతి ప్రియమైన వాడను అగుదును గాక!"

శూలపాణి ఐన శంకరుడు వాటన్నిటికి 'తథాస్తు' అని పలికి ఇంకా ఇలా అన్నాడు. "కృష్ణా! నీకు నా అనుగ్రహంచే పరాక్రమశాలి ఐన కుమారుడు జన్మించగలడు. అతనికి సాంబుడు అని నామకరణం చేయి. ఆ కుమారుడు పూర్వ జన్మలో ప్రళయ కాలమందలి ఆదిత్యుడు. మునులు అతనిని "మనుష్యుడవు కమ్ము!" అని శపించిన కారణంగా అతను నీకు పుత్రుడుగా జన్మించ బోతున్నాడు." ఇలా పల్కి శంకరుడు విరమించాడు.

అంత పార్వతీదేవి కృష్ణుని కృపాతరంగితావ లోకనం చేసి సుధామధురంగా ఇలా పలికింది. "ఓ! వాసుదేవా! నీ ఈశ్వర భక్తికి, తపస్సుకు సంతోషించాను. నా నుండి కూడ దుర్లభమైన వరములను పొందు."

దానికి గోవిందుడు ఆనందించి భక్తియుక్తుడై ఇలా అన్నాడు. "జగన్మాతా! నీ దయకు పాత్రుడనయ్యాను. అదే పదివేలు! అయినా వరాలకు, ధనార్జనకు 'ఇక చాలు!' అనటం ఉండదు కదా! నాకు ఎన్నడైనను బ్రాహ్మణులపై ద్వేషము కలుగకుండును గాక! సర్వకాల సర్వావస్థలయందు బ్రాహ్మణ భక్తి స్థిరమై నిల్చును గాక! మంగళకరమగు గోబ్రాహ్మణ సేవను సర్వదా చేసెదను గాక! నా తల్లి దండ్రులు సంతోషముతో ఉందురు గాక! సర్వ ప్రాణులయందు నేను అనురాగమును కలిగి ఉందును గాక! మీ ఆదిదంపతుల దర్శన భాగ్యముచే నా వంశంలో యోగ్యమైన సంతానం కలుగును గాక! నేను వంద యజ్ఞములను చేసి ఇంద్రుని, దేవతలను సంతోషపెట్టుదును గాక! నేను ఇంటిలో సర్వదా యతులకు మరియు అతిథులకు శ్రద్ధచే పవిత్రమైన భోజనమును సమర్పించెదను గాక! నేను స్త్రీజనోద్ధారకుడను అగుదును గాక! నాకు అందరి యందు సమభావము ఉండు గాక! మీ దంపతులు నాకు సర్వదా రక్షకులై ఉందురు గాక!"

ఈ విధంగా ప్రార్థించిన శ్రీకృష్ణుని అన్ని విధాల అనుగ్రహించి అంతర్ధానమయ్యారు ఆది దంపతులు. వాసుదేవుడు సఫల మనోరథుడై ఉపమన్యు మహర్షికి కృతజ్ఞతలను వెల్లడించి ఆయన నుండి సెలవు తీసుకొని మనసులో శివ సహస్రనామాలను పఠిస్తూ ద్వారకను చేరి ఇష్టకథా వినోదాలతో సుఖంగా ఉన్నాడు.

మునులారా! ఈ సర్వజగత్తు ఈశ్వర మాయచే కప్పబడి ఉంది. ఎనిమిది విధాలైన పుట్టుక గల దేవజాతులు, ఒకే ఒక విధానంలో పుట్టుకగల మనుష్య జాతి, ఐదు విధాలుగా పుట్టుకగల పశు పక్ష్యాదులు మొత్తం పదునాలుగు విధాలైన పుట్టుకలున్నాయి. ఆ జీవులన్నీ శివుని నుండే ఉత్పన్నమవుతున్నాయి. తిరిగి ఆయనలోనే లీనమవుతున్నాయి. ఆయన మాయను ఎవరూ దాటలేరు.

ఓ మహర్షులా! శివ మాయా ప్రభావంచే లోక పాలకుడైన విష్ణువు కామ మోహితుడై పరకాంతాసక్తిచే శాపగ్రస్తుడయ్యాడు!

సకల బృందారక సార్వభౌముడైన అమరేంద్రుడు తన కనుసన్నలలో మెలగే రంభోర్వశీమేనకాద్యనేక దివిజ సుందరులను కాదని తపసి ఇల్లాలికై తాపత్రయపడి చీకటి తప్పుచేసి తాపసి శాపంచే తలచుట్టూ కళ్ళు తెచ్చుకొన్నాడు.

సర్వాన్ని పవిత్రీకృతం చేసే పావకుడు కూడా కామానల పీడితుడయ్యాడు. జగత్ప్రాణుడైన వాయువు మన్మథ ప్రతాపానికి లొంగి పరాంగనాసక్తుడయ్యాడు. జ్ఞానాశ్రయుడు, కర్మసాక్షి ఐన భాస్కరుడు కుసుమ కోదండుని బారిని పడి అన్యకాంతాసక్తుడై ఔన్నత్యాన్ని కోల్పోయాడు. కుముద బాంధవుడు మదన బాణ పీడితుడై గురుపత్నిని అపహరించి తన శీలానికి కళంకం తెచ్చుకొన్నాడు! ఫలితంగా బుధుడు జన్మించాడు. మిత్రావరుణులు ఘోరమైన తపస్సును ఆచరించి కూడా ఊర్వశిని చూచి కంతు సంతాపానికి లోనయ్యారు. ఫలితంగా మిత్రునికి వసిష్ఠుడు, వరుణినికి అగస్త్యుడు పుట్టారు. బ్రహ్మ మానస పుత్రుడైన దక్షుడు సోదరి యందు చిత్త చాంచల్యాన్ని పొందేడు.

బ్రహ్మగారు సైతం పలుమార్లు మనసిజుని మాయలో పడి మనో వికారానికి లోనయ్యాడు. మహా యోగి అగు చ్యవనుడు కూడా సుకన్యను చూచి మన్మథ భావాన్ని పొందేడు.

కశ్యప మహర్షి కుసుమశర పీడితుడై ధన్వమహరాజు తనయను యాచించాడు!

విష్ణువు వాహనమైన గరుడుడు కామ వికారానికి లోనై శండిలుని కన్యను అపహరింప పూనుకొని రెక్కలు కాల్చుకొన్నాడు! విభాండక మహర్షి స్త్రీని చూచి చిత్త చాంచల్యాన్ని పొంది తపస్సునుండి జారి పోయాడు! ఫలితంగా ఋష్యశృంగుడు జన్మించాడు.

గౌతమ మహర్షి శారద్వతిని చూచి వలపును నిగ్రహించుకోలేక క్షుభిత మానసుడై ఆమెను కలియగా ద్రోణుడు పుట్టాడు. పరాశర మహర్షి అనంగ భావాన్ని అణచుకోలేక దాసకన్యా రతుడయ్యాడు. విశ్వామిత్రుడు చెఱకు విల్కాని కఱకుటమ్ముల పదును కోర్వక మేనక వెంట పడ్డాడు! ఫలితంగా శకుంతల పుట్టింది.

జితేంద్రియుడైన బృహస్పతి కందర్ప కార్ముక వినిర్ముక్త కుసుమ బాణ పీడితుడై సోదరుని భార్యను కూడగా భరద్వాజుడు జన్మించాడు.

విశ్రవసుని కుమారుడైన రావణుడు వేదపారంగతుడై ఉండి కూడా పరవధూ కాంక్షచే రాక్షసకుల వినాశనానికి ధూమకేతువయ్యాడు. వీరందరు శివమాయా మోహితులై, కామపీడితులై మలభూయిష్ఠపు తోలు బొమ్మలైన స్త్రీలతో రమించి తమ తపస్సును, ఔన్నత్యాన్ని, ఉచ్చస్థితిని, అతిశయాన్ని, ప్రాభవాన్ని ప్రాగల్భ్యాన్ని పోగొట్టుకొన్న వారే! కామ దహనం చేసి విరాగి అయిన వాడు త్రినేత్రుడైన శంకరుడు ఒక్కడే!

సుఖ-దుఃఖ హేతువులైన పుణ్య-పాప కృత్యాలు

మునులారా! లోకంలో సకల ప్రాణులు అనుభవించే సుఖ-దుఃఖాలకు కారణభూతమైన పుణ్య-పాప కర్మల రహస్యాన్ని చెపుతున్నాను. వినండి! లోకంలో ఏ ఆధారమూ లేకుండా, ఏ ప్రయత్నము లేకుండా ఏదీ పుట్టదు. దానికి కర్మ కారణంగా చెప్పబడుతూన్నది. కర్మ నుండి పుట్టిన సుఖ-దుఃఖ రూపమైన ఫలమే కార్యంగా చెప్పబడుతూన్నది. సర్వము కార్యకారణ సంబంధమే! ఇలా కార్య, కారణములు దేనికదే విడివిడిగా (ద్వైతంగా) కనుపించినా వాస్తవంలో రెండూ ఒక్కటే (అద్వైతమే).

మేఘం కారణంగా జలాలు వర్షిస్తున్నాయి. మేఘం నశిస్తూన్నది. జలాలు కారణంగా మేఘం పుడుతున్నది. జలాలు అదృశ్యమౌతున్నాయి. బీజం కారణంగా వృక్షం పుడుతున్నది. బీజం నశిస్తూన్నది. వృక్షం కారణంగా బీజములు ఉద్భవిస్తున్నాయి. వృక్షం నశిస్తూన్నది. సృష్టి అంతా అద్వైతమే! ద్వైతమనేది లేదు. రెండు వస్తువులు ఉన్నాయనుకొనటం కేవలం భ్రాంతి! లోకంలో దేనిని మించిన మాదక వస్తువు లేదో అట్టి స్త్రీ విషయంలో వివేచన చేస్తే పరస్పర విరుద్ధంగా తోచే రెండు వస్తువులు, లేవు అనేది బోధపడుతుంది. మూత్ర పతన స్థలం అపవిత్రం కదా! ఎంతటి వారైనా కామదాసులై అచ్చోటనే కదా రమించి ఆనందాన్ని పొందుతున్నారు. అదే పవిత్రము అపవిత్రమూను! అదే రక్తి-విరక్తులకు కారణమూను.

కారణరూపమైన కర్మలనుండి కార్యరూపమైన సుఖదుఃఖాలు పుట్టుతున్నాయి. ఫలానుభవం పూర్తికాగానే కర్మబీజం నశిస్తూన్నది. కర్మఫల రూపమైన సుఖదుఃఖాలను అనుభవించేటప్పుడు తిరిగి పుణ్య పాపరూపమైన కర్మలను చేస్తున్నాం. ఈ విధంగా కర్మనుండి ఫలం, ఫలం నుండి కర్మ పుట్టి సృష్టిచక్రం నడుస్తూన్నది. అయితే దీనికి అంతం లేదా? కర్మబంధం నుండి విముక్తి ఎప్పుడు? అంటే ఉంది. సర్వానికి శివుడే కారణం అనే శివజ్ఞానం కలిగి, సర్వమైన కర్మలను 'శివార్పణం'గా నిష్కామ బుద్ధిచే చేసి, వాటి ఫలాలను కూడా శివునికే అర్పించినప్పుడు ముక్తి లభిస్తుంది. శివ జ్ఞానాగ్ని సంపర్కం కర్మలకు కలిగినప్పుడు అవి పునర్జన్మ హేతువులు కావు. అగ్ని సంపర్కంచే వేపిన విత్తనాలు మొలకెత్తవు కదా! అదే ముక్తి.

ఇప్పుడు మీకు విధి నిషేధ రూపమైన పుణ్య-పాప కర్మలను గూర్చి దాని ఫలితంగా వచ్చే స్వర్గ-నరకాదులను గూర్చి సంగ్రహంగా చెపుతున్నాను వినండి! మానసిక, వాచిక, కాయిక పాపములని మూడు విధాల పాపాలున్నాయి. మనస్సులో పరస్త్రీ, పరధనాలను

కోరుట, పరులకు హాని తలపెట్టుట, చేయకూడని పనియందు పట్టుదల ఈ నాలుగు మానసిక పాపములు. అనుచిత ప్రలాపము, అసత్యమును చెప్పుట, అప్రియమును పల్కుట, పరోక్షములో కొండెమును చెప్పుట ఈ నాలుగు వాచిక పాపములు. తినకూడని పదార్థములను తినుట, హింసించుట, వ్యర్థ కార్యముల యందు లగ్నమగుట, పరద్రవ్యాన్ని అపహరించుట. ఈ నాలుగు కాయిక పాపాలు. ఈ విధంగా పన్నెండు విధాలైన ప్రధాన పాపములు ఉన్నాయి. వీటిలోగల అవాంతర భేదం వల్ల పాపములు అనంతం. వాటివలన ప్రాప్తించే నరక యాతనలు కూడా అనంతం.

శివుని, శివభక్తులను, తల్లిదండ్రులను, గురువును, వేదమును, బ్రాహ్మణులను, సత్పురుషులను, శాస్త్రమును, గ్రహాలను, అన్నం పెట్టిన వానిని, పంచ భూతములను ఎవరైతే నిందిస్తారో వారికి నరకం నిశ్చయం. వేట, జూదము, సురాపానము, దేవ, బ్రాహ్మణ ద్రవ్యాపహరణ, ఇతరుల ఆస్తికి నష్టాన్ని కలిగించుట. ఇవి మహా పాతకాలు. నరక హేతువులు, ఆస్తిని పంచుకొనుటలో దాయాదులను మోసం చేయటం, దురహంకారాన్ని కలిగి ఉండటం, చేసిన మేలును మరచుట, ఇంద్రియ భోగముల యందు అధికమగు ఆసక్తి, కన్యను, పరస్త్రీని చెడగొట్టుట, జలములను కలుషితం చెయ్యటం, మోసగించి వైద్యం చెయ్యటం, స్వధర్మాన్ని విడిచి పరధర్మాన్ని స్వీకరించటం, తూకంలో మోసం, బాటసారులకు ఆటంకాన్ని కల్పించుట ఇవన్నీ మహా పాపాలు. పరోపకారమే పుణ్యం – పరపీడనమే పాపం. పుణ్యానికి ఫలం స్వర్గం, పాపానికి ఫలం నరకం. నరకముల పేర్లు కొన్ని చెపుతున్నా. రౌరవం, మహారౌరవం, సుఘోరం, మహాతమస్సు, విలోమము, కంటకం, తీవ్రవేగం, కరాలం, ప్రకంపనం, మహావక్రం, కాలసూత్రం, సూచీముఖం, బాదకం, కుంభీపాకం, సుపాకం, క్రకచం, అతిదారుణం, అంగారరాశిభవనం, మహాసంవర్తకం, తప్తజంతువు, పంకలేపం కుంభీపాకం ఇత్యాదులు అనేకం ఉన్నాయి.

అన్నదాన మహిమ

సూత మహర్షి ఋషులతో ఇలా అంటున్నాడు: "మునులారా! ఈ జన్మలోను, జన్మాంతరమందు సుఖాలను కోరుకొనే మానవుడు ఆచరించవలసిన కొన్ని శుభకర్మలను గురించి చెపుతున్నాను వినండి. లోకంలో ప్రతి మానవుడు తన పేరు ప్రఖ్యాతులు, కీర్తి, ప్రతిష్ఠలు మరణానంతరం కూడా శాశ్వతంగా ఉండాలని కోరుకొంటాడు. తన వంశం ఆకల్పాంతం వర్ధిల్లాలని ఆశిస్తాడు. తన సంతానం తామర తంపరగా వృద్ధి చెందాలని కాంక్షిస్తాడు. మరణానంతరం శాశ్వతమైన కీర్తి ప్రతిష్ఠలు

కోరుకొనే వారికి సప్తసంతాన ప్రతిష్ఠలు చెప్పబడ్డాయి. 1. పుత్రుడు, 2. శివాలయ ప్రతిష్ఠ, 3. తోటను (ఆరామమును) వేయించుట 4. చెరువును త్రవ్వించుట, 5. నూతిని త్రవ్వించుట, 6. పాంథశాల (సత్రము)ను నిర్మించుట, 7. కృతి స్వీకారము. సప్త సంతానములలోను నశించకుండ ఉండేది కృతి ఒక్కటే! ఉత్తముడైన పండితకవి రచించిన ఉత్తమ కావ్యానికి నాశనం లేదు.

మునులారా! కలవారు లేనివారికి దేనినైనా ఇచ్చి సహాయపడవచ్చు. లోకంలో దాన-ధర్మములని రెండు మాటలున్నాయి. వేద శాస్త్రాదులను పోషించే నిమిత్తం వాటిలో నిష్ణాతులైన ఉత్తమ గుణ, శీలాదులుగల విప్రులకు సత్కార రూపంలో ఇచ్చేదానికి 'దానము' అని పేరు. పేదరికంతో బాధపడే వారికి సహాయం చేస్తే దానికి 'ధర్మము' అని పేరు. దాన-ధర్మములు రెండూ గొప్పవే!

దానము లన్నిటిలోను అన్నదానం చాలా గొప్పది అని ప్రాచీన ఋషులు చెప్పారు. దానిని మించిన దానం లేదు. అన్నదానం వెంటనే ప్రీతిని, ఉల్లాసాన్ని కలిగించి బలాన్ని, బుద్ధిని వర్ధిల్ల చేస్తుంది. సకల ప్రాణులు అన్నం నుండి పుట్టుతున్నాయి. అన్నం లేనిచో మరణిస్తాయి. రక్తము, మాంసము ఇత్యాది సప్తధాతువులు అన్న రసం నుండే ఉద్భవిస్తున్నాయి. చివరిదైన శుక్రధాతువునుండి ప్రాణులు పుట్టుతున్నాయి. గర్భస్థ శిశువులు మొదలుగా దేవదానవుల వరకు అందరూ అన్నమునే కోరుతూ ఉన్నారు. అన్ని రోగాలలోను ఆకలి రోగం చాలా పెద్దది. అన్నం అనే ఓషధీ, లేపంచే అది నశిస్తుంది. ఆకలితో సమానమైన దుఃఖం లేదు. హితకరమైన భోజనాన్ని తృప్తిగా ఆరగించి ఆరోగ్యంగా ఉండటం కంటె మించిన సుఖంలేదు. కోపముతో సమానమైన శత్రువు లేదు. అన్నదానం చేస్తే ప్రాణదానం చేసినట్లే. ప్రాణదానం చేస్తే సర్వమూ ఇచ్చినట్లే. అన్నదానం చేసిన వాడు తన కోసం పరలోకంలో గొప్పనిధిని భద్రంగా ఏర్పాటు చేసికొన్నవాడే అగుచున్నాడు. అన్నం సాక్షాత్తు బ్రహ్మ స్వరూపం! నారాయణ స్వరూపం! పరమేశ్వర స్వరూపం! సాక్షాత్తు త్రిమూర్త్యాత్మకమైన పరబ్రహ్మ స్వారూపం! భూత, భవిష్య, వర్తమాన కాలాలలో అన్నదానాన్ని మించిన దానం లేదు, ఉండబోదు. అన్నదానాన్ని చేసిన వానికి ఎన్ని జన్మలెత్తినా అన్నానికి కొరత ఉండదు. అన్నవస్త్రాలకు లోటు ఉంటే అదే దైన్యం. దైన్యం లేని జీవితాన్ని ప్రతి మానవుడు వాంఛిస్తాడు. కనుక ప్రతి మానవుడు ఉన్నంతలోనే అన్నదానం చెయ్యాలి! అన్నం దానాన్ని చేసిన వాడు శాశ్వత బ్రహ్మలోకాన్ని పొందుతాడు! ఇది వేదం చెప్పిన సత్యం!

తటాకారామ మహిమాను వర్ణనము

మునులారా! సమస్తమైన దానాలలోను త్రాగునీటిని దానం చేయటంకంటె ఉత్తమమైన దానం లేదు. జలం ప్రాణాధారమైనది కనుక దానికి జీవనము అని పేరు. శాశ్వత పుణ్యలోకాలను కోరే మానవుడు వాపీకూప తటాకాదులను నిర్మించాలి. సర్వకాలాలలోను చలివేంద్రాలను ఏర్పాటుచేసి మధుర జలాలను అందించాలి. చెరువును త్రవ్వించటం గొప్ప పుణ్యకార్యం. ఉద్భిజ్జ, అండజ, స్వేదజ, జరాయుజములనే నాలుగు రకములైన ప్రాణులకు చెరువులోని జలం ప్రాణాధారమవుతున్నది కనుక చెరువును త్రవ్వించిన వ్యక్తి ఆ ప్రాణులన్నిటికి ప్రాణదానం చేసిన వాడగుచున్నాడు. ఇంతకంటె గొప్ప పుణ్యం ఏముంది? చెరువును త్రవ్వించిన పుణ్యమూర్తి భూలోకంలో ఆ చెరువు ఉన్నంతవరకు మరణానంతరం ఆదిత్యలోకంలో హాయిగా ఉంటాడు. జలదానం చేసినవాని పాపాలు ఇక్కడే పటాపంచలవుతాయి.

దేవతలు, గంధర్వులు, పితృ దేవతలు, నాగులు, రాక్షసులు, మనుష్యులు, చెట్లు, జలచరాలు ఇలా ఒకటేమిటి సమస్త ప్రాణులు జలాలను ఆశ్రయించుకొనే జీవిస్తున్నాయి. చెరువును త్రవ్వించిన వానికి సహస్రాధిక గోదానఫలం, అగ్నిష్టోమం మొదలుగా అశ్వమేధం వరకు క్రతువులను ఆచరించిన ఫలం లభిస్తుందని విద్వాంసులు అంటున్నారు. లోకులు ధర్మ, అర్థ, కామాలను సాధించటానికి జలాశయంలోని జలం సాధనభూత మవుతున్నది కనుక అట్టి జలాశయాన్ని నిర్మించిన పుణ్యమూర్తికి లోకులు ఆర్జించిన పుణ్యంలో సగం పుణ్యం లభిస్తుందని వేదవేత్తలు అంటున్నారు.

మునులారా! ఇప్పుడు చెట్లను నాటటం వలన వచ్చేఫలాన్ని చెపుతున్నాను వినండి. లోకులకు పుత్ర సంతానంతో సమానమైన ప్రేమ చెట్లమీద ఉంటుంది. చెట్లు తమ పూలతో ఫలాలతో సమస్త దేవతా గణాలను, మానవులను సంతృప్తి పరుస్తున్నవి. నీడతో అతిథులను ఆదరిస్తున్నవి. మఱ్ఱి, రావి, జువ్వి, మేడి, మారేడు ఇత్యాది పవిత్రమైన వృక్షాలను ఆశ్రయించుకొని అనేక దేవ, రాక్షస గణాలు ఉంటాయి. చెట్టు ఏదైనా అది ఓషధియే. దాని మహాత్మ్యం అనంతం. మానవుడు వృక్షం యొక్క భాషలో మాట్లాడ గలిగితే ఆ వృక్షం ఇచ్చే ఫలం అనంతం. మానవజాతి అభ్యుదయమంతా వృక్షసంపద మీదనే ఆధారపడి ఉంది. చెట్టు పుత్రునితో సమానం. అకారణంగా ఆకును కూడా కోయకూడదు. కొమ్మను నరికిన వాడు మరుజన్మలో బాహువులు లేనివాడై పుడతాడు. లేదా చేతులను పోగొట్టుకొన్న వాడవుతాడు.

సప్త సంతాన ప్రతిష్ఠను, సత్యవ్రతాన్ని పాటించిన మానవునకు స్వర్గం నిశ్చయం. సత్యమే పరంబ్రహ్మ! సత్యమే గొప్ప తపస్సు! సత్యమే యజ్ఞము! సత్యమే పాండిత్యం! సత్యమే పరమపదం! సత్యమే సర్వానికి ఆధారభూతమై నిల్చి ఉంది. పుణ్యము, దేవపూజ, పితృపూజ, ఋషిపూజ, విద్య, మంత్రములు, పంచభూతములు, దానములు, బ్రహ్మచర్యము, సరస్వతి, సూర్యుడు, చంద్రుడు, సర్వవేదములు సత్యము యొక్క స్వరూపములే! వేయి అశ్వమేధములు, లక్ష క్రతవులు ఆచరించిన వచ్చే ఫలం, సత్యం యొక్క ఫలంకంటె తక్కువే! బ్రాహ్మణులయందు ఎన్ని ధర్మాలు, ఎన్ని సుగుణాలు ఉన్నా సత్యవ్రతం లేనినాడు అవన్నీ వ్యర్థమే! మానవులందరు సత్యవ్రతులైననాడు దుఃఖానికి తావు లేదు.

తపస్సు యొక్క మహిమ

ఋషులారా! మీకిప్పుడు తపస్సు యొక్క ఫలాన్ని గూర్చి చెపుతున్నాను వినండి. తపస్సు వలన ఇహలోకంలో సమస్త సంపదలు లభిస్తాయి. పుత్రులు కలుగుతారు, స్వర్గం లభిస్తుంది, మోక్షం సిద్ధిస్తుంది. భోగ, భాగ్యాలు కలుగుతాయి. తపస్సువలన పరమేశ్వర సాక్షాత్కారాన్ని పొందుతారు. సర్వమైన దేవతలు, త్రిమూర్తులు, సూర్యచంద్రులు ఒకరేమిటి లోకపాలక వ్యవస్థలో ఉన్నవారంతా తపస్సుచేతనే ఆయా ఆధికారిక స్థానాలను పొందియున్నారు. లోకులకు మేలుకీడులను ఒసగే గ్రహ, నక్షత్రాలు తపస్సు చేతనే జ్యోతిర్మయ స్వరూపాన్ని పొంది ప్రకాశిస్తున్నాయి. పారమార్థిక జ్ఞానం, లౌకిక విజ్ఞానం, ఆరోగ్యం, సంపద, సౌభాగ్యం, సౌందర్యం, సుఖం సమస్తము తపస్సు వలననే సాధ్యమని వేదవిదులు అంటున్నారు. విశ్వామిత్రుడు కఠోరమైన తపస్సును ఆచరించి బ్రహ్మజ్ఞాని అయ్యాడు. బ్రహ్మజ్ఞానాన్ని పొందిన తదుపరి పొందదగిన వస్తువు ముల్లోకాలలోను లేదు.

పురాణ మహిమ

మునులారా! అరణ్యంలో కందమూలాలను భక్షిస్తూ తపస్సు చేయటంకంటె వేదాధ్యయనము ఉత్తమం. అధ్యయనంకంటె తాను నేర్చిన విద్యను శిష్యులకు బోధించటం శ్రేష్ఠం. అంతకంటె పురాణాలను అధ్యయనం చేసి లోకులకు చెప్పటం అత్యుత్తమం. వేదశాస్త్రాధ్యయనంలోని శ్రమను గుర్తించి పితామహుడు సర్వమైన విజ్ఞానము లోకులందరకు అందుబాటులోనికి రావాలనే ఆకాంక్షతో ఈ పురాణ ప్రక్రియను సృష్టించాడు. పురాణాలలో లేని విజ్ఞానం బయట ప్రపంచంలో లేదు. బయట ప్రపంచంలో ఉన్న విజ్ఞానం పురాణాలలో చెప్పకుండ విడువబడలేదు. సూర్యచంద్రులు లేని యెడల జగత్తు అంధకారబంధురమవుతుంది. అలాగే పురాణాలు లేకపోతే సాహిత్య

సృష్టికి ఆధారభూతమైన కథా వాఙ్మయం లేదు. ధర్మ, అర్థ, కామ, మోక్షాలను సాధించటానికి సాధనమైన ఉపాయాలను, వాటికి సంబంధించిన విధి, నిషేధాలను పురాణాలద్వారానే తెలుసుకొనాలి. సృష్టి, స్థితి, లయములను గూర్చి ప్రాచీన రాజవంశాల చరిత్రను గూర్చి పురాణాలలో విపులంగా చెప్పబడింది. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను గురించిన గాథలు, పంచభూతములు, అష్టదిక్పాలకులు ఇతర దేవతలకు సంబంధించిన గాథలు, ఉపాసనా పద్ధతులు, కర్మకాండ, రాజనీతి, లోకనీతి, ధర్మ-అధర్మములను గురించిన విచారణ ఇలా ఒకటేమిటి సమస్తమైన విషయాలు వేదం ఆధారంగా పురాణాలలో చెప్పబడ్డాయి. పురాణాలను చదవకుండా ఎంతటి విద్వాంసుడైనా వేద తాత్పర్యాన్ని గ్రహించలేడు.

పురాణవేత్త విద్వాంసులందరిలోను శ్రేష్ఠుడు! వేదవేత్తలైన వారికంటె పూజ్యుడు! సర్వజ్ఞుడు! పురాణ ప్రవచనంచే దేవతలందరు సంప్రీతులవుతారు. పురాణము లన్నింటిలోను శివపురాణం శ్రేష్ఠం. అసలు మానవజన్మయే దుఃఖభూయిష్టం. అందులోను కలియుగంలో మానవుడు విషక్రిమి న్యాయంతో బ్రతుకుతాడు. పాపం నుండి జన్మ, జన్మ నుండి పాపం పుట్టుతున్నాయి. పాపం నుండి లేదా దుఃఖం నుండి విముక్తిని పొందటానికి పురాణ పఠనం, లేదా శ్రవణం ఈ రెంటికంటె మించిన ఉత్తమ సాధనం లేదు. ధనవంతుడైన మనుజుడు ఉత్తముడైన బ్రాహ్మణ విద్వాంసుని చేత ప్రయత్న పూర్వకంగా ఏదేని ఒక ఆలయంలోగాని, మంటపంలోగాని, సభాభవనంలోగాని పురాణాన్ని చెప్పించాలి. దుష్టమైన ఈ కలిలో మోక్షప్రాప్తికి ఇంతకంటె సులభమైన తరుణోపాయం లేదు.

దాన-ధర్మముల విచారణ

మునులారా! పుణ్య-పాప కర్మల విచారణ అతి గహనమైనది. ఒక పువ్వునుగాని, ఆకునుగాని ప్రయత్నపూర్వకంగా కోసి చెట్టునుండి వేరు జేస్తే పాపమే! వాటితో భగవంతుని అర్చిస్తే పుణ్యం. కనీసం దర్భను కోసినా పాపమే. ధర్భలతో అగ్నిని అర్చిస్తే పుణ్యం. పచ్చగడ్డిని కోస్తే పాపం, ఆ గడ్డితో గోవును మేపితే పుణ్యం. నిజానికి ఇవి అత్యల్ప విషయాలు. వీటికి కోటిరెట్లు అధికమైన బ్రాహ్మణహత్య పర్యంతముగల అనేకమైన పాపకృత్యాలను చేస్తున్నాడు మానవుడు. రోగానికి మందు ఉన్నట్లే ప్రతి పాపానికి పరిహారం కూడా ఉంది. పాపపరిహారార్థం దానములను చెయ్యవలసిందని చెప్పారు పూర్వ ఋషులు. దప్పిగొన్న వానికి మంచినీళ్ళను దానం చెయ్యటం మొదలుగా అన్నదాన, వస్త్రదాన, గృహదాన, భూదాన, విద్యాదాన, గోదాన, సువర్ణదాన పర్యంతము అనేక దానాలను మహర్షులు చెప్పారు. దానాలను చెయ్యటం వలన పాపక్షయం ఒక్కటే గాదు పుణ్యలోకప్రాప్తికూడా లభిస్తుంది.

ఐతే దానం ఎవరికి చేయాలి అనే ప్రశ్న రాగా చక్కని గుణశీలాదులుగల వేదశాస్త్ర పారంగతుడైన బ్రాహ్మణునకు మాత్రమే దానం చేయాలని ఋషులు చెప్పారు. విప్రుని ఆశ్రయించుకొని వేదశాస్త్రాదులు బ్రతుకుతున్నాయి. అతి కఠినమైన వేదశాస్త్రాధ్యయనం చేసి బ్రాహ్మణుడు జీవిస్తున్నాడు. ఆపైన బ్రాహ్మణునకు యజన, యాజన, అధ్యయన, అధ్యాపన, దాన, ప్రతిగ్రహములనే షట్కర్మాధికారములున్నాయి. బ్రాహ్మణునకు మాత్రమే ఇచ్చేది దానం. ఇతరులకిచ్చేది ధర్మం. బ్రాహ్మణులకు అన్నం పెడితే అది సమారాధన ఇతరులకు అన్నం పెడితే అది సంతర్పణ. సర్వధర్మ సారభూతమైన అహింసా వ్రతంతో బ్రాహ్మణుడు జీవిస్తున్నాడు. వేదాధ్యయనంతో, అగ్నికార్యంతో సకల దేవతా సమూహాన్ని సంతృప్తులుగా చేస్తున్నాడు. బ్రాహ్మణుడు మాతృగర్భం నుండి బయటకు వస్తూనే "నా వలన ఏ ప్రాణికీ భయం లేదు!" అని సకల ప్రాణులకు అభయమును ఇస్తూ జన్మిస్తున్నాడు. అట్టి బ్రాహ్మణుడు గ్రామానికి ఒక్కడున్నా ఆ గ్రామం సకల సౌభాగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. గ్రామంలోని సంపన్నులైన పెద్దలు ప్రయత్నపూర్వకంగా ప్రార్థించి అయినా సరే అట్టి బ్రాహ్మణుని గ్రామంలో నిలుపుకోవాలి. అట్టి కృత్యం సర్వులకు శ్రేయోదాయకం.

మునులారా! దానకృత్యాలను ఆచరించటంలోగల పరమార్థాన్ని చెపుతున్నాను వినండి. వేదాధ్యయన సంపన్నుడు, స్నాన సంధ్యానుష్ఠాన తత్పరుడు, జ్ఞాననిష్ఠాగరిష్ఠుడు, వేదశాస్త్ర అధ్యాపకుడు ఐన వానికి మాత్రమే దానమివ్వాలి. అట్టి బ్రాహ్మణుడు లభించని యెడల చక్కని గుణశీలాదులు కల బ్రాహ్మణునికి దానమివ్వాలి. వేదశాస్త్రాధ్యయనం చేసిన బ్రాహ్మణుని దానాదులచే ప్రోత్సహిస్తే వేద విద్యను ప్రోత్సహించినట్లే. తద్వారా సకల దేవతలు సుప్రసన్నులవుతారు. వేదం పరమాత్మ స్వరూపం కదా!

'నేను' అనే అహంకారము, 'నాది' అనే మమకారము ఈ రెండే మానవుని దుఃఖానికి కారణం. దానాదులను ఆచరించటం వలన ఆ రెండింటి నుండి మానవుడు ముక్తుడవుతాడు. ఎలాగంటె నిజానికి జీవుడు తత్త్వంలో ఈశ్వరుడే ఐనా 'నేను' అనే అహంకారం వలన పరిచ్ఛిన్న భావాన్ని పొంది అఖండ అద్వయ చైతన్యం నుండి వేరై, తననుతాను జీవునిగా భావించుకొంటూ ద్వైత భావాన్ని పొందుతున్నాడు. 'అహం' భావనతో కర్మాచరణ నిమగ్నుడవుతున్నాడు. తద్వారా ధనార్జన చేస్తున్నాడు. ఆ ధనంతో గృహ, ఆరామ, క్షేత్ర, వాహన, సువర్ణాదికాలను సముపార్జిస్తున్నాడు. 'నేను' అనే ద్వైత భావంతో కష్టపడి ధనార్జన చేసి సంపాదించుకొన్న వస్తువులందు సహజంగానే అహంకార-మమకారములు

ఏర్పడుతాయి. ఆ రెంటిని విడిచిన వాడెవడో వాడే వాటిని దానం చేయగలుగుతాడు. నాది అనే మమకారాన్ని చంపుకొనకుండా ఒక జీర్ణవస్త్రాన్ని కూడా బిచ్చగానికి సైతం ధర్మం చెయ్యలేం గదా! ఆ విధంగా దానాదికాది కర్మాచరణ అహంకార, మమకార నిర్మూలనకు తోడ్పడి చిట్టచివరకు జీవునకు ఆత్యంతిక దుఃఖనివృత్తి రూపము, పునరావృత్తి రహితము ఐన అద్వైత మోక్షసిద్ధికి హేతువు అవుతూన్నది! కేవలం ఒక్క త్యాగం వలన మాత్రమే మానవుడు మృత్యుభయాన్ని వీడి అమృతుడు అగుచున్నాడు! ఇది వేదం చెప్పిన సత్యం.

బ్రహ్మాండ దానమహిమ
బ్రహ్మాండ వర్ణనము

సూత మహర్షి ఋషులతో ఇలా అంటున్నాడు. "మునులారా! అన్ని దానములలోను బ్రహ్మాండదానం చాలా గొప్పది. ఈ దానం మానవుని ప్రకృతిబంధం నుండి తప్పించి ముక్తికి హేతుభూత మవుతూన్నది. ఈ దానాన్ని చేయగోరే మానవుడు ముందుగా శివపురాణాన్ని పఠించి, తద్వారా బ్రహాండ స్వరూపాన్ని ఆకళింపు చేసికొని అట్టి బ్రహ్మాండాన్ని గుణశీలాదులు కల బ్రాహ్మణునకు దానిమిస్తూన్నట్లుగా భావించి ప్రత్యామ్నాయంగా ధనాన్ని దానం చెయ్యాలి. ముందుగా బ్రహ్మాండ స్వరూపాన్ని సంక్షేపంగా చెపుతాను వినండి. నామరూపాదులు లేని శివతత్త్వం నుండి ఆవిర్భవించిన త్రిమూర్తులలో ఒకడైన బ్రహ్మనుండి ఈ బ్రహ్మాండం వ్యక్తమైంది. ఈ బ్రహ్మాండంలో ఏడు ఊర్ధ్వలోకములు, ఏడు అధోలోకములు ఉన్నాయి. వీటికి ఆధారభూతము సర్పము, సర్పమే విష్ణువు అని కీర్తించబడుతూన్నది. దేవతలు, ఋషిగణాలు ఆ విష్ణువునే అనంతుడు అని ప్రశంసిస్తున్నారు. ప్రకాశించే స్వస్తికయే ఆభరణంగాగల అనంతుడు తన వేయి తలలతో ఈ బ్రహ్మాండాన్ని ధరిస్తున్నాడు, భరిస్తున్నాడు. ఆ అనంతుడు అనంత శక్తిస్వరూపుడు. శేషుడు అనికూడా పిలువబడే ఆ అనంతుడే సంకర్షణుడు. అతనే రుద్రుడు. ప్రళయకాలంలో అతని నోటినుండి భయంకరమైన విషాగ్ని జ్వాలలు ఉద్భవించి లోకాలను దహించివేస్తాయి. ఆ అనంత శక్తిమంతుడైన శేషుడు ఈ భూమిని సిగపూవుగా భరిస్తున్నాడు. మదఘూర్ణిత లోచనుడైన అనంతుడు సాగినప్పుడు కుల పర్వతకానన సహితమైన ఈ భూమి కంపిస్తుంది.

అతల-వితల-సుతల-రసాతల-తల-తలాతల-పాతాళములు అను అధోలోకములు ఏడున్నాయి. అక్కడి భూములు, ప్రాసాదములు అన్నీకూడా శ్రేష్ఠమైన రత్నములచే ప్రకాశిస్తూ ఉంటాయి. అవన్నీ హిరణ్మయ సమృద్ధిగల లోకములు. అక్కడ సూర్యచంద్ర ప్రకాశం ఉండదు. స్వచ్ఛమైన మణుల ప్రకాశంచే ఆ లోకాలు వెలుగుతూ ఉంటాయి. అక్కడ

పగలు, రాత్రి, చలి, ఎండకాలము అనేవి లేవు. ఆ లోకాలు స్వర్గంకంటె ఉన్నతమైన భోగభూములు. అక్కడ దానవులు, దైత్యులు, నాగజాతులు, మహానాగములు, రాక్షసులు నివసిస్తూ ఉంటారు. మొదటగా వాటిని చూచి లోకానికి వెల్లడి చేసినవాడు నారద మహర్షి.

మునులారా! మీకిప్పుడు నరకములను గూర్చి చెపుతున్నాను వినండి. దుఃఖమునకే పాపమని, నరకమని పేర్లు. సుఖమునకే పుణ్యమని, స్వర్గమని పేర్లు. సుఖములన్నీ దుఃఖాంతములే! మానవుని అంత్యావస్థ అయిన మరణదశలో అనుభవించే మరణయాతనకంటె మించిన దుఃఖం ఏముంటుంది? అట్టి మరణభయం నిత్యము నీడలా వెన్నాడుతుంటె సుఖం అనేది ఎక్కడుంది? సుఖం అంటే మరణభయం కొద్దిసేపు స్మృతిపథంలో లేకపోవటమే! వాక్కుచే పరనింద మొదలుగా గోహత్య, బ్రహ్మహత్య పర్యంతము పాపపు పనులను చేసిన మనుజులు ఆ నరకలోకాలలో దారుణమైన దుఃఖాన్ని అనుభవిస్తారు. క్రియకు-ప్రతిక్రియ అలాగే చర్యకు ప్రతిచర్య తప్పదు. కర్మలు ఎప్పుడూ నిష్ఫలం కావు. నిష్ఫల కర్మ అంటూ ఉండదు.

కర్మలన్నింటిలోను సారము (పంట), వ్యర్థము (పొల్లు) అనే ఈ రెండూ ఉంటాయి. మధుర పానీయాలు, పాలు, పండ్లు, జలము, అన్నము వీటినుండి కూడా మాలిన్యం ఉత్పన్నమవుతున్నది కదా! బంగారంలో సైతం మాలిన్యం ఉంది కదా! విధాత చేసిన సృష్టికార్యంలో సారభూతమైన లోకాలు ఉత్తమ లోకాలైన స్వర్గాదులు కాగా... మలిన (వ్యర్థ) పదార్థాలతో కూడుకొన్న లోకాలు నరకాదులు. మరణానంతరం పుణ్యకార్యాచరణ చేసిన జీవులకు ఉత్తమలోకప్రాప్తి, పాపాలను చేసిన జీవులకు దుఃఖభూయిష్ఠమైన నరకలోక ప్రాప్తి అనే వ్యవస్థ సృష్టి ప్రారంభంలోనే పితామహునిచే నిబంధన చేయబడి ఉంది. సృష్టి అంతా ద్వైతమే! సృష్టికర్త అద్వితీయుడు! సృష్టికర్త అయిన పితామహుని కర్మజనితమైన సృష్టికార్యంలో వెలువడిన వ్యర్థపదార్థములతో కూడుకొన్న లోకాలకే నరకములు అని పేరు. ద్వైతం అంటే రెండు లేదా అంతకంటె ఎక్కువ అని అర్థం. కర్మ ఎప్పుడూ ద్వైతమే! ద్వైతం ఉన్నచోట సుఖ దుఃఖములు తప్పవు. కేవలం సారభూతమైన దానిని ఆశించియే మానవుడు కర్మలను ఆచరిస్తాడు. ప్రపంచం ద్వైతం కనుక సారంతోపాటే వ్యర్థ పదార్థం కూడా పుడుతుంది. సారమైనది సుఖాన్ని ఇస్తుంది. మాలిన్యం (వ్యర్థ పదార్థం) దుఃఖాన్ని కల్పిస్తుంది. పానీయం నుండి మూత్రం, అన్నం నుండి మలం, ధాన్యం నుండి పొల్లు, చెరకు నుండి పిప్పి ఇలా ప్రతి ఒక్క దాని నుండి వ్యర్థం పుడుతూన్నది. కర్మలు ఎప్పుడూ

మలినాశ్రయములే! పంచభూతాత్మకమైన సృష్టికార్యంలో మాలిన్యం లేకుండా ఎలా ఉంటుంది? జ్ఞానం ఒక్కటే ఏ మాలిన్యము అంటని వెలుగుముద్ద. అట్టి స్వయం ప్రకాశస్వరూపుడు శివుడు!

ఈ ద్వైత ప్రపంచంలో, కేవలం సుఖాన్ని మాత్రమే కోరి మానవుడు ఆచరించే కర్మలనుండి, సుఖప్రాప్తికి హేతుభూతమైన కర్మఫలసారము (పరిశుద్ధము), దానితోపాటే మాలిన్యము (అపరిశుద్ధం) పుడితే పుట్టనీయండి! అది పాపం ఎందుకవుతుంది? పాపం అనేది ఎలాపుడుతుంది? అనేది ప్రశ్న? మునులారా! వినండి! దుర్బుద్ధితో, దుష్టచింతనతో, ద్రోహతలంపుతో, మలినమైన మనస్సుతో, కపట చిత్తంతో, చేసిన కర్మ ఏదైనా పాపకృత్యమే అవుతుంది. దానికి ఫలం మలినభూయిష్ఠమైన, దుర్గంధ పూరితమైన నరకం. అంతేకాదు...

అవిద్యతో, అజ్ఞానంతో, అహంకారంతో చేసిన పుణ్యకర్మలుకూడా బంధములే అవుతాయి. అవి మోక్ష హేతువులు కాజాలవు. సర్వము ఈశ్వరాధీనం అనే జ్ఞానంతో చేసిన కర్మలు ముక్తి సాధనములు అవుతాయి. స్థావరజంగమాత్మకమైన ఈ జగత్తు అంతయు జ్ఞాన స్వరూపుడైన శివునికంటె భిన్నంగా లేదు అను నిశ్చయ జ్ఞానమే అద్వైతసిద్ధికి హేతువు. ఈ జ్ఞానాన్ని పొందటంకంటె మించిన జపం, తపస్సు, యోగం, అగ్నిహోత్రం, హోమం, వ్రతం, ఉపాసన, దానం, ప్రాయశ్చిత్తం ఇత్యాది కర్మలు లేనేలేవు. కర్మాచరణ జ్ఞానలబ్ధి కొరకే. అట్టి జ్ఞానాన్ని పొందిన తదుపరి కర్మలతో పనేముంది?

నిష్కామ కర్మాచరణ-ఈశ్వరార్పణబుద్ధి ఈ రెండే మోక్ష సాధనాలు! సుఖప్రాప్తి హేతువులు! మిగిలినవన్నీ దుఃఖప్రాప్తికి హేతువులు.

పురుషార్థ నిరూపణం

ఋషులారా! జీవుడు తత్త్వంలో శివస్వరూపుడై ఉండికూడా అజ్ఞానంచే ఆవరింపబడి, ప్రకృతిమాయా మోహితుడై దుఃఖపీడితుడగుచున్నాడు. ఎవరైతే పవిత్రమైన కర్మలను చేస్తూ, పరిశుద్ధమైన మనస్సుతో, నిత్యము శివుని చక్కగా ఆరాధిస్తారో వారు ఇహంలో దుఃఖాన్ని దాటి మరణానంతరం శివసాయుజ్యాన్ని పొందుతారు. జన్మయెత్తిన ప్రతి మానవుడు ధర్మ-అర్థ-కామ-మోక్షములనే చతుర్విధ పురుషార్థాలను తప్పక సాధించాలి. దుర్లభమైన మానవజన్మను పొంది కూడా ఎవడైతే వాటి కొరకు ప్రయత్నించడో వాని జన్మ వ్యర్థం. ముందుగా ధర్మ స్వరూపాన్ని తెలుసుకొని ఆపైన ధర్మబద్ధమైన అర్థకామాలను సాధించిన వానికి మోక్షం కరతలామలకం.

మునులారా! ఎవరైతే పవిత్రమైన కర్మలను ఆచరిస్తూ, పరిశుద్ధమైన మనస్సుతో నిత్యము ఆ శివుని చక్కగా ఆరాధిస్తారో వారికి శివ సాయుజ్యం నిశ్చయం. దుఃఖ రహితమైన శివలోకాన్ని తపస్సు చేయనివారు పొందలేరు. సకలదేవతా సమూహాలు, ఋషులు మరియు మునులు తపస్సు యొక్క ప్రభావం చేతనే స్వర్గాది ఉత్తమ లోకాలను పొందియున్నారు. ఇది ప్రత్యక్షం మరియు సత్యము. సర్వమును తపస్సుచే సాధింపవచ్చు. త్రిమూర్తులు, దేవీమూర్తులు అందరు నిత్యము తపస్సునందు ఉన్నవారై దుర్లభమైన ఫలాన్ని పొందారు.

ఆ తపస్సు సాత్త్విక-రాజస-తామస భేదంచే మూడు విధాలుగా ఉంది. దేవతలు, ఊర్ధ్వరేతస్కులగు యతులు సాత్త్విక తపస్సును, దానవులు మరియు మానవులు రాజస తపస్సును, రాక్షసులు మరియు క్రూరమైన పనులను చేయుటయందు ఆసక్తిగల మానవులు తామస తపస్సును ఆచరిస్తారు. జపము, ధ్యానము, భక్తితో దేవతలను పూజించుట అనునవి శుభకరమైన సాత్త్విక తపస్సు. కోర్కెలతో చేసేది రాజసిక తపస్సు. దేహాన్ని శోషింపచేసి, మిక్కిలి పీడకు గురిచేసి సహించుటకు కష్టమైన విధంగా చేస్తే అది తామసిక తపస్సు.

జీవుని పుట్టుక

మునులారా! మీకిప్పుడు జీవుని పుట్టుక క్రమాన్ని సంగ్రహంగా వివరిస్తున్నాను వినండి. దీని శ్రవణం వలన వైరాగ్యం కలుగుతుంది. తద్వారా సంసారం మీద విరక్తి కలుగుతుంది. విరక్తి కలిగిన మరుక్షణంలో జన్మరాహిత్యానికి ఉపాయాన్ని అన్వేషిస్తాడు మానవుడు. అట్టి పునరావృత్తి రహితమైన స్థితియే మోక్షం.

మనం తినే ఆహారం జీర్ణమైన తదుపరి రెండు విధాలుగా విడిపోతుంది. అందులో సారభూతమైన అన్నరసం దేహంలో ప్రసరించి శరీరానికి పుష్టిని చేకూరుస్తుంది. మాలిన్యం విసర్జింపబడుతుంది. చెవులు, కన్నులు, ముక్కు, నాలుక, దంతములు, జననేంద్రియము, విసర్జనేంద్రియము, గోళ్ళు, శరీరము ఇవి మాలిన్య స్థానములు. గులిమి, పుసి, కఫము, చెమట, మలమూత్రములు ఇత్యాదులు ఈ మాలిన్యములు పండ్రెండు రకాలుగా ఉన్నాయి. నాడులన్నీ అన్నివైపులనుండి హృదయ పద్మానికి కలుపబడి ఉన్నాయి. మన శరీరంలో ఉండే ప్రాణశక్తి సూక్ష్మమైన అన్నరసాన్ని నాడుల యొక్క ముఖ స్థానాలలో స్థాపిస్తుంది. అంతేకాకుండ ప్రాణశక్తి ఆ నాడులను అన్నరసంతో నింపుతుంది. ఈ విధంగా అన్నరసం దేహమంతా ప్రసరిస్తుంది. తరువాత నాడుల మధ్యనున్న అన్నరసాన్ని శరీరం జీర్ణం చేసికొని తనలో కలుపుకొంటుంది. ఈ జీర్ణ ప్రక్రియ లేదా పచనం రెండు విధాలుగా సాగుతుంది.

ముందుగా శరీరం చుట్టూ చర్మం నిర్మాణమై తరువాత రక్తం పుడుతుంది. రక్తం నుండి రోమములు, మాంసము పుట్టుతాయి. మాంసం నుండి శిరస్సుపై కేశములు కండరములు సంభవిస్తాయి. కండరముల నుండి ఎముకలు, ఎముకల నుండి గోళ్ళు మరియు ఎముకల మధ్యనుండే మజ్జ సంభవిస్తాయి. అన్నరస పరిణామక్రియలో ఈ మజ్జనుండే శుక్రం ఉద్భవిస్తుంది. శుక్రమే సంతాన హేతువు. ఈ విధంగా అన్నం పన్నెండు రూపములుగా పరిణమిస్తోంది. అన్నం నుండి శుక్రము, శుక్రము నుండి మరొక చేతన దేహము పుట్టుతూన్నది.

దోష రహితమైన శుక్రము ఋతుకాలమందు స్త్రీ జననేంద్రియ మందు నిక్షిప్తమై అచటి ప్రాణశక్తితో కూడిన, దోషరహితమైన స్త్రీ యొక్క రక్తంతో ఐక్యమవుతూన్నది. అజ్ఞానావృతుడైన జీవుడు పూర్వ కర్మలచే నియంత్రింపబడి స్త్రీ యోని యందు శుక్రమును నిక్షేపించు సమయంలో సూక్ష్మరూపంలో స్త్రీ గర్భంలో ప్రవేశిస్తాడు. ఆ విధంగా స్త్రీ పురుషుల శోణిత–శుక్రసముదాయం గర్భాశయము అనే ఏక స్థానమందు కలుసుకొని ఒక రోజు సమయంలో పిండ రూపాన్ని ధరిస్తుంది. ఐదు రోజులలో ఆ పిండం బుడగ ఆకారాన్ని పొందుతుంది. ఆ బుడగ ఏడు రోజులలో మాంసపేశంగా మారుతుంది. ఆ మాంసపు ముద్దలో రెండు మాసాల లోపులో మెడ, తల, భుజములు, వెన్నెముక, పొట్ట, చేతులు, కాళ్ళు, పార్శ్వ భాగములు, నడుము ఇలా ఒక పూర్ణ శరీరం పుట్టటానికి అవసరమైన సంస్థానం ఏర్పాటవుతుంది.

మూడు మాసాలలో కీళ్ళు, నాలుగు మాసాలలో వ్రేళ్ళు, అయిదు మాసాలలో క్రమంగా నోరు, ముక్కు, చెవులు ఏర్పాటవుతాయి. ఆరు మాసముల లోపులో పళ్ళవరుస, జననేంద్రియము, గోళ్ళు మరియు చెవుల లోపలి రంధ్రము ఏర్పాటవుతాయి. ఏడు మాసాలలో విసర్జనేంద్రియము, మూత్రాశయము, జననేంద్రియము, నాభి మరియు శరీర అవయవముల యందలి కీళ్ళు నిర్మాణమై ఆ శిశువు సర్వావయవ పరిపూర్ణుడై తల్లిగర్భంలో జరాయువు (మావి లేక పిండాన్ని చుట్టి ఉండే పొర) చేత కప్పబడి ఉంటాడు.

ఆ శిశువు తల్లి తీసికొనే ఆరు రుచులతో కూడిన ఆహారాన్ని నాభినాళం ద్వారా స్వీకరిస్తూ దినదిన ప్రవర్ధమానుడై ఉంటాడు. అంగప్రత్యంగ పూర్ణుడైన ఆ జీవుడు స్మృతి జ్ఞానాన్ని కలిగి ఉంటాడు. ఆ జ్ఞానం కారణంగా పూర్వ జన్మలలో తాననుభవించిన సుఖ దుఃఖాలు, చేసిన పుణ్య పాపకర్మలు ఇవన్నీ ఆ జీవునికి స్వప్నంలో వలె సాక్షాత్కరిస్తాయి.

అప్పుడా జీవుడు మనసులో ఇలా అనుకొంటాడు: "నేను గతంలో అనేక లక్షల జన్మలను ఎత్తాను. పుట్టిన ప్రతిసారి మరణించాను. మరణించిన ప్రతిసారి తిరిగి జన్మించాను. ఈ జన్మలో పుట్టిన వెంటనే తిరిగి జన్మలేని విధంగా మోక్షం కొరకు తప్పక ప్రయత్నిస్తాను. నేను ఈ గర్భవాస నరకం నుండి బయట పడగానే సంసార బంధం నుండి విముక్తిని కలిగించే శివజ్ఞానాన్ని గూర్చి అన్వేషిస్తాను!" అని తలపోస్తూ ఉంటాడు.

మునులారా! గర్భవాస క్లేశాన్ని గురించి చెపుతున్నాను వినండి! మాతృ గర్భోదకంలో ఉన్న శిశువు (జీవుడు) సముద్రంలో మునిగి పోతూన్న మానవునివలె మహాభయంతో కూడి మహా దుఃఖాన్ని అనుభవిస్తూ ఉంటాడు. మావిచే కప్పబడిన శిశువు (జీవుడు) మహాపర్వత శకలాలమధ్య భారంచే నలిగిపోతున్న వానిలా రోదిస్తూ ఉంటాడు. మాతృగర్భమనే బానలో ఉండి జఠరాగ్నిచే తప్తమై పోతూన్న జీవుడు, బానలో సలసల మరుగుతూన్న నీటిలో ఉడికిపోతూన్న శిశువులా రోదిస్తూ ఉంటాడు. ఎఱ్ఱగా కాల్చిన సూదులతో నిరంతరంగా పొడిచినప్పుడు ఎట్టి దుఃఖం కలుగుతుంతో గర్భస్థ జీవుడు అంతకంటె మహా దుఃఖాన్ని అనుభవిస్తూ ఉంటాడు. ప్రాణులకు గర్భవాస దుఃఖాన్ని మించిన ఘోరము, అతి సంకటము అయిన పెద్ద దుఃఖం మరొకటిలేదు. ఈ దుఃఖం ఏడవనెల నిండగానే మొదలవుతుంది. అందువల్లనే ధర్మాత్ములైన జీవులు ఏడునెలలు నిండగానే గర్భవాస క్లేశాన్ని చవిచూడకుండానే జన్మిస్తారని పెద్దలంటారు.

మునులారా! గర్భవాస క్లేశాన్ని మించిన మహా క్లేశాన్ని, దుఃఖాన్ని ప్రసవ సమయంలో అనుభవిస్తాడు జీవుడు. రంపపుపళ్ళవంటి యంత్రకోరల మధ్య చిక్కుకొని నలిగిపోతున్న మానవునిలా; యోనియంత్ర కండరాల చేత పీడింపబడిన వాడై, జన్మ సమయంలో మహా దుఃఖాన్ని అనుభవిస్తూ, తల్లిని బాధకు గురిచేస్తూ, తాను బాధను అనుభవిస్తూ జన్మిస్తాడు పాపియైన జీవుడు. యంత్రంలో నలగకొట్టబడిన చెరుకుగడవలె నలిగిపోతూ, పాపం అనే రోకలి నెత్తిమీద మొత్తుతున్నదా అనునట్లు అధికమైన పీడను పొందుతాడు జన్మసమయంలో పాపియైన జీవుడు. గానుగలో ఆడబడిన నువ్వులు క్షణంలో పిప్పి అవుతాయి. ఆ విధంగానే జన్మసమయంలో పీడను పొందిన జీవుని దేహం నిస్సారమవుతుంది.

మునులారా! ఈ దేహం భోగ తృష్ణకు, మోహానికి, రాగద్వేషాలకు, అజ్ఞానానికి నిలయమైన ఒక మట్టికొండ వంటిది. ఎముకలే స్తంభాలు! పాదాలే క్రిందిమట్టు! కండరాలే త్రాళ్ళు, రక్తమాంసములే అడుసు! కేశములు, రోమములు, గోళ్ళు ఇవియే రక్షణకొరకు

నిర్దేశింపబడిన కంచె, చర్మమే పైన కప్పిన ఆవిరిగడ్డి! నోరే ద్వారం! పెదవులే తలుపులు! నాలుక అడ్డగడియ! నోరు మినహా మిగిలిన నవరంధ్రాలు కిటికీలు.

జీవుడు జనన సమయంలో ఒకదానితో ఒకటి చిక్కుకొనియున్న అవయవములు కలవాడై ఒక ఇరుకు మార్గంద్వారా అతికష్టం మీద బయట పడతాడు. ఆ సమయంలో ఒక బంధ స్థానం నుండి బయటపడిన ఆ దేహం మల మూత్రాదులతో, రక్తంతో నిండి ఉంటుంది. ఈ కారణాల వల్లనే జ్ఞానులైన ఋషులు జీవునికి మరణంకంటె పుట్టుకే బహు దుఃఖ క్లేశ భూయిష్ఠమైనదని నొక్కి వక్కాణించారు. గర్భవాసం నుండి బయటకు రాగానే జీవుడు పూర్వజన్మ స్మృతి జ్ఞానాన్ని కోల్పోతాడు. ఈ శరీరంలో మూడువందల అరవై ఎముకలు, అయిదు వందల కండరాలు, మూడున్నర కోట్ల రోమాలు ఉన్నాయి. ఈ దేహంలో అంతటా అదే సంఖ్యలో నాడులు వ్యాపించి ఉన్నాయి. నాడులలో కొన్ని స్థూలంగా ఉండి కంటికికాన వస్తాయి. కొన్ని సూక్ష్మంగా ఉండి కంటికి కానరావు. దేహం లోపల స్రవించే మాలిన్యాలు చెమట రూపంలో బయటకు వస్తాయి. దీనికి ముప్పదిరెండు పళ్ళు, ఇరవై గోళ్ళు ఉన్నాయి.

దేహంలో పిత్తం యొక్క పరిమాణం ఒక కుడవము (పండ్రెండు దోసిళ్ళు), కఫం యొక్క పరిమాణం ఒక ఆఢకము (శేరు), వస (మాంసంలోని క్రొవ్వు) యొక్క పరిమాణం ఇరువది పలములు, కుంకుమరంగుగల ఘన పదార్థం పది పలములనియు చెప్పబడింది. క్రొవ్వు పదార్థం యొక్క పరిమాణం పదిహేనున్నర పలములు, శుద్ధ రక్తం మూడు పలములు శుక్రం అర్ధ కుడవకం (ఆరు దోసిళ్ళు) అని విజ్ఞులు చెప్పారు. ప్రాణుల దేహశక్తి మరియు ప్రజనన సామర్థ్యము శుక్ర ధాతువుమీద ఆధారపడి ఉంటుంది. ఒక దేహంలోని మాంసం వేయి పలముల పరిమాణం కలిగి ఉంటుంది. రక్తం యొక్క పరిమాణం వంద పలములు, మల మూత్రములు నాలుగు నాలుగు గుప్పిళ్ళ పరిమాణంలోను ఉంటాయి. ఈ అనిత్యమైన దేహమనే గృహంలో నిత్యమైన ఆత్మనివసిస్తూన్నది. విశుద్ధమైన ఆత్మకు కర్మబంధం వలన అశుచి అయిన ఈ దేహం నిర్మితమైంది.

దేహ స్వభావం

మునులారా! దేహం స్వభావం చేతనే అశుచియైనది. శుక్రశోణిత సంయోగంచే పుట్టిన ఈ దేహం నిరంతరము మలమూత్రాదులతో నిండి ఉంటుంది. అందువల్లనే ఈ దేహం అశుచి అని చెప్పబడింది. లోపల మలంతో కూడియున్న కుండ బయట ఎంత శుభ్రంగా ఉంచినా అది మలపాత్రయే అవుతుంది. పరమ పవిత్రమైన పంచగవ్యాన్ని (పాలు, పెరుగు, వెన్న మొదలగు వాటి మిశ్రమం) యజ్ఞ

ప్రసాదాన్ని భక్షించిన తర్వాత కూడ వెంటనే ఈ దేహం అశుచి అవుతూన్నది. మధురమైన అన్నము, పరిమళోల్లాసభరిత పానీయములు ఈ దేహాన్నిపొంది శ్రీఘ్రంగా అశుచి అవుతున్నాయి. కొండనుండి జలం కొండవాగుల రూపంలో ప్రవహించినట్లు ఈ దేహం నుండి శ్లేష్మము, కఫము, స్వేదము, మలమూత్రాది మాలిన్యాలు నిరంతరము స్రవిస్తూనే ఉంటాయి. మల విసర్జన, మూత్రపతన స్థానములు అపవిత్రములు. దేహమునుండి వెలువడే మాలిన్యాన్ని ముట్టుకొన్న వెంటనే చేతిని జలంతో పరిశుద్ధం చేసికొంటున్నాం కదా! అట్టి మాలిన్యానికి ఆశ్రయ భూతమైన ఈ దేహానికి బానిసయైన మానవుడు భ్రష్టుడు కాడా ఏమి? అందువల్లనే జ్ఞానులెప్పుడూ దేహభ్రాంతిని విడిచి ఆత్మనిష్ఠులై ఉంటారు.

దుర్గంధాన్ని ఆ ఘ్రాణించి ముక్కు మూసికొనే మానవుడు తన మాలిన్యాన్ని గుర్తించలేక పోవటం ఆశ్చర్యం కదూ! ఈ సర్వ జగత్తులోను మానవ దేహం మాత్రమే అతిశయించిన మాలిన్యాలను కలిగిఉంది. ఈ మాలిన్యాలను తొలగించుకొనే నిమిత్తమై శౌచ క్రియలు బోధింపబడ్డాయి. ఇవి బాహ్య ఆభ్యంతర భేదం చేత రెండు విధాలు. ఇందులో ఆభ్యంతరమైన భావశుద్ధి ప్రధానమైనది. దుష్టమైన అంతఃకరణగల మానవుడు ఎన్ని ధర్మకార్యాలను చేసినా అవన్ని వ్యర్థమే! అగ్నిలో దూకినా పరిశుద్ధుడు కాలేడు. నదులలో చేపలు సంచరించినా గుడిగోపురాలపై పక్షులు నివసించినా వాటికి భగవద్భావం లేని కారణంగా ఫలము లభించదు. అందువల్ల భావశుద్ధి ప్రధానమైనది.

కర్మలన్నింటి యొక్క పవిత్రత పూర్తిగా అంతఃకరణ శుద్ధిమీదనే ఆధారపడి ఉంది. ఒక స్త్రీ భర్తను కౌగిలించుకొని ముద్దాడినప్పుడు, కుమారుని ఆలింగనం చేసికొని ముద్దాడినప్పుడు మనోభావం వేరుగా ఉంటుంది గదా! కనుక మునులారా! దేహం ఎంత అశుచియైనదైనా వైరాగ్యం అనే మట్టితో తోముకొని, జ్ఞాన జలంతో కడుక్కొంటే శుచి అవుతుంది. అలాటి పరమ జ్ఞానులైన వారి శరీరాలు పుణ్యతీర్థాలతో సమానం. వారికి జంగమ తీర్థములు అనిపేరు. వారు స్వతః పవిత్రులు. ఇతరులను పవిత్రులను చేయగలరు కూడ! "నేను" అనే అహంకారం, "నాది" అనే మమకారం ఈ రెండే దుఃఖ హేతువులు. ఈ అహంకార మమకారాలను జయించిన వారే జ్ఞానులు. జీవుడు గర్భస్థుడై ఉండగా కొంత వివేకాన్ని కలిగి ఉంటాడు. గర్భం నుండి బయటకు రాగానే ఆ వివేకాన్ని కోల్పోతాడు. భయంకరమైన మోహంలో చిక్కుకొంటాడు. చిక్కుకొని ఆత్మస్వరూప వివేకాన్ని, శివతత్వాన్ని తెలుసుకోలేక కర్తవ్యాన్ని విడిచి కర్మబంధంలో చిక్కుకొని తిరిగి చావు పుట్టుకల చక్రభ్రమణంలో పరిభ్రమిస్తూ ఉంటాడు.

మానవునికి స్వర్గ-మోక్షాలను సంపాదించిపెట్టే గొప్పది దివ్యమైనది అయిన జ్ఞానాన్ని సాక్షాత్తు పరమ శివుడే శివమహాపురాణ రూపంలో మనకు అందించాడు. ఈ శివజ్ఞానం మనకు ఉపలభ్యంగా ఉన్నా ఆత్మ శ్రేయస్సు కొరకు ప్రయత్నించక పోవటం అవివేకం కదూ! మానవ జీవితంలో సుఖమనేది కల్ల! సుఖమనేది భ్రాంతి మాత్రమే. కోరికలే పట్టిపీడిస్తున్నాయి. అవి తీరటమనేది ఉండదు. ఒకదానివెంట మరొకటి పుడుతూనే ఉంటాయి. కుష్ఠ వ్యాధి పీడితుడు దేహాన్ని గోకుకొని నప్పుడు, కురుపునుండి చీము బయటకు వచ్చినప్పుడు ఎలాటి సౌఖ్యం కలుగుతున్నదో అట్టి సౌఖ్యమే కామభోగములయందు కూడా ఉన్నది అని అభిజ్ఞులు చెపుతున్నారు. అతి వేగంగా మలమూత్రాదులు బాధిస్తూన్నప్పుడు వాటి విసర్జన సమయంలో పొందే సుఖం వంటిదే స్త్రీ పురుషు లిరువురు కామభోగంలో పొందుతున్నారని తత్త్వాన్ని తెలిసిన జ్ఞానులు అంటున్నారు. కాని మూర్ఖులు అందులో ఏదో అధిక సౌఖ్యం ఉందని భ్రమిస్తున్నారు.

నారద-పంచచూడ సంవాదంలో కామభోగములు సర్వదోషాలకు ఆశ్రయమని, సర్వ పాప కృత్యాలకు హేతువులని, అవి యథార్థములు కావని, వాటియందు నిజమైన సుఖం లేశమాత్రమైనా లేదని పంచచూడ అనే అప్సరస చెప్పింది. సమ్మానం వెంట అవమానం, సంయోగం వెంట వియోగం, యౌవనం వెంట వృద్ధాప్యం, బ్రతుకు వెంట మృత్యుభయం నీడలా వెన్నంటె ఉన్నాయి. ఇక సుఖానికి తావెక్కడు? జరాభార పీడితుడైన వాడు ఈగను సైతం అదలించ లేడుగదా! అట్టిచో ధర్మార్థకామమోక్ష పురుషార్థాలను ఎలా సాధించగలడు? అందుకని యవ్వనంలోనే ధర్మాన్ని అనుష్ఠించి శివజ్ఞానాన్ని పొందాలి.

నారద-పంచచూడ సంవాదం - కామోపభోగమందలి దోషములు

మునులారా! దుష్ట స్త్రీ స్వభావాన్ని గురించి పంచచూడ అనే అప్సరస నారద మహర్షికి చెప్పిన విషయాన్ని మీకు చెపుతున్నాను శ్రద్ధగా వినండి. దానిని విన్నమాత్రాన ఉత్తమమైన వైరాగ్యం కలుగుతుంది. బహుప్రాచీన కాలం నుండి పెద్దలు చెపుతూ వచ్చిన ఉపాఖ్యానం ఇది. చపల చిత్తం గల స్త్రీలు సర్వకాలములయందు ఉంటారు. వారే సర్వదోషాలకు మూలం. అలాటి వారి విషయంలో ముముక్షువులైన వారు కడు జాగరూకులై వారియందు ఆసక్తిలేని వారై ఉండాలి.

పూర్వ కాలంలో బుద్ధిశాలి, దేవర్షి అయిన నారదుడు లోకసంచారం చేస్తూ అతిలోక సుందరి, మహా లావణ్యరాశి ఐన పంచచూడ అనే అప్సరసను చూచాడు. చూచి ఆమెను

ఇలా ప్రశ్నించాడు: "ఓ సుందరీ! నా మనస్సులో ఒక సందేహం ఉంది. దానిని నీవు తప్పక తీర్చాలి" అప్పుడా అప్సరస ఇలా బదులిచ్చింది: "ఓ బ్రాహ్మణోత్తమా! నేను సమాధానం చెప్పగలనని భావిస్తే అడుగు. అది నాకు తెలిసిన విషయమైతే సమాధానం చెప్పగలను."

"ఓ సుందరీ! నీకు తెలియని విషయాన్ని చెప్పుమని నిన్ను ఇబ్బంది పెట్టే ప్రసక్తి లేదు. నేను నీ నుండి స్త్రీ స్వభావాన్ని గురించి తెలియగోరుచున్నాను." అన్నాడు నారదుడు.

అప్పుడు పంచచూడ ఇలా బదులిచ్చింది: "ఓ మునీ! విను! నేను స్త్రీని అయి ఉండి స్త్రీ యొక్క దుష్టస్వభావాన్ని వెల్లడించటం తగదు. స్త్రీలు ఎటువంటి వారు అనే విషయం, వారి స్వభావం నీకు తెలియనిది కాదు. నీవు నన్ను ఇట్టి ప్రశ్నను అడగటం సంభావ్యం కాదు." ఇలా పలికి మౌనం వహించింది.

ఆమె మాటను వినిన నారదుడు లోకహితాన్ని కోరి "ఓ సుందరీ! అసత్యం పలికినచో దోషం సంక్రమిస్తుంది. సత్యం పలికితే దోషం లేదు. దానివలన లోకానికి మేలు జరుగుతుంది. కనుక సత్యమైన దానినే చెప్పు." అని కోరగా పంచచూడ స్త్రీలయందలి దోషములను ఇలా చెప్పటం ప్రారంభించింది.

"ఓ దేవర్షీ! సత్యములు, నిత్యములు అయిన విషయాలను చెపుతున్నాను విను. సుందరులైన స్త్రీలు సత్కులంలో జన్మించినా, భర్త ఉన్నవారే అయినా మర్యాదాతిక్రమణం చేస్తారు. ఇదే వారిలోని దోషం. దుష్టులైన స్త్రీలకంటె ఎక్కువ పాపహేతువు మరొకటి లేదు. పాపాలకు మూలం ఇట్టి స్త్రీలే! వారి భర్తలు విద్యావంతులు, ఆర్జనపరులు, ధనవంతులు, రూపవంతులు, తాము కోరుకొన్నవారే అయినా ఈ దుష్టస్త్రీలు అవకాశం లభిస్తే తప్పు చేయటానికి వెనుకాడరు. ఓ ప్రభూ! మా స్త్రీలలో ఈ దుర్లక్షణం ఉంది! మేం సిగ్గును విడిచి హీనజాతి కాపురుషులను, పాపాత్ములను సేవిస్తాం. ఎవరైతే వీరికి కొంచెం సన్నిహితంగా వస్తారో, వీరి అందచందాలను స్తుతిస్తారో, కొద్దిగా సేవ చేస్తారో, ప్రార్థిస్తారో అట్టి పురుషులను స్త్రీలు వాంఛిస్తారు. స్త్రీలు తమకు రహస్యమైన ఏకాంత ప్రదేశము దొరకనప్పుడు, తీరిక లేనప్పుడు, తమ్ము వరించి ప్రార్థించు వారు లభ్యంకానప్పుడు మాత్రమే మర్యాదాతిక్రమణం చేయకుండ ఉంటారు. అత్త-మామల భయం, భర్త భయం, దండన భయం ఇవి కూడా స్త్రీల పాతివ్రత్య రక్షణకు ఉపాయాలు. స్త్రీల దృష్టిలో అయోగ్యుడు లేడు. వీరికి వయస్సుతో పనిలేదు. వీరు అందగాడైనా కాకపోయినా పురుషునితో భోగిస్తారు.

ఓ మహర్షీ! ఈ దుష్ట స్త్రీల స్వభావాన్ని గూర్చి చెపుతున్నాను విను. ఈ స్త్రీలు సవిలాసంగా ఓయారాలను ఒలకపోస్తూ ఒకనితో మాట్లాడుతూ ఉంటారు. మరొక్కని వైపు చూస్తూ ఉంటారు. వేరొక్కని హృదయంలో స్మరిస్తారు. స్త్రీలకు ఒక్కనియందే అనురాగం అనేది లేదు. దుష్టలైన స్త్రీలను ఎంత గౌరవించినా, ప్రేమించినా, రక్షించినా, చివరకు ప్రాణాలకు తెగించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న అట్టి స్త్రీలను రక్షించినా; వారు అట్టి సత్పురుషుని విడిచి, ఎట్టి అవలక్షణాలు కలిగిన వాడైనా సరే పరపురుషుని వాంఛిస్తారు. స్త్రీలు కామించరాని పురుషుడు ముల్లోకాలలో ఒక్కడు కూడా లేడు. కేవలం శిక్షకు, దండనకు భయపడి మాత్రమే స్త్రీలు పరపురుష వాంఛను వదలుకొంటారు.

ఎన్ని కట్టెలైనా అగ్నిహోత్రుని తృప్తిపరచలేవు! ఎన్ని నదులైనా సముద్రుని సంతోషపెట్టలేవు! ఎన్ని జీవులైనా యముణ్ణి 'చాలు' అని అనిపించలేవు. ఎంతమంది పురుషులైనా ఒక స్త్రీని చాలనిపించలేరు. ఇట్టి దుష్ట స్త్రీలకు పురుష సంయోగం లభించని సందర్భాలలో వారు అన్యోన్యం రమించటానికి వెనుకాడరు. వీరియందు భర్తను అనుసరించి ఉండే లక్షణం లేదు.

ఓ దేవర్షీ! స్త్రీలకు సంబంధించిన ఒక్క రహస్యం చెపుతాను విను! వీరికి పురుషుని చూడగానే కామవికారం కలుగుతుంది. వీరి దృష్టిలో శేష్ఠమైన వస్త్రాలకు, విలువైన ఆభరణాలకు, సంపదకు, కామమును భోగించుటకు ఉన్న విలువ భర్తపైన ఉండదు. ప్రాణాలనుసైతం లెక్కసేయక మానాన్ని రక్షించి, కష్టాలలో ఓదార్చి, సర్వస్వాన్ని అర్పించిన భర్తపై కూడ ఈ దుష్టస్త్రీలు ప్రేమను కలిగి ఉండరు. వీరికి సద్భావం అనేది లేదు.

కీకారణ్యంలో తిరుగుతూన్న పెద్ద పులిని పట్టుకోవచ్చు. ఆకాశంలో ఎగురుతున్న పక్షిని బంధించవచ్చు. సముద్రంలో సంచరిస్తూన్న మహా మీనాన్ని పట్టవచ్చు. చపల బుద్ధిగల స్త్రీలను స్వాధీనం చేసుకొన్న వీరుడైన పురుషుడు ఇంత వరకు పుట్టలేదు. యౌవనంలో ఉండి ఉజ్జ్వలమైన వేషభూషాదులను ధరించి స్వేచ్ఛగా సంచరించే ఇట్టి స్త్రీలను చూచి కులస్త్రీలు కూడా అట్టి జీవితాన్నే కోరుకొంటారు. మృత్యుదేవత, పాతాళము, నరకము, బడబాగ్ని, కత్తిధార, విషము, పాము, అగ్ని వీటన్నిటిని కలిపిన దానికంటె దుష్టస్త్రీ వలననే హాని అధికం.

మహర్షీ! లోకంలో ఎట్టి జ్ఞాని అయినా చెప్పలేనివి కొన్ని ఉన్నాయి. అవేమిటంటే గుఱ్ఱం యొక్క దుముకు, మబ్బుయొక్క ఉఱుము (పిడుగుపాటు), అతివృష్టి, అనావృష్టి,

పురుషుని అదృష్టం (భాగ్యం). వీటిని సైతం లెక్కలుకట్టి చెప్పగలవారు ఉండవచ్చు. కాని చపలచిత్తులైన స్త్రీలయొక్క మనోభావాన్ని గుర్తించగల పురుషుడు ఇంకా పుట్టలేదు. దేవతలకే తెలియదు అంటే నరుల లెక్కేమిటి? ఒకప్పుడైనా హీనునకు రాజ్యసంపద కలుగవచ్చు. ఆకాశానికి పువ్వులు పూయవచ్చు. కాని స్త్రీలకు మనశ్శుద్ధి కలుగనే కలుగదు!

కష్టసుఖాలను, లాభనష్టాలను, జయాపజయాలను చివరకు చావుపుట్టుకలను సైతం చెప్పగల తత్త్వవేత్తలు కూడా స్త్రీ స్వభావాన్ని గణించలేరు సరిగదా వారి భ్రూకటాక్ష విక్షేపాలకు లొంగి పోతున్నారు. కార్యహేతువు చేత ఈ స్త్రీలు ఒకప్పుడు చంద్రికా విభవాన్ని ధిక్కరించేటట్లు నవ్వుతారు. రాళ్ళు కరిగేటట్లు ఏడుస్తారు. మగవానిని నమ్మిస్తారు. వారుమాత్రం నమ్మరు. కనుక కులశీల విద్యాగుణ సంపత్తిగల ఆర్య పురుషుడెల్ల వేళలా ఇట్టి స్త్రీలను శ్మశానం లోని పువ్వులవలె విడిచిపెట్టాలి.

కాకికి శౌచము, కాముకునికి సత్య వాక్యము, నపుంసకునికి శౌర్యము, త్రాగుబోతుకు తత్త్వచింతన, సర్పానికి ఓర్పు, రాజులకు స్నేహం, స్త్రీలకు కామోపశాంతి అనేవి లోకంలో లేనే లేవు. సంపదలకు స్థిరత్వము, మూర్ఖునకు వివేకము, చేసిన కర్మలకు నాశనము స్త్రీలకు సద్భావము ఇంతవరకు ఎప్పుడు కనలేదు వినలేదు. లోకంలో బంగారు లేడి ఎక్కడా ఉండదు అని తెలిసికూడా కేవలం భార్యకోరింది గదా అనే తృష్ణ (ఆశ)చే దాని వెంటపడిన రఘునందనుని వివేకాన్ని ఏమనాలి? పురుషుని కీలుబొమ్మను చేసికొని స్త్రీలు వారి కార్యాలను అలా చక్కపెట్టుకొంటారు! బృందారక సార్వభౌముడైన పురందరునికి స్వర్గంలో అచ్చరమెఱుగు బోండ్లకు కొదవా ఏమి? కేవలం వనవాసిని, ఒక తపసి ఇల్లాలు అయిన అహల్యపై మనసు పారేసుకొన్నాడంటే మన్మథ ప్రతాపాన్ని ఏమనాలి? హృదయమనే పర్ణశాలను కామాగ్ని దహించి వేస్తూంటే ఎంత పండితుడైనా ఉచిత అనుచితములను ఎఱగడు! ఎట్టి యంత్ర సహాయం, మంత్ర సహాయం లేకుండగానే స్త్రీలు ఎంతటి ప్రజ్ఞాధనునైనా వశం చేసికోగలరు! సస్యము (పంట), భార్య ఈ రెండుకూడా స్వీయ పర్యవేక్షణ లేకపోతే పరుల పాలవుతాయి.

కాళిందీ (యమున) నదీ ప్రవాహంలో మహా శోభాయమానంగా ప్రకాశిస్తూన్న నల్లకలువ మొగ్గల వెలుగును మించి మనోహరంగా ఒప్పారుతూ ఉన్న కామినుల కాటుకకండ్ల చూపులు ఎంత వరకు పురుషుని హృదయానికి గ్రుచ్చుకొనవో; అంతవరకే ఆ పురుషుని పాండిత్యము, ప్రతిష్ఠ, గౌరవము నిలబడతాయి. పంచబాణుని పూవుటమ్ములను మించిన

పదునుగల కామినీజనుల కడకంటి చూపులు ఒక్కసారి సోకెనా ఎంతటి తపోధనుని వజ్రపంజర సన్నిభమైన మనస్సైనా కరిగి నీరై పారుతుంది. పరాశర, వ్యాస, కౌశిక, శీతాంశులకే దిక్కు లేదు.

మహర్షీ! ముగ్ధేందు వదనల ముఖ విలాసాలకు, చిగురుబోడుల కుచాశ్లేషములకు, మహిళాజనాల మధుర వచనాలకు, పద్మగంధుల నిశ్వాస వాసనలకు, కువలయాక్షుల కలికి చూపులకు, కలకంఠకంఠుల పాటలకు, చంద్రముఖుల మందహాసాలకు, మత్తేభయానల మందగమనాలకు, బింబాధరోష్ఠుల వాతెర మధువులకు, అంగనల హస్తపాద విన్యాసాలకు ముని, వన, శైల, వృక్షతతులు వెంట పరుగెత్తుతాయి అంటే విషయ సౌఖ్యపరతంత్రుడైన నరుడు వశుడు కావటంలో ఆశ్చర్యమేముంది?

సంపదలను పొంది గర్వపడని వాడు, సంసారంలో ఉండి ఆపదలను పొందని వాడు, యముని ముఖం చూడని వాడు, యాచకుడై ఉండి గౌరవాన్ని పొందిన వాడు, దుర్జన సాంగత్యం చేసి క్షేమంగా బయటపడిన వాడు, వర్షంలో తడవని వాడు, సూర్యకిరణం మేన సోకని వాడు, స్త్రీల మాయాజాలంలో చిక్కుకొనని వాడు లోకంలో లేడు. పంచమహా భూతములు, లోకములు, సూర్యచంద్రులు, పురుషులు మరియు స్త్రీలు ఏ కాలంలో బ్రహ్మగారిచే సృష్టింపబడినారో అప్పటినుండి సర్వ కాలాలలోను ఇట్టి దోషంగల స్త్రీలు ఉన్నారు.

ఈ ద్వైత ప్రపంచంలో ద్వంద్వ ప్రవృత్తి ఎప్పుడూ ఉంటుంది. అసత్యం వలన సత్యమునకు, హింస వలన అహింసకు, చీకటి వలన వెలుగుకు, చెడు వలన మంచికి, అధర్మం వలన ధర్మమునకు, వ్యభిచారం వలన పాతివ్రత్యానికి మన్నన, మర్యాద కలిగింది.

ఓ బ్రహ్మజ్ఞాన కళానిధీ! త్రిలోక సంచారివైన నీకు తెలియని విషయాలు ముల్లోకాలలోను లేవు. అయినా నీవు ప్రశ్నించావు కనుక చెప్పాను. అసత్యదోషం నాకు వాటిల్లకుండ ఉండటం కొరకు చెప్పాను. ఇలా పలికి మునికి నమస్కరించి ఆయన నుండి అనుజ్ఞ తీసుకొని తన లోకానికి వెళ్ళింది పంచచూడ.

మునులారా! వస్తుతత్త్వాన్ని, దుష్ట స్త్రీ స్వభావాన్ని గురించి చెప్పిన సంవాద రూపమైన ఈ ఉపాఖ్యాన శ్రవణం వలన వైరాగ్యం కలుగుతుంది. ఆ వైరాగ్యం శివజ్ఞానాన్ని పొందాలనే శుభేచ్ఛకు కారణమవుతుంది. ఆధ్యాత్మిక ఔన్నత్యానికి వైరాగ్యమే కదా మొదటి మెట్టు.

యోగ సాధన మరియు యోగ మహిమాను వర్ణనం

మునులారా! సర్వ ప్రాణులకు మృత్యువు కాలంలోనే సంప్రాప్తిస్తుంది. అట్టి కాలాన్ని (మృత్యువును) జయించే యోగాన్ని గూర్చి సంగ్రహంగా చెపుతున్నాను. శ్రద్ధగా వినండి! ఈ అనంతమైన సృష్టికి కారణ భూతమైనది; నిత్యము, సత్యము, శాశ్వతము అయినది ఒకటి ఉంది. దానికి 'ప్రధానము' అనిపేరు. అది కార్యకారణ రూపంగా ఉంటుంది. దానినుండే చైతన్య రూపుడైన పురుషుడు ఆవిర్భవించాడు. జడమైన ప్రకృతి కూడా ఉద్భవించింది. వారిద్దరి సమ్మేళనంతో ఈ సృష్టి ఇలా అనంతంగా సాగిపోతూ ఉంటుంది. ఇక్కడ పురుషుడు అంటే అన్ని ఉపాధుల యందు చైతన్య రూపంగా ఉన్నవాడు అని అర్థం.

భూమిమీద సర్వమైన ప్రాణికోట్లలోను ఆడ-మగ భేదం ఉంది. పురుషునికి ప్రతీక మగవాడు. ప్రకృతికి ప్రతీక స్త్రీ. వీరిద్దరి సమ్మేళనంతో భూమి మీద ప్రాణికోట్ల ఆవిర్భావం అనంతంగా సాగిపోతూ ఉంటుంది. మనిషి మనుగడకు ప్రకృతియే ఆధారం. ప్రకృతి పంచభూతాత్మకం. స్త్రీ అయినా పురుషుడైనా ఉపాధులన్నీ పంచభూతాత్మకాలే. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు ప్రకృతి గుణాలు. ఈ గుణాలతో కూడిన ప్రకృతియే పురుషుని మోహింపచేసి బంధంలో ఉంచుతూన్నది. ఈ బంధానికే సంసారం అని పేరు. ఆ బంధం నుండి విడివడితే కాని పురుషునికి మోక్షం లేదు. ప్రకృతికే మాయ అని మరొకపేరు.

దేని యొక్క యథార్థ స్వరూపాన్ని తెలుసుకొనాలనుకొన్నా ముందు దాని తత్త్వాన్ని వివేచన చెయ్యాలి. మోక్షార్థి అయిన వాడు సృష్టికి కారణమైన ప్రకృతి-పురుష తత్త్వాన్ని వివేచన చేసేముందు; దానికి ప్రతీకలైన స్త్రీ-పురుష తత్త్వాన్ని అంటే దారాపుత్రాదులతో కూడిన ఇక్కడి జీవ సంసార తత్త్వాన్ని ముందు వివేచన చేయాలి. సంసారం స్త్రీ వల్లనే ఏర్పడుతూన్నది కనుక ముందుగా స్త్రీ యొక్క యథార్థ స్వరూపాన్ని, తత్త్వాన్ని అర్థం చేసుకోవాలి.

నిజానికి ప్రకృతి-పురుష బంధాన్ని విడగొట్టటం అసాధ్యం. అది ప్రళయకాలంలో మాత్రమే జరిగేపని. ప్రళయకాలంలో ప్రకృతి కార్యములన్నీ ఒక్కొక్కటి కారణంలో లీనమవుతూ వస్తాయి. అప్పుడు అనాది అయిన ప్రధానం ఒక్కటే మిగులుతుంది. ముందుగా ప్రకృతి స్వరూపిణి అయిన స్త్రీ తత్త్వాన్ని వివేకించి ఆ మోహం నుండి ఆ బంధం నుండి బయట పడితే వైరాగ్యం సిద్ధిస్తుంది. ఆ వైరాగ్యం క్రమంగా మోక్షానికి దారి తీస్తుంది.

మునులారా! తీవ్రమైన వైరాగ్యం కలిగితే మినహా మనిషి (జీవుడు) సంసారం నుండి బయట పడలేడు. అట్టి వైరాగ్య ప్రాప్తి ముముక్షువులకు కలిగే నిమిత్తమై మీకు నారద–పంచచూడ సంవాద రూపమైన ఉపాఖ్యానాన్ని చెప్పి ఉన్నాను. అంతే కాని మాతృ మూర్తులైన తల్లులనుగాని, శక్తి రూపిణి అయిన ప్రకృతినిగాని నిందించటం నా తాత్పర్యంగాదు. ప్రకృతి ప్రసవరూపిణి గదా! తీవ్ర వైరాగ్య సంపన్నులైన ముముక్షువులకు సైతం సర్వాన్ని సమకూర్చి పెట్టేది ప్రకృతియే.

ఓ తపోధనులైన మునులారా! కేవలం జ్ఞానమొక్కటే మోక్షహేతువు కాజాలదు. జ్ఞానమార్గం సిద్ధాంత మార్గం. దానికి ఆచరణ కావాలి. అట్టి ఆచరణకే 'యోగం' అని పేరు. ఆ యోగాన్ని గూర్చి మీకు చెపుతున్నాను. శ్రద్ధగా వినండి. అవిద్యా మోహితులైన వారు పాంచభౌతికమైన ఈ ఉపాధి శరీరంతో తాదాత్మ్యాన్ని చెంది 'నేను' అనే ఆత్మ ప్రత్యయంతో లోక వ్యవహారాలను చక్కపెట్టుకొంటూ ఉంటారు. ఉపాధి శరీరాన్ని ఆశ్రయించుకొని ఉండి జీవుడు ఆత్మాధిష్ఠానంగా ప్రకృతి వలన కలిగే సుఖదుఃఖాలను అనుభవిస్తూ ఉంటాడు. నిజానికి జీవుణ్ణి ప్రకృతి బాధించదు. ప్రకృతి గుణాలే బాధిస్తాయి – ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి ఈ ఐదు పంచభూతాలు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు వాటి గుణాలు. ఈ గుణాలే బాధిస్తాయి. ప్రకృతిని జయించటం అంటే వాటి గుణాలను జయించటమే. అఖండాకార అద్వైత స్వరూపుడైన పరమాత్మను మనకు తోపింపనీయకుండా ఆచ్ఛాదించి ఉంటున్నది మాయారూపిణి అయిన ప్రకృతి. ప్రకృతియే పరిచ్ఛిన్నత్వాన్ని కల్పిస్తూన్నది. ప్రకృతిని స్వాధీనం చేసికొన్న మరుక్షణంలో పరిచ్ఛిన్నత్వం (ద్వైతభావం లేదా భేద భావం) తొలగి యోగికి అద్వైత దర్శనం కలుగుతుంది. ఏకత్వ దర్శనం కలుగగానే యోగికి కొన్ని శక్తులు కలుగుతాయి. వాటికి 'సిద్ధులు' అని పేరు. సిద్ధి అనగానే అదేదో క్రొత్తగా వచ్చింది అనిగాదు అర్థం. పరమాత్మకు అష్టసిద్ధులు సహజ గుణాలు. అలాగే జీవబ్రహ్మైక్య భావనను పొందిన వానికి కూడా సిద్ధులు సహజగుణాలే అవుతాయి.

మునులారా! కాలాన్ని జయించగోరు యోగి నిత్యము ఆయా కాలాల్లో సూక్ష్మ పంచభూతముల నుండి జనించిన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములనే వాటి గుణాలను ధ్యానించాలి. యోగవేత్త నిశా సమయంలో ఉచితాసనంపై కూర్చొని, దీపాన్ని ఆర్పివేసి చీకటిలో ప్రాణాయామాన్ని చేసి మనస్సును ధారణ చేయాలి. చూపుడు వ్రేళ్ళుతో రెండు

చెవులను మూసి కొద్దిసేపు నొక్కిపెట్టినచో చెవులలోపలి నుండి భగభగమండే అగ్నియొక్క శబ్దమును పోలిన శబ్దం వినవస్తుంది. ఆ శబ్దంపై ధారణ చేయాలి. ధ్యాన సమయంలో పిడుగు చప్పుళ్ళను విన్నయోగి ఇంద్రియ జయాన్ని తప్పక సాధిస్తాడు. క్రమంగా ఆ శబ్దం మరింత సూక్ష్మమవుతుంది. వివేకవంతులైన వారు శబ్దబ్రహ్మ స్వరూపుడైన పరమ శివుని తప్పక ధ్యానం చేయాలి.

శబ్ద బ్రహ్మ అనగా అది పదార్థముల యందలి కంపము వలన పుట్టినది కాదు. దానిని నోటితో ఉచ్చరించటం సాధ్యం కాదు. అది ఓంకారం కాదు. మంత్రం కాదు. బీజాక్షరం కాదు. అది ప్రాణస్వరూపం. అట్టి దానిని నాదసిద్ధిని అనుసరించి సరియైన క్రమంలో చెపుతున్నాను వినండి. అది తొమ్మితి విధాలు, అందు మొదటిది ఘోషము (సరళమగు హల్లుల ఉచ్చారణలో వచ్చే శబ్దం). రెండవది కాంస్యం (కంచు మ్రోత). మూడవది శృంగం (కొమ్ము బూరా నాదం). నాల్గవది ఘంటానాదం. ఐదవది వీణానాదం. ఆరవది వేణునాదం. ఏడవది దుందుభి స్వనం. ఎనిమిదవది శంఖధ్వని. తొమ్మిదవది మేఘ స్వనం. ఈ తొమ్మిది ధ్వనులను ఉపాసించి ఆ పైన వాటిని విడిచి 'తుం' కారమును చక్కగా ధ్యానించాలి. అట్టి అభ్యాసం వలన క్రమంగా యోగికి మృత్యువును జయించే శబ్దం ఉత్పాద్య మవుతుంది. ఘోషం మొదలుగా మేఘనాదం వరకు ఈ తొమ్మిది విధాలైన శబ్దబ్రహ్మ స్వరూపాన్ని చక్కగా ధారణచేసి ఉపాసించిన యోగికి సమస్త సిద్ధులు లభిస్తాయి. సిద్ధించని కోరిక అంటూ ఏమీ ఉండదు. ఈ విధంగా శబ్ద బ్రహ్మమును ఉపాసించిన యోగి ఆకాశ గుణమైన శబ్దంతో అద్వైతసిద్ధిని పొంది దానిని జయిస్తాడు.

మునులారా! మీకిప్పుడు వాయు లక్షణమైన స్పర్శ గుణాన్ని జయించే ఉపాయాన్ని చెపుతున్నాను వినండి. వాయువు సర్వవ్యాపకం. ఆ కారణంగా వాయువును జయించిన యోగి సర్వమును (జగత్తును) జయించిన వాడే అవుతున్నాడు. హృదయమునందు ఉండే ప్రాణవాయువు సర్వదా అగ్నిని ప్రజ్వరిల్ల చేస్తూనే ఉంటుంది. జ్ఞానము, విజ్ఞానము, ఉత్సాహము సర్వము వాయువునుండే ఉద్భవిస్తున్నాయి. యోగులు మూడు వ్యాహృతులతో మరియు శిరోమంత్రంతో కూడిన గాయత్రిని మూడుసార్లు జపించి ప్రాణవాయువును స్తంభింపజేసి నిలిపి ఉంచాలి. ఇది ప్రాణాయామం. ఎవరైతే తెల్లవారు జామునలేచి ప్రాణాయామాన్ని శ్రద్ధగా అభ్యసించి సిద్ధిని పొందుతారో వారికి వాయు లక్షణమైన స్పర్శగుణం స్వాధీన మవుతుంది.

మునులారా! మీకిప్పుడు అగ్ని లక్షణమైన తేజోగుణాన్ని జయించే ఉపాయాన్ని చెపుతున్నాను వినండి! యోగి జనసమ్మర్దం లేనిచోట సుఖాసనంలో కూర్చొని సూర్య చంద్రులతో కూడిన అగ్నిని భ్రూమధ్యమందు ధ్యానించాలి. ఈ ధ్యానం సిద్ధిస్తే అగ్నితత్త్వం సిద్ధించినట్లే, అట్టి యోగికి అనేక యోగ సిద్ధులు లభిస్తాయి.

మీకిప్పుడు జల లక్షణమైన రసగుణాన్ని జయించే ఉపాయాన్ని చెపుతున్నాను వినండి. యోగి ఏకాంతంలో సుఖాసనంలో ఉండి నాలుకను అంగుటి వైపునకు వంచి అభ్యాసం చేయాలి. అలా చేయగా కొద్ది రోజులలో అతని నాలుక కొండ నాలుకను స్పృశిస్తుంది. అలా స్పృశించగానే దానినుండి అమృతం స్రవిస్తుంది. ఆ అమృతం బిందు రూపంలో స్రవిస్తూ ఉంటుంది. ఈ విధమైన సిద్ధి లభించగానే యోగి అమృతుడు అవుతాడు. అమరత్వం సిద్ధిస్తుంది.

ఛాయా పురుష విద్య

ఇంతవరకు అత్యంత శ్రద్ధా భక్తులతో సూత మహర్షి చెప్పిన విషయాలను వినిన శౌనకాది మునులు వినయంగా ఆయనను ఇలా ప్రార్థించారు. "ఓ! పురాణనిధీ! జ్ఞాన స్వరూపా! నువ్వింత వరకు లోకోపకారకమైన అనేక గాథలను, తాత్త్విక విషయాలను చెప్పావు. నీ పల్కులు అమృతోపమానంగా ఉన్నాయి. ఎంతవిన్నా గంగా స్నానం వలె తనివితీరటం లేదు. భౌతిక సంపదలు సంపదలు కావు. జ్ఞాన సంపదయే నిత్యమైన సంపద! మాకు ఛాయా పురుష లక్షణాన్ని గురించి చెప్పండి."

వెంటనే జ్ఞానార్జన యందు మునులకుగల లక్ష్యానికి సంతసించి సూత మహర్షి ఇలా చెప్ప సాగేరు. మునులారా! తొల్లి పార్వతి ప్రశ్నించగా పరమేశ్వరుడు ఈ విద్యను ఆమెకు ఉపదేశించాడు. దానిని మా గురువుగారైన వ్యాసభగవానుడు నాకుపదేశించారు. దానిని నేను మీకు చెపుతున్నాను వినండి.

సాధకుడైన వాడు శివభక్తియుతుడై పరిశుద్ధమైన తెల్లని వస్త్రాలను ధరించి, పుష్పమాలలను అలంకరించుకొని, సుగంధ ద్రవ్యాలను మైపూతగా పూసుకొని, చెంత పరిమళాన్ని వెదజల్లే ధూపాన్ని ఉంచుకొని సూర్యుడుగాని చంద్రుడుగాని వెనుకవైపు ఉండేటట్లు ఆసీనుడు కావాలి. అప్పుడు తన నీడ తనముందు పడుతుంది. సర్వకామ ఫలప్రదమైన నవాత్మక శివమంత్రాన్ని జపిస్తూ ఆ నీడను నిశితంగా వీక్షించాలి. అలా కొంత సేపు వీక్షించి తిరిగి ఆకాశం వైపు చూస్తే తెల్లని మెరిసే రూపం కానవస్తుంది. ఆ ఛాయా పురుషునిలో శివుణ్ణి దర్శించాలి. ఇలా ఒక సంవత్సరకాలం సాధన చేస్తే ఈ విద్య సిద్ధిస్తుంది.

ఆ సాధకునికి అష్టసిద్ధులు లభిస్తాయి. ఆ ఛాయా పురుషుడు తెల్లగా గోచరిస్తే సాధకుడు పరమ ధార్మికుడవుతాడు. నల్లగా కనుపిస్తే పాపి అవుతాడు. ఎఱ్ఱగా కనుపిస్తే బంధాలలో చిక్కుకొంటాడు. పచ్చగా కనుపిస్తే విద్వేషి అవుతాడు. ఆ ఛాయా పురుషునిలో అవయవ లోపం ఏదైనా కనుపిస్తే అరిష్టం (కీడు) సంప్రాప్తిస్తుంది. నిజానికి కేవలం ఆ ఛాయా పురుషుని దర్శన మాత్రం చేతనే సాధకుడు పవిత్రుడవుతాడు. అతనికి వాయుజయం సిద్ధిస్తుంది.

ఆ ఛాయా పురుషుణ్ణి ప్రార్థిస్తే సాధకునికి భూత, భవిష్యత్, వర్తమాన విషయాలన్ని తెలుస్తాయి. దీర్ఘజీవనం కలుగుతుంది. అకాల మరణం ఉండదు. అన్నిట జయమే! కొందరు ఆ ఛాయను బ్రహ్మముగా ఉపాసిస్తారు. కొందరు మృత్యువుగా కూడా ఉపాసిస్తారు. అట్టి వారికి రోగాదులు, మృత్యుభయం ఉండవు. కొందరు నీడయొక్క కంఠ భాగమందు మాత్రమే నిశ్చలంగా దృష్టిని నిలిపి శివుణ్ణి ధ్యానిస్తారు. అజ్ఞానావృతమైన ఏకాగ్రతతో హృదయంలో ఉన్న దేవతయే మృత్యువు. దానిని ఉపాసించి ప్రశ్నిస్తే అది అన్నిటికి సమాధానాలను చెపుతుంది.

పితృదేవతల ప్రభావం

శౌనకాది మునులు సూతుణ్ణి ఇలా ప్రశ్నించారు: ఓ! వ్యాసశిష్యా! పితృదేవతలు శ్రాద్ధముచే సంతోషించి మానవులకు శ్రేయస్సును కలిగిస్తారని అంటారు కదా! అట్టి పితృ లోకాలను గురించి పితృదేవతలను గురించి మాకు సవిస్తరంగా చెప్ప వలసింది. అంతే గాకుండా మానవులు ఇచ్చే శ్రాద్ధఫలం పితరులకు ఎలా చేరుతుంది? మరణించిన వారు ఏ లోకంలో ఎక్కడ ఏ రూపంలో ఉంటారో తెలియదు కదా?" దానికి సూతుడిలా చెప్పసాగేడు.

"మునులారా! వేద తాత్పర్యం తెలిసిన వారికి మాత్రమే అవగతమయ్యే విషయాన్ని గూర్చి మీరు ప్రశ్నించారు. సమాధానం చెపుతున్నాను. శ్రద్ధగా వినండి! తొల్లి సనత్కుమారుడు మార్కండేయునకు ఈ విషయాలన్నిటిని చెప్పాడు. మార్కండేయుడు ఈ పితృసృష్టిని గూర్చి భీష్మునకు వివరించాడు. శరతల్ప గతుడైన భీష్ముడు ధర్మరాజు ప్రశ్నించగా ఈ వివరాలను ఆయనకు చెప్పాడు. అట్టి ధర్మవేత్త అయిన భీష్ముడు ప్రవచించిన దానిని చెపుతున్నాను వినండి. మునులారా! మానవులకు ఇహలోకంలో సంతానాన్ని, సకలమైన భోగభాగ్యాలను, సంపదలను ఇయ్యటంలో దేవతలకంటె పితృదేవతలు ముందుంటారు. దేవతలు స్వార్థపరులు. పితృదేవతలు నిస్వార్థపరులు. మానవులు వారి సంతానమే కనుక వారికి మానవులయందు

వాత్సల్యం మెండు. కనుక ఇహలోక సుఖాన్ని కోరేవాడు తండ్రిని, తాతను, ముత్తాతను ఉద్దేశించి మూడు పిండాలను శ్రద్ధతో అర్పించి శ్రాద్ధం పెట్టాలి. స్వర్గంలో దేవతలు కూడా పితృదేవతలను పూజిస్తారు.

శంతన మహారాజు మరణించిన తరువాత శ్రాద్ధ సమయంలో భీష్ముడు తండ్రి కొరకు పిండాన్ని సిద్ధం చేశాడు. శంతనుడు భూమిని పగులకొట్టుకొని వచ్చి పిండం కొరకు చెయ్యి చాచేడు. భీష్ముడు తండ్రి చేతిలో పిండమును ఉంచకుండ శ్రాద్ధకల్పంలో చెప్పిన రీతిగా దర్భలపైనే సమర్పించాడు. దానికి వసు రూపుడైన శంతనుడు సంతసించి "ఓ భారతశ్రేష్ఠ! ధర్మనిధీ! నీవు వేద ధర్మాన్ని నిలపెట్టావు. రాజు ఏ ధర్మాన్ని ఆచరించి ప్రమాణభూతుడవుతాడో ప్రజలు కూడ ఆ ధర్మాన్నే ఆచరిస్తారు." అని పలికి భీష్మునకు మరణభయం లేకుండ స్వచ్ఛంద మరణాన్ని అనుగ్రహించాడు. ఆ సమయంలో భీష్ముడు తండ్రిని పితృకల్పాన్ని వివరంగా చెప్పమని కోరగా మార్కండేయుని ద్వారా తాను తెలుసుకొన్న దానిని శంతనుడు భీష్మునకు చెప్పాడు. మునులారా! దానినే నేను మీకు చెపుతున్నాను వినండి.

ఒకరోజున మార్కండేయ మహర్షి అంతరిక్షాన్ని అవలోకిస్తూ ఉండగా పర్వత సమీపంనుండి వస్తూన్న పెద్ద విమానం గోచరించింది. అందులో అగ్నిలో ఉంచబడిన అగ్నివలె మహాతేజో విరాజమానుడైన అంగుష్ఠమాత్ర (బొటన వ్రేలంత) పురుషుడు విశ్రమిస్తూ దర్శనమిచ్చాడు. మార్కండేయుడు ఆయన పరిచయాన్ని కోరగా "నేను బ్రహ్మ మానస పుత్రుడనైన సనత్కుమారుడను!" అని ఆయన బదులిచ్చాడు. ఆ సందర్భంలో మార్కండేయ మహర్షి పితృదేవతల ఆదిమ సృష్టిని గూర్చి చెప్పవలసిందని కోరగా ఆయన సవిస్తరంగా బోధించాడు. మునులారా! మీకు దాని సారాంశాన్ని చెపుతున్నాను వినండి.

పూర్వం బ్రహ్మ దేవతలను సృష్టించి 'నన్ను పూజించుడు' అని వారితో చెప్పాడు. కాని వారు ఫలార్థులై తమను తాము ఆరాధించుకొనగా బ్రహ్మ కోపించి 'బుద్ధి నశించగా మూర్ఖులు కండు' అని శపించాడు. అప్పుడు దేవతలు పశ్చాత్తప్తులై అనుగ్రహించమని బ్రహ్మను ప్రార్థించగా ఆయన 'మీ పుత్రులను (పితరులను) అడిగి మీరు జ్ఞానాన్ని పొందండి!" అని బదులిచ్చాడు. బ్రహ్మ చెప్పిన మాట చొప్పున దేవతలు వారి పితరులను సమీపించి ప్రార్థించగా వారు 'ఓ పుత్రులారా! వెళ్ళుడు!' అని బదులిచ్చి అంతర్హితులయ్యారు. వెంటనే దేవతలకు బుద్ధి కలిగింది కాని పుత్ర వ్యామోహ పీడితులై బ్రహ్మవద్దకు వెళ్ళి 'ఆ పుత్రులు

వెళ్ళిపోయారు' అని చెప్పి దుఃఖించారు. దానికి బ్రహ్మ 'ఓ దేవతలారా! మీకు బుద్ధి కలిగింది కాని జ్ఞానోదయం కాలేదు! అందుకే దుఃఖిస్తున్నారు. సందేహాన్ని విడిచి జ్ఞానులలో శ్రేష్ఠులైన మీ పుత్రులు (పితరులు) చెప్పిన దానిని మననం చెయ్యండి. మీకు జ్ఞానోదయ మవుతుంది! దేవతలు-పితరులు (పూర్వదేవతలు) మీ ఇద్దరు మహా ప్రీతితో ఒకరినొకరు పూజించు కొనండి, పరస్పరం ప్రీతి కలిగి ఉండండి.' అని చెప్పి పంపించాడు. వెంటనే దేవతలు పుత్రులను (పితరులను) కలుసుకొని "మీరు మమ్ములను 'ఓ పుత్రులారా!' అని సంబోధించారు కనుక మీరు మాకు పితరులు అగుచున్నారు. ఇందులో సందేహం లేదు. ఏ మానవులైతే పుష్టిని అభ్యుదయాన్ని కోరి పితృదేవతల నుద్దేశించి శ్రాద్ధాలను పెడతారో అలాగే తండ్రులు, తాతలు, ముత్తాతల నుద్దేశించి పిండాలను పెడతారో దానికి వారు సంతోషించి వారిని వెన్నంటి యుండి అభ్యుదయాన్ని కలిగిస్తారు. సోముడు ప్రీతుడై సముద్రాన్ని పర్వతాలను, అడవులను, పంటలను వర్ధిల్ల చేస్తాడు. మనందరము పరస్పరం మైత్రితో ఉందాం!" అని పలికి మైత్రీ భావాన్ని పొందారు. ఈ విధంగా పితృదేవతల ఆరాధన భూలోకంలో వ్యాప్తిలోకి వచ్చింది."

ఏడు పితృగణాల చరిత్ర

సూత మహర్షి శౌనకాది ఋషులతో ఇలా అంటున్నాడు. "ఓ! మునులారా! దేవపూజ కంటె పితృశ్రాద్ధం గొప్పది. అందువల్ల మానవులు విధిగా తమ తండ్రితాతల యందు వంశకర్తల యందు భక్తికలిగి శ్రాద్ధక్రియలను పెట్టాలి. స్వర్గంలో ఏడు పితృగణాలున్నాయి. వాటిలో నాల్గు గణాలు మూర్తి మంతములు. వైరాజులు, అగ్నిష్వాత్తులు, బర్హిషదులు ఈ మూడు గణాలు అమూర్తములు. వీరు ప్రాణులందరిలో అమితమైన ఓజస్సు (సామర్థ్యం) కలవారు. వైరాజులను పితరుల మానస పుత్రికయే మేన. ఆమె హిమవంతుని భార్య అయింది. మేనా హిమవంతులకు ఒక్కడే కొడుకు. అతని పేరు మైనాకుడు. అతని కొడుకు క్రౌంచుడు. మేనకు ఉమ, ఏకపర్ణ, అపర్ణ అనే నామధేయాలు కల ముగ్గురు కుమార్తెలు జన్మించారు. వారిలో ఉమను రుద్రునకు, ఏకపర్ణను భృగువునకు, అపర్ణను జైగిషవ్యునకు ఇచ్చి వివాహం చేశారు.

అగ్నిష్వాత్తులు అను అమూర్త పితృగణం యొక్క మానస పుత్రికయే 'అచ్ఛోదా' అను కన్య. ఆమెకే 'అమావాస్యా' లేక 'అమావస్య' అనే పేర్లున్నాయి. ఈమెయే ఇరువది ఎనిమిదవ ద్వాపర యుగంలో వసువీర్యానికి చేప కడుపున జన్మించి సత్యవతి అనే పేరుతో దాశరాజుకు కూతురై, వ్యాసభగవానునికి తల్లి అయింది. శంతనునికి భార్యయై చిత్రాంగద, విచిత్రవీర్యులను

ఇద్దరు కుమారులను కన్నది. ఈమెకు పితృలోకంలో 'అష్టక' అని పేరు (భాద్రపద శుక్ల పూర్ణిమ గడిచిన వెంటనే వచ్చు సప్తమీ తిథికి 'అష్టక' అని పేరు).

బర్హిషదులు అను పితరులు పులస్త్య ప్రజాపతి కుమారులు. వీరి మానసకన్య 'పీవరి' అనే పేరుతో ద్యులోకంలో ప్రసిద్ధయై ఉంది. ఈమె యోగవిద్యకే తల్లి అనదగిన యోగిని. ఈమె తపస్సుచే శంకరుని మెప్పించి తపః ఫలంగా వ్యాసపుత్రుడు, యోగాచార్యుడైన శుకునకు భార్యయై కృత్తి అను కుమార్తెను కన్నది. కృత్తి మానవుడైన పాంచాలదేశ రాజుకు భార్యయై, యోగి మరియు సర్వప్రాణుల ధ్వని విశేషాలను యెరిగిన బ్రహ్మదత్తునకు తల్లి అయింది

మునులారా! మీకింత వరకు మానవుల కగోచరమైన అమూర్తిమంతములైన మూడు పితృగణాల గురించి చెప్పాను. ఇప్పుడు మూర్తిమంతములైన నాలుగు పితృగణాలు గూర్చి చెపుతున్నాను వినండి. వీరు సుకాలిన్లు బర్హిష్మంతులు – అజ్యపులు – సోమపులు అను నామధేయాలు కలవారు.

సుకాలిన్లు వసిష్ఠుని మానసపుత్రులు. వారు ద్యులోకానికి పైన 'జ్యోతిర్ధామి' అనే లోకంలో ఉంటారు. వీరి మానస పుత్రి పేరు 'గౌః' ఈమె శుక్రాచార్యుని భార్య. శూద్రులు వీరికిష్టం.

బర్హిష్మంతులు అంగిరః ప్రజాపతి మానసపుత్రులు. సూర్యమండల మందున్న 'మరీచి గర్భములు' అనే లోకంలో వారుంటారు. వీరి మానసపుత్రి 'యశోద'. ఈమె పంచజనుని కుమారుడైన అంశుమంతుని భార్య. దిలీప చక్రవర్తి తల్లి. భగీరథుని నాయనమ్మ. క్షత్రియులు వీరికిష్టం.

అజ్యపులు కర్దమ ప్రజాపతి కుమారులు. కామభోగ ఫలప్రదములైన 'కామదుఘములు' అనే లోకాలు వీరి నివాస స్థానం. వీరి మానస పుత్రిక పేరు 'విరజ'. ఈమె తర్వాత కాలంలో నహుషుని భార్యయై యయాతికి తల్లి అయింది. ఈమె బ్రహ్మలోకానికి చేరుకొని 'ఏకాష్టక' అను పేర ప్రసిద్ధురాలైంది. వైశ్యులు వీరికిష్టులు.

సోమపులు వీరు బ్రహ్మ లోకంలో గల మానసములు అనే లోకాలలో ఉంటారు. వీరు 'స్వధ' నుండి జన్మించారు. వీరి మానస పుత్రియే నర్మదా నది.

శ్రాద్ధకర్త శ్రద్ధతో శ్రాద్ధంలో సమర్పించిన ఆహారం ఏదైనా సరే; వసు, రుద్ర, ఆదిత్య రూపాలలో ఉన్న తన తండ్రి, తాత, ముత్తాతలకు వారెక్కడ ఏ రూపాలలో ఉన్నా పంచభూతముల తేజో విశేషం ద్వారా వారికి అందుతుంది.

కౌశిక వంశీయులు శ్రాద్ధఫలముగా విష్ణు లోకమును పొందుట

మునులారా! శ్రాద్ధ ఫలాన్ని చక్కగా వివరించే ఒక అద్భుతమైన పూర్వ గాథను చెపుతున్నాను! వినండి. పూర్వం కురుక్షేత్రంలో కౌశికుడు అనే ధర్మాత్ముడైన మహర్షి ఉండేవాడు. ఆయనకు ఏడుగురు కుమారులు. వారు వరుసగా వాగ్దుష్టుడు (చెడుగా మాటలాడు వాడు), క్రోధనుడు (కోపిష్టి), హింస్రుడు (హింసించే స్వభావం కలవాడు), పిశునుడు (కొండెములను చెప్పువాడు), కవి (గ్రంథరచనా కుశలుడు), స్వసృషుడు (స్వయముగా సృష్టించు వాడు), పితృవర్తి (పితరులను సేవించు వాడు). వారంతా సార్థక నామధేయులు. వారు గర్గ మహాముని‌కి శిష్యులై విద్యాభ్యాసం చేస్తూండే వారు. అలా ఉండగా కొంత కాలానికి తండ్రి మరణించాడు. వారు పితృ కర్మను లెస్సగా నిర్వహించి గురువు వద్ద విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. కాలం గడుస్తోంది. ఇంతలో అనావృష్టి కారణంగా కరవు వచ్చింది. ఆహారానికి కొరత ఏర్పడింది. వారు నిత్యము అడవికి వెళ్ళి గురువుగారి కపిల గోవును (దూడతో సహా) మేపటం, కట్టెపుల్లలు తేవటం ఇత్యాది గురుసేవను చేస్తూండే వారు. ఒర రోజున వారిలో కొందరు ఆకలి బాధకు తాళలేక "ఈ గోవును వధించి క్షుద్బాధను నివారించు కొందాం! అడవిలో పులి గోవును భక్షించిందని గురువు గారితో చెపుదాం. దూడను మాత్రం అప్ప చెపుదాం!" అనే దుష్ట ఆలోచన చేశారు. అందులో పితృవర్తి అనేవాడు గోవధ మహా పాతకమని చెప్పి ఒకవేళ తప్పనిసరి ఐతే పితృ శ్రాద్ధం జరిపి అందులో గోమాంసాన్ని వినియోగించి తిందాం. అప్పుడు మనకు పాపం అంటదు... అని ఉపాయాన్ని చెప్పాడు. అతని మాటకు తక్కిన వారందరు సరే యని యథా శాస్త్రీయంగా ఆ కార్యాన్ని నిర్వహించారు. పిమ్మట గురువును చేరి గోవును పులి తినేసిందని చెప్పి దూడను మాత్రం అప్ప చెప్పారు. పిమ్మట కాలగతిలో వారందరు మరణించారు.

మరుజన్మలో వారు గోవధ అనే క్రూరకర్మను ఆచరించిన దానికి ఫలంగా దశార్ణ దేశంలో ఒక కిరాతునకు పుత్రులై జన్మించారు. కాని శ్రాద్ధంలో పితృదేవతలను సంతోష పెట్టిన కారణంగా పూర్వజన్మ జ్ఞానాన్ని కలిగియుండి ధర్మబద్ధంగా జీవించారు. వారికి గత

జన్మల శాస్త్ర జ్ఞానం కూడా ఉంది. తరువాత కొంత కాలానికి వారు కాలధర్మాన్ని పొంది తిరిగి కాలంజర పర్వత సమీపంలో లేళ్ళుగా జన్మించారు. అప్పుడు కూడా పితృదేవతారాధన ఫలంగా పూర్వజన్మ స్మృతి జ్ఞానాన్ని కలిగియుండి శివ సన్నిధిలో జ్ఞానవైరాగ్యాలతో జీవించి కాలగతిని పొందారు, మరుజన్మలో వారు మానస సరోవరంలో చక్రవాక పక్షులై జన్మించి పూర్వజన్మస్మృతి జ్ఞానం కలిగి యోగులై జీవించారు. ఆ పక్షుల పేర్లు: సుమనస్కుడు, సువాక్, శుద్ధుడు, పశ్చిముడు, ఛిద్రదర్శకుడు, స్వతంత్రుడు, సుయజ్ఞుడు. వారు పేరుకు తగినట్లు కర్మలను ఆచరిస్తూ ఉండేవారు.

మునులారా! ఒకరోజున ఒక చిత్రమైన సంఘటన జరిగింది. చెపుతున్నాను వినండి. పాంచాల దేశ రాజైన వైభ్రాజుడు తన అంతఃపుర స్త్రీలతోను, పరివారంతోను ఉద్యానవన విహారానికై వచ్చి సవిలాసంగా విహరిస్తూ ఉండగా ఆ చక్రవాక పక్షులు చూచాయి. కౌశికుని కుమారులలో పితృవర్తి అనువాడు రాజు యొక్క వైభవాన్ని చూచి తానుకూడా మరుజన్మలో రాజు. కావలెనని సంకల్పం చేశాడు. మరో ఇద్దరు మంత్రులను చూచి మరుజన్మలో మంత్రులుగా పుట్టాలని సంకల్పం చేశారు. మిగిలిన నలుగురు ఏమీ సంకల్పం చెయ్యలేదు.

కొంతకాలం తర్వాత చక్రవాక పక్షులు కాలధర్మాన్ని పొందాయి. అందులో పితృవర్తి అనేవాడు పాంచాలదేశ రాజైన వైభ్రాజునకు బ్రహ్మదత్తుడను పేర కుమారుడై జన్మించాడు. మిగిలిన వారిలో ఇద్దరు కండరీకుడు, సువాలకుడు అను పేర్లతో జన్మించి; బ్రహ్మదత్తుడు పట్టాభిషిక్తుడు కాగానే అతనికి మంత్రులయ్యారు. మిగిలిన నలుగురు పాంచాల రాజధాని ఐన కౌంపిల్య నగరంలో నివసించే ఉత్తమ శ్రోత్రియుడైన విద్యాచండుడనే బ్రాహ్మణునకు పుత్రులై జన్మించారు. వీరు పూర్వ జన్మస్మృతి జ్ఞానం కలవారు. శ్రాద్ధ కర్మలో ఉపయోగింపబడిన గర్గుని కపిల గోవు, దేవలుడను రాజుకు సన్నతి అనుపేర కుమార్తెగా జన్మించి బ్రహ్మదత్తునికి భార్యయై వేదవేత్రి అయింది.

ఒక రోజున బ్రహ్మదత్తుడు తన దేవేరి సన్నతితో కూడి ఉద్యానవనంలో విహరిస్తూ... కామ ప్రవృత్తి హేతువుగా కలహించుకొంటూన్న చీమల దంపతులను చూచాడు. సకలప్రాణి ధ్వని విశేషాల నెరిగిన బ్రహ్మదత్తుడు చీమల దంపతుల సంభాషణ అంతటిని విన్నాడు. మగచీమ కామశర పీడితయై గద్గదస్వరంతో ఆడచీమను ఇలా బ్రతిమాలుతూ అనునయిస్తోంది:

"ప్రియురాలా! సుందరీ! కళ్యాణీ! జగన్మోహినీ! నీ అంత అందగత్తెను నేనెక్కడా చూడలేదు! నీ నడుము సన్నగా ఎంత అందంగా ఉంది! దానికి ఆకాశం అందదు మనోహరమైన ముఖం మెరిసే చెక్కిళ్ళు విశాలమైన నేత్రాలు ప్రసన్నమైన చూపులు! ఓయారంపు నడక! మేలిమి బంగారపు మేనిఛాయ! నాయందు నీకు అమితమైన భక్తి! నేనెప్పుడైన పొరుగూరు వెడితే నీవు దీనురాలవై ఉంటావు. నీకు బెల్లము మీద చక్కెర మీద ప్రీతి యెక్కువ. నేను భుజించనిదే నీవు భుజించవు. నా బాధను చూచి నీవు కన్నీరు కారుస్తావు! అట్టి నీవు నా యెడ ఎందుకని కోపంతో ఉన్నావు? చెప్పవూ!"

మగచీమ మాటలకు ఆడుచీమ శోకంతో ఇలా బదులిచ్చింది: "ఓ! శఠా! (తప్పుచేసి కప్పిపుచ్చుకొనే వాడు) నన్నెందుకు బ్రతిమాలుతావు? నిన్నటి రోజున పారవశ్యంతో ఒడలెరుగక ఒక మధుర భక్ష్యాన్ని పొడిచి నాకీయకుండ అతిప్రేమతో మరొక ఆడుచీమకు ఇచ్చి లాలనతో తినిపించావు! ఈ కపట నాటకాలు కట్టిపెట్టు! నీ పొగడ్తలకు పొంగిపోయే వారెవరూ ఇక్కడ లేరు! వెళ్ళు! వచ్చిన దారినే వెళ్ళు!"

దానికి సమాధానంగా మగచీమ ఇలా అంది: "ఓహో! అదా సుందరీ! నువ్వెప్పుడూ నా చెంతనే ఉంటావు! అకారణంగా నీ పోలికతో ఉన్న మరొక చీమకిచ్చాను... నువ్వే అని అనుకొని! క్షమించు! మరెప్పుడూ అలాటి పొరపాటు పని చెయ్యను! కేవలం భ్రమ ప్రమాదం వల్ల జరిగిన పని అది! సత్యం ప్రమాణంగా నీ పాదాలను పట్టుకొంటున్నాను. నన్ను క్షమించు! అనుగ్రహించు! నాయందు సముఖురాలవు కమ్ము! ప్రసన్నురాలవు కమ్ము!" మగచీమ మాటలకు ఆడచీమ మిక్కిలి ప్రసన్నురాలై తనను తాను ప్రియునకు సమర్పించుకొన్నది.

చీమ దంపతుల సంభాషణను వినిన బ్రహదత్తుడు అమితాశ్చర్యాన్ని పొంది నవ్వేడు. చెంతనే ఉన్న అతని భార్య సన్నతి అతని నవ్వును చూచి కారణాన్ని అడిగింది. రాజు చీమ దంపతుల సంభాషణను తాను వినిన దానిని ఉన్నదున్నట్లుగా చెప్పాడు. కాని సన్నతి దానిని నమ్మక తన విషయంలోనే రాజు నవ్వినట్లుగా అనుమానించి నిజం చెప్పమని హఠం చేసింది. "నాయందు అనురాగము, విశ్వాసము లేని నీతో జీవించను!" అని ప్రతిజ్ఞ చేసింది.

"నేను చెప్పిన దానికి రేపు ఉదయం నీకు సాక్ష్యాన్ని కనబరుస్తాను!" అని పలికి రాజు మౌనాన్ని వహించి ఆ రాత్రి శివుని ధ్యానించాడు. బ్రహ్మదత్తుడు గొప్ప శివభక్తుడు.

శివానుగ్రహం చేతనే ఆయనకు సకల ప్రాణుల ధ్వని విశేషాలను తెలుసుకొనే సామర్థ్యం లభించింది. రాజునకు ఆ రాత్రి ధ్యానంలో శివుడు ప్రత్యక్షమై "రాజా! రేపు ఉదయమే నీ భార్యతోను, మంత్రులతోను కలిసి నగర సంచారం చేయి! నీకొక వృద్ధ బ్రాహ్మణుడు కనుపిస్తాడు. అతని మూలంగా నీకు సమస్తము విశదం కాగలదు!" అని చెప్పి అంతర్హితుడయ్యాడు.

వృద్ధ బ్రాహ్మణుని వృత్తాంతం

మునులారా! ఏడు చక్రవాక పక్షులలోను నాలుగు పక్షులు కాంపిల్య నగరంలో విద్యాచండుడనే ఉత్తమ శ్రోత్రియునకు నలుగురు పుత్రులుగా జన్మించారని చెప్పాను గదా! వారు పూర్వజన్మ స్మృతిజ్ఞానం కలిగి ఉండేవారు. వారు పెరిగి పెద్దవారై వైరాగ్యాన్నిపూని తపస్సాచరించి ఉత్తమగతిని పొందాలనే దృఢ సంకల్పంతో తండ్రి అనుమతి కోరగా ఆయన "వృద్ధుడు, నిర్ధనుడు ఐన తండ్రిని విడిచి వెళ్ళటం మీకు న్యాయం కాదు. అది ధర్మవిరుద్ధం. కనుక అనుమతించ లేను!" అని సమాధాన మిచ్చాడు.

దానికి వారిలా ప్రత్యుత్తరమిచ్చారు: "తండ్రీ! కురుక్షేత్రంలో కౌశిక బ్రాహ్మణునకు పుత్రులుగా జన్మించి, ఆపై దశపురంలో వ్యాధులుగా పుట్టి, పిమ్మట కౌలంజర పర్వతంవద్ద లేళ్ళుగా, అటు పిమ్మట మానస సరస్సునందు చక్రవాక పక్షులుగా జన్మించిన మేము ఈ జన్మలో నీ పుత్రులుగా జన్మించాం. నీవు వెళ్ళి రాజైన బ్రహ్మదత్తుని ఆశ్రయించు. మా పూర్వజన్మ వృత్తాంతాన్ని అతనితో చెప్పు. నీకు రాజు వసతిని కల్పిస్తాడు. అని చెప్పి వారు తపస్సు ఆచరించటం కొరకు వనానికి వెళ్ళిపోయారు.

బ్రహ్మదత్తుడు తన భార్య ఐన సన్నతితోను, మంత్రులతోను కలిసి ఉదయమే నగర సంచారానికి బయలుదేరాడు. దారిలో విద్యాచండుడు ఎదురై రాజుతో ఇలా అన్నాడు. "కురుక్షేత్రంలో కౌశిక పుత్రులుగా పుట్టిన వారే మరుజన్మలో దశపురంలో వ్యాధులుగా, తరువాత జన్మలో లేళ్ళుగా, ఆపై జన్మలో చక్రవాక పక్షులుగా జన్మించి ఇప్పుడిక్కడ పుట్టి యోగసిద్ధిని పొందగోరుచున్నారు!"

వృద్ధ బ్రాహ్మణుని మాటను వినగానే రాజునకు సన్నతికి మంత్రులకు పూర్వజన్మ స్మృతి కలిగింది. బ్రహ్మదత్తుడు బ్రాహ్మణునకు వసతిని కల్పించి, భూములను, ధనాన్ని ఇచ్చి సత్కరించాడు. మంత్రులలో సువాలకుడు పంచాల దేశంలో 'బాభ్రవ్య' గోత్రంలో జన్మించిన కారణంగా పాంచాల బాభ్రవ్యుడను పేరుతో లోక ప్రసిద్ధుడై బృహత్తరమైన

కామశాస్త్ర గ్రంధాన్ని వ్రాశాడు. తరువాత కాలంలో ఆ గ్రంథం "బాభ్రవ్య స్మర దర్శనము" అను పేరుతో లోక ప్రసిద్ధమై దర్శన గౌరవాన్ని పొంది తదనంతర కామశాస్త్ర ఆచార్యులందరకు ప్రామాణికమై, ఆధార గ్రంథమై మన్నన కెక్కింది. ఈ యుగంలో ఈ లోకంలో కామశాస్త్ర ప్రవర్తకుడతడే. నిర్మల చిత్తుడైన కండరీకుడు లోక హితార్థం వైద్యశాస్త్ర గ్రంథాన్ని నిర్మించి వాసికెక్కాడు.

తర్వాత కొంతకాలానికి బ్రహ్మదత్తుడు సకల సద్గుణ సంపన్నుడైన తన కుమారుని రాజుగా అభిషేకించి తన మంత్రులతో కూడి అరణ్యానికి వెళ్ళాడు. అక్కడ వారందరు వానప్రస్థ జీవితాన్ని గడిపి యోగంచే ఉత్తమ లోకాలను పొందారు.

ఇది పితృదేవతారాధన వల్ల లభించే ఉత్తమలోక ప్రాప్తిని గురించి వివరించే చక్కని పూర్వగాథ. ఈ గాథను శ్రాద్ధ సమయంలో సత్పురుషుడైన ఆచార్యునిచే చదివించుకొని శ్రద్ధాభక్తులతో విని ఆచార్యుని పూజించాలి. యథాశక్తి ఆయనను సత్కరించాలి.

వ్యాస భగవానుని జన్మ వృత్తాంతం

సూత వచనాలను శ్రద్ధతో ఆలకించిన మునులు పరమప్రీతులై అష్టాదశ పురాణ కర్త, మహాభారత సంహితా రచనా ధురంధరుడు, సత్యవతీ పుత్రుడు అయిన వ్యాస భగవానుని జన్మ వృత్తాంతాన్ని సవిస్తరంగా చెప్పవలసిందని వినయంగా వేడగా సూతమహర్షి పరమ హర్షంతో తన గురువుగారి జన్మ వృత్తాంతాన్ని ఇలా చెప్పసాగేడు: "మునులారా! పరమ తపోనిధి, జ్ఞాన భాస్కరుడు, సర్వ మానవాళికి జ్ఞాన తేజస్సును పంచి ధర్మాధర్మాలను వివరించి చెప్పి మనుష్యులలోని పశుత్వాన్ని మాన్పినవాడు అయిన మా గురువుగారి దివ్యమైన జన్మ వృత్తాంతాన్ని చెపుతున్నాను వినండి!

పూర్వం చేది దేశాన్ని పాలించే వసువు అనే రాజు మృగయా వినోదార్థం అడవికి వెళ్ళి అక్కడ తపస్సు చేసుకొంటున్న ఒక మునిని చూచి నిర్వేదంతో అస్త్ర సన్యాసం చేసి తానుకూడా మహానిష్ఠతో తపశ్చర్యకు ఉపక్రమించాడు. అతని ముందు ఇంద్రుడు ప్రత్యక్షమై వసురాజుకు దేవత్వాన్ని కల్పించి బహుమానంగా ఒక దివ్య విమానాన్ని, వాడని పద్మమాలను, దుష్ట శిక్షణ శిష్ట రక్షణా సామర్థ్యం గల వేణుయష్టిని (రాజ దండాన్ని) ఇచ్చి; ఈ స్నేహాన్ని కాపాడుకొనవలసింది అని చెప్పి అంతర్హితుడయ్యాడు. అప్పటి నుండి వసురాజు ఇంద్రుడిచ్చిన విమానం మీద ఉపరి లోకాలలో విహరిస్తూ ఉండేవాడు. ఆ కారణంగా అతనికి 'ఉపరిచర వసువు' అనే పేరు రూఢికెక్కింది. ఏటేట వసురాజు వేణు యష్టికి (రాజ దండానికి)

పూజలు చేసి ఇంద్రోత్సవాన్ని జరిపించే వాడు. అది మొదలు రాజులందరు లోకంలో ఇంద్రోత్సవాన్ని జరిపించటం పరిపాటి అయింది. అతనికి బృహద్రథుడు, మణివాహనుడు, సౌబలుడు, యదువు, రాజన్యుడు అను ఐదుగురు పుత్రులు. వారందరిని వేరువేరు దేశాలకు అభిషిక్తులను చేసి వసురాజు రాజర్షియై రాజ్యం చేస్తూండగా ఒకరోజున...

తన రాజధాని సమీపంలో ప్రవహిస్తూన్న శుక్తిమతి అనే నదిని కామించి కోలాహలుడనే పర్వతరాజు నదిని అడ్డగించి బాహువులతో బంధించాడు. శుక్తిమతి మొరాలకించి వసురాజు తన కాలితో ఆ పర్వతాన్ని తొలగ ద్రోశాడు. పర్వత సమాగమంచే శుక్తిమతికి వసుపదుడు అనే కుమారుడు, గిరిక అనే కూతురు ఉద్భవించారు. తనకుఉపకారం చేసిన వసురాజుకు తన సంతానమైన ఆ ఇద్దరిని కృతజ్ఞతా సూచకంగా అప్పగించింది శుక్తిమతి. వసురాజు గిరకను తన ధర్మపత్నిగా చేసికొని వసుపదుణ్ణి సేనాపతిగా నియమించాడు.

ఒకరోజున ఋతుమతి ఐన గిరకకు మృగమాంసాన్ని తెచ్చిపెట్టమని పితృదేవతలు శాసించగా వసురాజు వేటకు వెళ్ళి వనంలో గిరికయొక్క సౌందర్యాన్నే తదేకనిష్ఠతో ధ్యానం చేయగా రాజుకు రేతఃస్ఖలనమైంది. రాజు ఆ వీర్యాన్ని శీతల పర్ణపుటంలో సంగ్రహించి బంధించి దానిని ఒక డేగ మెడకు కట్టి గిరికాదేవికి ఇమ్మని పంపించాడు. ఆ డేగ అతిత్వరిత గతిని ఆకాశ మార్గంలో పయనిస్తూ ఉండగా, ఒక గ్రద్ద ముక్కున నున్నది మాంసఖండమనే భ్రాంతిచే పర్ణపుటాన్ని కాళ్ళచే గ్రహించబోయింది. ఆ రెండింటి పెనగులాటలో పర్ణపుటం జీర్ణమై వసువీర్యం చెదరి యమునా నదీ మధ్యలో పడింది. బ్రహ్మ శాపవశం చేత అద్రిక అనే అప్సరస యమునా నదిలో మీనమై తిరుగుతూ వసువీర్య బిందుద్వయాన్ని త్రావి గర్భాన్ని దాల్చింది. పదిమాసములు నిండింది. ఒకరోజున జాలరులు చేపలవేటకై వచ్చి వలలు వేయగా అద్రిక వలలో చిక్కింది. జాలరులు పెద్ద చేప చిక్కింది అనే సంబరంతో చేప ఉదరాన్ని ఛేదించగా అందులో ఆడ-మగ శిశువులను చూచి తక్షణం వారిద్దరిని తమ ప్రభువైన దాశరాజు కిచ్చారు. అద్రిక శాపవిమోచనాన్ని పొంది అదృశ్యమైంది. కొడుకు పెరిగి పెద్దవాడై మత్స్యరాజుగా పిలువబడి రాజయ్యాడు. మత్స్యరాజుచే పాలింపబడిన దేశం మత్స్యదేశం అయింది. ఆడపిల్లకు మత్స్యగంధి అని పేరుపెట్టి దాశరాజు అల్లారుముద్దుగా పెంచుకొంటున్నాడు. మత్స్యగంధి పెరిగి పెద్దయై తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటోంది.

ఒక రోజున వసిష్ఠ పౌత్రుడు, శక్తిమహర్షి పుత్రుడు అయిన పరాశర మునీంద్రుడు తీర్థయాత్ర సలుపుతూ యమునానదీ తీరానికి చేరుకొని అక్కడ ఉన్న దాశరాజుతో ఆవలి తీరానికి చేర్చమని కోరేడు. భోజనం చేస్తున్న దాశరాజు తన కుమార్తెయైన మత్స్యగంధిని పిలిచి మహర్షిని శీఘ్రంగా నది ఆవలి తీరానికి చేర్చమని ఆజ్ఞాపించాడు. భాస్కర తేజుడైన మహర్షి పడవలో ఆసీనుడయ్యాడు. ఏకవస్త్రయైన మత్స్యగంధి పడవ నడుపుతూ ఉండగా ఆమె శరీర రూప రేఖాలావణ్య సౌష్ఠవ విభ్రమ హేలా లీలా విలాసాలను చూచి మోహవిభ్రాంతుడైనాడు మహర్షి. తననింతగా మన్మథతాపానికి గురిచేస్తున్న ఆమె పూర్వజన్మ వృత్తాంతాన్ని యోగమహిమచే తెలుసుకొన్నాడు. గ్రహగతులను పరిశీలించాడు. కాలమహిమను గుర్తించాడు. భవిష్యత్తును పరికించాడు. అప్సరసల సౌందర్యానికి సైతం మోహితుడు కాని మహర్షి తన కోర్కె తీర్చమని కుడిచేతితో ఆమె కుడిచేతిని పట్టుకొన్నాడు. మునిచర్యకు ఆశ్చర్యపడిన ఆమె, ఆయన కోర్కెను తిరస్కరిస్తే శపిస్తాడేమో అని భయపడి లజ్జా, వినయ, సాధ్వస, సంభ్రమ, సందేహ, శంకా సంకలిత మానసయై ఇలా అంది:

"ఓ వాచంయమీ! తపశ్శాలురైన వారికి తగని పనిని చేస్తున్నావు. మీ బోటి వారికిది అతినిందితమైన కర్మ. ఎనుబదినాలుగు కోట్ల జీవరాసులలో మానవజన్మ దుర్లభం! అందులో బ్రాహ్మణ జన్మ మరీ దుర్గభం. తపశ్శాలి కాగల్గుట అత్యంత దుర్లభం. నేను పల్లెపడుచును. శరీరమంతా చేపల వాసన! పైగా కన్యను! నా తండ్రి ఒడ్డున ఉన్నాడు. దివాభాగం ఆ పనికి నిషిద్ధం. నల్లని వర్ణంగల ఈ జాలరిదాని కోసం మీ తపస్సును వృథా చేసికోకండి!"

కన్యయైన మత్స్యగంధి పల్కులను విని పరాశరుడు దాని ఇంగితాన్ని గుర్తించి యోజన దూరం వరకు పరివ్యాప్తమయ్యే దివ్య పరిమళంగల దానినిగా దానిని తీర్చి... కన్యాత్వం దూషితం కాకుండా వరమిచ్చి... దాని పూర్వజన్మ వృత్తాంతాన్ని తెలియ చెప్పి... అనేక దివ్యాంబరాభరణాదుల నిచ్చి... తన తపోమహిమచే ఒరులకు కానరాకుండా దట్టమైన నీహార తిమిరాన్ని సృష్టించి... లోక కళ్యాణాన్ని మనసులో సంకల్పించి మత్స్యగంధిని కూడి... తన ఆజ్ఞను సత్యం చేసినందుకు ఆమెకు 'సత్యవతి' అని నామకరణం చేసి... నిత్య సుగంధాన్ని, నిత్య యౌవనాన్ని వరాలుగా ఇచ్చి... తనంతటి పుత్రుడు కలుగుతాడని ఆశీర్వదించి... యమునా జలాలలో స్నానమాడి యథేచ్ఛగా వెళ్ళిపోయాడు.

పరమేష్ఠి కల్పుడైన పరాశర మునీంద్రు సమాగమంచే, పరమగుణైకాభరణ, అనవద్య మనోహరమూర్తి అయిన సత్యవతి, సద్యోగర్భాన్ని దాల్చి... కృష్ణాజిన జటా దండ

కమండలుధారి, వేదమయుడు, అఖిల మునీంద్రాద్యుడు అయిన పుత్రుని కన్నది. ఆ పుత్రుడు సత్యవతి కుమారుడు కనుక సాత్యవతేయుడని, పరాశర మహర్షికి పుట్టాడు కనుక పారాశర్యుడని, ద్వీపంలో జన్మించాడు కనుక ద్వైపాయనుడని, వేదాలకు శాఖా విభాగం చేశాడు కనుక వేదవ్యాసుడని లోక ప్రసిద్ధిని పొందేడు. పుట్టిన వెంటనే ఆ తేజశ్శాలి "నువ్వు నన్ను స్మరించిన వెంటనే నేను వచ్చి నీ కోరికను నెరవేరుస్తాను!" అని తల్లికి చెప్పి తపస్సుకై బదరీ వనానికి వెళ్ళిపోయాడు. మునులారా! ఇదీ మా గురువుగారి జన్మ వృత్తాంతం!"

వ్యాస భగవానుని కాశీ క్షేత్ర దర్శనం

భగవానుడైన వ్యాసుడు వివిధ పుణ్యక్షేత్ర, తీర్థాలలో తపస్సును చేయ సంకల్పించి ముందుగా నైమిషాన్ని దర్శించి తరువాత కురుక్షేత్రాన్ని, గంగాద్వారాన్ని, అవంతికను, అయోధ్యను, మథురను, ద్వారకను, అమరావతిని, సరస్వతిని, సింధునదీ సంగమాన్ని, గంగా సంగమాన్ని, కాంచి, శ్రీకాళహస్తి, త్ర్యంబకం, గోదావరీ తీరమందలి ఏడు క్షేత్రాలను, కాలంజరం, ప్రభాసం, బదరికాశ్రమం, మహలయం, ఓంకారం, పురుషోత్తమం, గోకర్ణం, భృగుకచ్ఛం, భృగుతుంగం, పుష్కరం, శ్రీ పర్వతం, ధారాతీర్థం మొదలైన పుణ్యక్షేత్రాలను సందర్శించి పుణ్య తీర్థాలలో స్నానమాచరించి గొప్ప తపస్సు చేశాడు. అలా పర్యటిస్తూ వారాణసీ నగరాన్ని చేరి మణికర్ణికలో స్నానమాచరించి అన్నపూర్ణా విశ్వేశ్వరుల దర్శనం చేశాడు. అక్కడగల కుండములు, బావులు, దిగుడు బావులు అన్నిటిలోను స్నానం చేసి అక్కడగల వినాయకులను గౌరీ దేవతలను దర్శించి కాలరాజులను, భైరవులను పూజించాడు. అక్కడగల దండనాయక గణాలకు నమస్కరించి, ఆదికేశవాది దేవతలను స్తుతించి లోలార్కాది సూర్యదేవతలకు పలుమార్లు మ్రొక్కాడు.

కాశీలోగల ఓంకారేశ్వర, కృత్తివాసేశ్వర, కేదారేశ్వర, కామేశ్వర, చంద్రేశ్వర, కాలేశ్వర, వృద్ధ కాలేశ్వర, జ్యేష్ఠేశ్వర, జంబుకేశ్వర, జైగీషవ్యేశ్వర, దశాశ్వమేధేశ్వర, ద్రుమిచండేశ్వర, దృక్కేశ్వర, గరుడేశ్వర, గోకర్ణేశ్వర, గణేశ్వర, ప్రసన్నవదనేశ్వర, ధర్మేశ్వర, తారకేశ్వర, నందికేశ్వర, నివాసేశ్వర, పత్రీశ్వర, పర్వతేశ్వర, పశుపతీశ్వర, హాటకేశ్వర, బృహస్పతీశ్వర, తిలభాండేశ్వర, భారభూతేశ్వర, మహాలక్ష్మీశ్వర, మరుతేశ్వర, మోక్షేశ్వర, గంగేశ్వర, నర్మదేశ్వర, కృష్ణేశ్వర, పరమేశ్వర, రత్నేశ్వర, యామునేశ్వర, లాంగలీశ్వర, శ్రీమద్విశ్వేశ్వర, అవిముక్తేశ్వర, విశాలాక్షీశ్వర, వ్యాఘ్రేశ్వర, వరాహేశ్వర, విద్యేశ్వర, వరుణేశ్వర, విధీశ్వర, హరికేశేశ్వర, భవానీశ్వర, కపర్దీశ్వర, కందుకేశ్వర, అజేశ్వర, విశ్వకర్మేశ్వర, వీరేశ్వర, నాదేశ్వర, కపిలేశ్వర,

భువనేశ్వర, బాష్కలీశ్వర, మహాదేవేశ్వర, సిద్ధీశ్వర, విశ్వేదేవేశ్వర, వీరభద్రేశ్వర, భైరవేశ్వర, అమృతేశ్వర, సతీశ్వర, పార్వతీశ్వర, మతంగేశ్వర, భూతేశ్వర, ఆషాఢేశ్వర, ప్రకామేశ్వర, కోటిరుద్రేశ్వర, మదాలసేశ్వర, తిలపర్ణేశ్వర, హిరణ్యగర్భేశ్వర, మధ్యమేశ్వర ఇత్యాది కోటి లింగాలను దర్శించి, పూజించి, స్తుతించాడు.

ఈ మధ్యమేశ్వర లింగం అవిముక్త క్షేత్రంలో నగర మధ్యన ఉన్న కారణంగా దానికాపేరు వచ్చింది. ఆ లింగాన్ని ఆరాధించి బ్రహ్మ సృష్టికర్త, విష్ణువు స్థితికర్త, రుద్రుడు లయకర్తలయ్యారు. వాసవుడు స్వర్గాధిపతి అయ్యాడు. యమ, వరుణ, కుబేరాదులు లోకపాలకులు కాగలిగారు. తుంబురు, నారాదాదులు సంగీత విద్యలో నిష్ణాతులు కాగలిగారు. వామదేవుడు శివభక్తులకు అధీశ్వరుడైనాడు. ఖట్వాంగుడనే రాజు సంతానాన్ని పొంద గలిగాడు. భక్తిపూర్ణయగు చంద్రభామ అనే అప్సరస నృత్యగానాలతో మధ్యమేశ్వరుని అర్చించి లింగ మధ్యంలో దేహంతో లయమైంది. శ్రీకరుడనే గొల్లపిల్లవాడు గణాధ్యక్ష స్థానాన్ని పొందేడు.

ఈ విషయాలను ఎఱిగిన వ్రతశీలుడైన వ్యాసుడు తాను వేద విజ్ఞానాన్ని బడయగోరి, పురాణకర్త కాదలచి మధ్యమేశ్వర లింగాన్ని నియమ పాలనతో ఆరాధిస్తూ అతి కఠోరమైన తపస్సును అవిముక్త క్షేత్రంలో ఆచరించాడు. వ్యాసుని తపోదీక్షకు మెచ్చిన ఉమాభూషిత వామాంగుడు, వ్యాఘ్రచర్మాంబరధరుడు, జటాజూట చలద్గంగా తరంగ శోభితుడు, బాలేందు శేఖరుడు, భస్మోద్ధూలిత ధూసరాంగుడు, కర్పూరార్జున విగ్రహుడు, కర్ణాంతాయత విశాలనేత్రుడు, చారుకపోల భాసితుడు, నీలకంఠుడు, ఫాలలోచనుడు అయిన శంకరుడు ఐందేండ్ల బాలుని రూపంలో సామగానం చేస్తూ నవ్వు ముఖంతో లింగ మధ్యంలో సాక్షాత్కరించాడు. శతకోటి కందర్ప సమాన సౌందర్య విలసితుడు, శారద పూర్ణిమా సంకాశ సుందర మందహాస వదనారవిందుడు అయిన బాలుని చూచి ఆ బాలుడు పార్వతీపతి అని గుర్తెరిగి మేన పులకాంకురాలు పొడమ, హర్షోన్మీలితారవిందాక్షుడై, కన్నుల ఆనందాశ్రువు లొలుక వ్యాసుడు బుద్ధిసమంచితమైన వాక్కుల ఇలా స్తుతించాడు:

శ్లో॥ దేవదేవ! మహాభాగ! శరణాగత వత్సల ।
వాఙ్మనః కర్మ దుష్ప్రాపయోగినా మప్యగోచర ॥
మహిమానం న తే వేదా విదామాసురుమాపతే ।
త్వమేవ జగతః కర్తాధర్తాహర్తా తథైవ చ ॥

త్వమాద్య స్సర్వదేవానాం సచ్చిదానంద ఈశ్వరః ।
నామగోత్రే న వా తే స్తస్సర్వజ్ఞోఽసి సదాశివ ॥
త్వమేవ పరమం బ్రహ్మ మయాపాశ నివర్తకః ।
గుణత్రయైర్న లిప్తస్త్వం పద్మపత్రమివాంభసా ॥
నతే జన్మ న వా శీలం న దేశో న కులం చ తే ।
ఇత్థం భూతోఽపీశ్వరత్వం త్రిలోక్యాః కామమావహేః ॥
నచ బ్రహ్మా న లక్ష్మీశో న చ సేంద్రా దివౌకసః ।
న యోగీంద్రా విదుస్తత్వం యస్యతం త్వాముపాస్మహే ॥
త్వత్తస్సర్వం త్వం హి సర్వం గౌరీశస్త్వం పురాంతకః ।
త్వం బాలస్త్వం యువా వృద్ధ స్త్వం త్వాం హృది యువజ్ఞహమ్ ॥
సమస్తస్మై మహేశాయ భక్తధ్యేయాయ శంభవే ।
పురాణ పురుషాయాద్ధా శంకరాయ పరాత్మనే ॥

తా॥ ఓ దేవదేవా! మహాభాగా! శరణాగత వత్సల! నీవు వాక్కులకు, మనస్సుకు, కర్మలకు అందవు. యోగులకు సైతం అగోచరుడవు! హే ఉమాపతీ! నీ మహిమను వేదాలు సైతం తెలుసుకో లేవు. జగత్తుకు కర్తవు, ధర్తవు, హర్తవు నీవే! సచ్చిదానంద ఈశ్వరుడవగు నీవే సర్వ దేవతలలోను ఆది దైవానివి! సర్వజ్ఞుడవైన సదాశివా! నీకు నామ గోత్రములు లేవు! మాయాపాశమును నివర్తించు పరంబ్రహ్మవు నీవే! తామరాకును అంటని నీరువలె సత్త్వరజస్తమో గుణాలు నిన్ను అంటవు. నీకు జన్మ, శీల, దేశ, కులాదులు లేవు! ఐనా నీవు నీ ఇచ్ఛ చేతనే ముల్లోకాలకు ఈశ్వరుడవై ఉన్నావు! త్రిమూర్తులు, ఇంద్రుడు, దేవతలు, యోగీంద్రులు సైతం నిన్ను తెలుసుకోలేరు! అట్టి నిన్ను నేను ఉపాసిస్తున్నాను! ఓ గౌరీశా! త్రిపురాంతకా! సర్వము నీవే, సమస్తము నీవే, బాలుడవు నీవే, యువకుడవు నీవే, వృద్ధుడవు నీవే! నిన్ను హృదయంలో ప్రతిష్ఠించుకొన్నాను. మహేశా! భక్తధ్యేయా! పురాణ పురుషా! శంకరా! నీకు అనేక ప్రణామాలు.

ఈ విధంగా స్తుతించి సాత్యవతేయుడు శంకరునికి అనేక సార్లు దండప్రణామాలాచరించి ఆ బాలుని ముందు చేతులు జోడించి నిలబడ్డాడు. బాలుని రూపంలో ఉన్న సర్వజ్ఞుడైన శంకరుడిలా వరమిచ్చాడు. "ఓ బ్రహ్మవిదుడా! నీ హృదయంలో ఉన్న 'అభిలాష' నిశ్చయంగా నెరవేరుతుంది. సకల ప్రాణులలోను అంతర్యామి స్వరూపంగా

శివస్వరూపంలో ఉన్న నేను నీ కంఠమందుండి ఇతిహాస పురాణాలను నీవు చక్కగా వ్రాసేటట్లు నీకు వరమిస్తున్నాను. నీ పేరు, నీ వాఙ్మయం జగద్వ్యాప్త మవుతుంది. నీ వాఙ్మయం ప్రళయంలో కూడా నశించదు. నీవు చేసిన స్తుతికి 'అభిలాషాష్టకము' అని పేరు. దీనిని పఠించిన వారి అభిలాష (కోరిక లేక ఇచ్ఛ) తప్పక నెరవేరుతుంది." అని శంభుడు వరమిచ్చి అదృశ్యుడయ్యాడు.

ఈ విధంగా శివానుగ్రహాన్ని పొంది పారాశర్యుడైన వ్యాసుడు పద్దెనిమిది పురాణాలను వ్రాశాడు. బ్రహ్మ, పద్మ, విష్ణు, శివ, భాగవత, భవిష్య, నారద, మార్కండేయ, అగ్ని, బ్రహ్మవైవర్త, లింగ, వరాహ, వామన, కూర్మ, మత్స్య, గరుడ, స్కాంద, బ్రహ్మాండములు అనునవి వాటి పేర్లు. బ్రహ్మ పురాణం మొదటిది. చతుర్ముఖ బ్రహ్మ స్వయంగా చెప్పిన కారణంగా దానికా పేరు వచ్చింది. పద్మపురాణం రెండవది. పద్మకల్పం యొక్క మహిమ దానిలో వర్ణింప బడింది. మూడవదైన విష్ణు పురాణం పరాశరప్రోక్తం. అది విష్ణువును గూర్చి బోధిస్తుంది, తండ్రి-కొడుకులకు భేదం లేదు కనుక అది వ్యాసప్రోక్తంగానే పరిగణింప బడుతూన్నది. నాల్గవదైన శివమహా పురాణంలో శివ గాథలు వర్ణింపబడ్డాయి. దుర్గా భగవతి యొక్క చరిత్రను, మహిమను బోధిస్తుంది. కనుక ఐదవదైన దానికి దేవీ పురాణమని, దేవీ భాగవతమని పేర్లు. నారదుడు చెప్పినది నారద పురాణం. మార్కండేయుడు చెప్పినది మార్కండేయ పురాణం. అగ్నిపురాణం అగ్నికి సంబంధించినది. భవిష్యత్తును గూర్చి చెప్పేది భవిష్య పురాణం. పరబ్రహ్మ జగత్తుకు వివర్తోపాదాన కారణమని చెప్పేది బ్రహ్మవైవర్తం. లింగము యొక్క చరిత్రను చెప్పేది లింగ పురాణం. వరాహవతారమును చెప్పే పురాణం వరాహ పురాణం. మహేశ్వరుడు చెప్పగా స్కందుడు విన్న పురాణం స్కాందం. వామనుని చరిత్రను చెప్పేది వామన పురాణం. కూర్మావతార గాథను చెప్పేది కూర్మ పురాణం. మత్స్య రూపంలో భగవానుడు చెప్పింది మత్స్య పురాణం. గరుడుడు స్వయంగా చెప్పింది గరుడ పురాణం. బ్రహ్మాండం యొక్క చరిత్రను చెప్పేది బ్రహ్మాండ పురాణం.

ఇట్టి పద్దెనిమిది పురాణాలను రచించి, సంహితలను, అనేక గీతలతో కూడియున్న మహాభారత సంహితను రచించాడు వ్యాస మహర్షి. ఓ మునులారా! ఇదీ వ్యాస జనన గాథ! సత్యవతికి పరాశరునితో సంయోగముండగా శంతన మహారాజుకు భార్య ఎలా అయింది అనే సందేహం పెట్టుకోకండి. మహర్షులు లోకోపకారం కొరకు జన్మించినవారు. వారి జన్మ వృత్తాంతాలు చిత్రంగా ఉంటాయి. వివేకులైన వారు మహాత్ముల చరిత్రలలోని

గుణాలను మాత్రమే గ్రహిస్తారు. అది రాజహంస లక్షణం. కాకులు కుళ్ళు మాంసాన్ని ఎంగిలి మెతుకులను తింటాయి. మానవుడు రాజహంసలా బ్రతకాలి. వ్యాస జనన గాథ పరమ పవిత్రమైనది, పాపహరమైనది.

మహాకాళీ ప్రాదుర్భావం

మునులు సూత మహర్షిని ఇలా ప్రార్థించారు. "ఓ బ్రహ్మవేత్తా! మానవులకు భుక్తి- ముక్తి ప్రదమైనది, అనేక ఉపాఖ్యానాలతో కూడినది అగు శంభు చరిత్రను వినిపించావు. ఉమాదేవి యొక్క సతి-పార్వతి అనే రెండు అవతారాలను గురించి కూడా సుధామధురంగా వినిపించావు. మిగిలిన అవతారాలను గురించికూడా ప్రసంగించు. జగన్మాత ఐన భగవతి యొక్క చరిత్రను చెప్పు."

మహర్షుల ప్రార్థనను మన్నించి సూతుడిలా చెప్పసాగేడు. "ఓ ఋషులారా! పావనమైన శ్రీమాత చరితను చెపుతున్నాను వినండి. దీని శ్రవణం వలన మాయ తొలగి సకల శుభాలు కలుగుతాయి. మాయ తొలగగానే పాపాలన్నీ పటాపంచలవుతాయి. ఆ దేవి యొక్క స్మరణ మాత్రం చేతనే ధర్మ-అర్థ-కామ- మోక్షములనే చతుర్విధ పురుషార్థాలు సిద్ధిస్తాయి. పూర్వం సురథుడనే రాజుకు మేధసుడనే మహర్షి చెప్పిన దానిని చెపుతున్నాను వినండి.

స్వారోచిష మన్వంతరంలో విరథుడనే రాజుండే వాడు. ఆయన పుత్రుని పేరు సురథుడు. సురథుడు ఇంద్రుని వంటి బలపరాక్రమాలు కలవాడే అయినా కర్మగతిచే శత్రురాజుల చేతిలో ఓడిపోయి ప్రాణభీతిచే బహుదూరం పయనించి ఒక అడవిలో ప్రవేశించాడు. అక్కడ బ్రహ్మవేత్త, తపోనిధి అయిన మేధసుని ఆశ్రమాన్ని చూచి ఆ ఋషిని దర్శించి ఆయన ఆతిథ్యాన్ని పొందాడు. ఋష్యాశ్రమంలో ఉన్నా తన రాజ్యభ్రష్టత్వాన్ని గురించే దుఃఖిస్తూ ఉండేవాడు ఆ రాజు. ఇలా ఉండగా ఒక రోజున సమాధి అను పేరుగల ధనిక వైశ్యుడు విన్ననైన వదనంతో అక్కడకు వచ్చి చేరాడు. అతని దీన స్థితిని గమనించి కారణమేమని ప్రశ్నించిన రాజుకు తనను తాను పరిచయం చేసుకొని ఇలా చెప్పి దుఃఖించాడు "రాజా! నా ఆస్తి, నా ధనం మీది లోభంచే నా భార్యాపుత్రులు, కోడళ్ళు అందరు ఏకమై విషప్రయోగంచే నన్ను చంపటానికి ప్రయత్నం చేయగా, అది తెలిసి నేనిలా పారిపోయి వచ్చాను. అక్కడ నా భార్యాపుత్రుల, బంధుమిత్రుల క్షేమ సమాచారం తెలియక బాధపడుతున్నాను." వైశ్యుని మాటలు విని అతని అజ్ఞానానికి, మోహానికి నవ్వుకొని, జాలిపడిన రాజు అతనితో కలిసి మహర్షిని సందర్శించాడు. విషయాన్ని చెప్పి అజ్ఞాన నివర్తకమైన ఉపదేశాన్ని చేయ వలసిందిగా వేడుకొన్నాడు.

అప్పుడు బ్రహ్మర్షి అయిన మేధసుడు మాయాపాశాన్ని నాశనం చేసే దేవీ చరిత్రను వారిద్దరికి ఇలా చెప్పసాగేడు. "ఓ రాజా! ఓ వైశ్యోత్తమా! వినండి అనాది, ఆద్యంత రహితమైనది ఐన ఆ మహామాయను త్రిమూర్తులు సైతం దాటలేరు. ఇక మానవుల లెక్కేమిటి? త్రిమూర్తులచే సృష్టి, స్థితి, లయములను కార్యాలను నిర్వహింప చేసేది ఆ జగన్మాతయే! సృష్టి ప్రారంభంలో జగత్తు అంతా జలమయమై ఉండగా యోగీశ్వరుడైన విష్ణువు శేషతల్పంపై యోగనిద్రలో ఉండగా అతని కర్ణరంధ్రాలలోని మాలిన్యం నుండి మధుకైటభులను ఇద్దరు రాక్షసులు ఉద్భవించారు. వారు పుడుతూనే భయంకరాకారులై నోళ్ళు తెరచి నాభికమల మందున్న బ్రహ్మను మ్రింగబోయారు. విధాత భయకంపితుడై పరమేశ్వరిని రక్షించమని ఈ విధంగా ప్రార్థించాడు: "ఓ మహామాయా! జగన్మాతా! రక్షించు, సర్వ కారణములకు కారణమైన దానవు నీవే మోహకారకమైన అజ్ఞానమనే చీకటి నీవే! తద్విచ్ఛేద కారకమైన జ్ఞానమనే వెలుగు నీవే! త్రిదేవ జననివి నీవే! దేవతలకు హవిస్సులను అర్పించే స్వాహాకారము నీవే, పితరులకు పిండము నర్పించే స్వధాకారము నీవే! ఓ తల్లీ! సంతోషము, పుష్టి, తుష్టి, శాంతి, సహనము, దయ, తృష్ణ, భ్రాంతి, స్మృతి అన్నీ నీవే! ఆకలి, సంపద, మనోవృత్తి, చైతన్యం అన్నీ నీవే. ఈ రాక్షసులను మోహింపచేయి. యోగనిద్రా పరవశుడైన నారాయణుని నీవు మేల్కొలుపు.

పరమేష్ఠి చేసిన స్తవానికి సంతసించిన ఆ జగన్మాత ఫాల్గుణ శుద్ధ దశమి నాడు ఆవిర్భవించి 'మహాకాళి' నామాన్ని పొంది బ్రహ్మకు అభయమిచ్చి విష్ణువును ఆవహించింది. వెంటనే విష్ణువు యోగనిద్రనుండి లేచి మధుకైటభులతో యుద్ధానికి సిద్ధపడ్డాడు. ఐదువేల సంవత్సరాలు కేవలం చేతులతో యుద్ధం చేసికూడా వారిని సంహరించలేక పోయాడు. అప్పుడు మహామాయా ప్రేరితులైన మధుకైటభులు మోహాన్ని పొంది విష్ణువు నుద్దేశించి "నీ పరాక్రమానికి, బాహుబలానికి సంతోషించాం! ఏదైనా వరం కోరుకో!" అని గర్వంతో పలికారు. వెంటనే మాయావి అయిన విష్ణువు "మీ ఇద్దరు నా చేతిలో మరణించాలి" అని కోరగా వారిలా అన్నారు.

"హే విష్ణో! ప్రస్తుతం ఈ భూమి అంతా జలాల్లో మునిగి ఉంది. మునగకుండ తేలియున్న స్థలంలో మమ్ము సంహరించు." వెంటనే విష్ణువు 'అట్లే అగుగాక' అని పలికి వారిద్దరిని తన ఒడిలోకి చేర్చుకొని చక్రంతో సంహరించాడు. ఇది మోహవిచ్ఛేద కారకమైన మహాకాళీ ప్రాదుర్భావ చరిత్ర."

మహాలక్ష్మీ స్వరూపమైన దుర్గాదేవి ప్రాదుర్భావం

సూతుడు శౌనకాది మునులతో ఇలా అంటున్నాడు. "మునులారా! మీకింత వరకు మేధసుడు చెప్పిన మహాకాళీ ప్రాదుర్భావాన్ని చెప్పాను. అతను చెప్పిన మహా లక్ష్మీ ప్రాదుర్భావ చరిత్రను వినండి. పూర్వం రంభుడనే రాక్షసుడుండేవాడు. వాని పుత్రుడే మహిషాసురుడు. వాడు దేవతలను, దిక్పాలకులను, ఇంద్రుని సైతం జయించి స్వర్గాధిపత్యం చేపట్టాడు. దేవతలంతా బ్రహ్మను వెంటపెట్టుకొని శివ, విష్ణువులను ఆశ్రయించి శరణు పొందారు. దేవతల నోటవిన్న మహిషాసురుని దుశ్చేష్టలకు ఆగ్రహోదగ్రులైన శివకేశవుల ముఖముల నుండి గొప్ప తేజస్సు పుట్టింది. అదే సమయంలో దిక్పాలకుల నుండి, దేవతల నుండి కూడ గొప్ప తేజస్సు పుట్టి ఒకచోట ముద్దగా చేరింది. ఆ తేజస్సు క్రమంగా స్త్రీ రూపాన్ని పొందింది. ఆమెయే దుర్గాదేవి. ఆమెకు శివుని తేజస్సుచే ముఖము, విష్ణువు తేజస్సుచే బాహువులు, యముని తేజస్సుచే కేశములు, చంద్రుని తేజస్సుచే స్తనద్వయం, ఇంద్రుని తేజస్సుచే నడుము, వరుణుని తేజస్సుచే ఊరువులు, భూమి యొక్క తేజస్సుచే నితంబము, బ్రహ్మ తేజస్సుచే పాద ద్వయము, సూర్య తేజస్సుచే కాలివ్రేళ్ళు, కుబేరుని తేజస్సుచే ముక్కు, ప్రజాపతి తేజస్సుచే దంతములు, అగ్ని తేజముచే మూడు కన్నులు, సంధ్యా తేజస్సుచే రెండు కనుబొమలు, వాయు తేజముచే రెండు చెవులు నిర్మాణమయ్యాయి. ఈ విధంగా అనేక దేవతాకోటి తేజస్సుల కలయికచే ఆ పరమేశ్వరి ఆవర్భవించింది. ఆమె పద్మాసనాసీనయై ఉంది. ఆమెను చూచి త్రిమూర్తులతో కూడి దేవతలందరు ఆనందించి వారివారి ఆయుధాలను ఇచ్చారు.

దుర్గాదేవికి మహేశ్వరుడు శూలాన్ని, విష్ణువు చక్రాన్ని, వరుణుడు శంఖాన్ని మరియు పాశాన్ని, అగ్ని శక్తిని, వాయువు ధనుస్సును మరియు శరాసనాన్ని, ఇంద్రుడు వజ్రాన్ని మరియు గంటను, యముడు మృత్యుదండాన్ని, ప్రజాపతి అక్షమాలను, బ్రహ్మ కమండలువును, సూర్యుడు రోమములయందు కిరణాలను, మృత్యు దేవత కత్తిని డాలును, విశ్వకర్మ మనోహరమైన గండ్ర గొడ్డలిని మరియు అనేక అస్త్రములను అభేద్యమైన కవచాన్ని, హిమవంతుడు సింహాన్ని మరియు వివిధ రత్నములను, కుబేరుడు మణిరత్నస్థగిత పానపాత్రను, ఆదిశేషుడు నాగహారాన్ని సమర్పించారు. సముద్రుడు సుందరమైన మాలను పద్మాన్ని భద్రంగా ఇచ్చాడు. క్షీరసాగరుడు హారాన్ని, చూడామణిని, మణికుండల ద్వయాన్ని, హస్తాభరణాలను, చంద్రవంకను, కేయూరాలను, నూపురాలను, హారాన్ని, అంగుళీయకాలను,

దుకూల ద్వయాన్ని భక్తితో అర్పించాడు. ఇలా దేవతలంతా అనేక దివ్యాస్త్రాలను, దివ్యభూషణాలను ఇచ్చి దేవిని సత్కరించారు. స్తుతించారు.

అలా అస్త్రశస్త్రాదులచే, ఆభరణాలచే అలంకృతయైన దుర్గాదేవి అట్టహాసంగా సింహనాదం చేసింది. ఆ నాదం వ్యోమ మండలమంతా వ్యాపించి ప్రతిధ్వనించింది. భూమి కంపించింది. సముద్రాలు అల్లకల్లోలమయ్యాయి. పర్వతాలు కూలేయి. నక్షత్రాలు నేల రాలాయి. వాయువులు ప్రచండంగా వీచాయి. ఆ సంక్షోభాన్ని గమనించిన రాక్షసులు కీడును శంకించి ఆయుధాలను ధరించి యుద్ధ సన్నద్ధులై నిలిచారు. ఆ సింహనాదాన్ని ఆకర్ణించిన మహిషాసురుడు కోపాన్ని ఆపుకోలేక అలాత చక్రాల్లా కనుగ్రుడ్లను త్రిప్పుతూ నిప్పులవాన కురియ దేవికి అభిముఖంగా పరుగెత్తాడు. అతని వెంట సైన్యం నడిచింది. చిక్షురుడు, చామరుడు, ఉదగ్రుడు, కరాలుడు, ఉద్ధతుడు, బాష్కలుడు, తామ్రుడు, ఉగ్రాస్యుడు, ఉగ్రవీర్యుడు, బిడాలుడు, అంధకుడు, దుర్ధరుడు, దుర్ముఖుడు, త్రినేత్రుడు, మహాహనుడు ఇత్యాది దానవ సైన్యాధ్యక్షులంతా తమతమ సేనలతో వారి భయంకరమైన అరుపులకు ఆకాశం త్రుళ్ళిపడ, పదఘట్టనలకు భూమి వణక మహిషాసురుని వెంట నడిచారు.

శతకోటి శంపాలతా కాంతుల తనుద్యుతులతో లోక భీకరంగా అట్టహాసం చేస్తూన్న దుర్గాదేవిని చూచాడు మహిషుడు. మహారోషంతో ఎదుర్కొన్నాడు. సైన్యాన్ని ఆమెతో తలపడమని చేయూచాడు. సంకుల సమరం మొదలైంది. దేవి యొక్క నిశ్శ్వాసము నుండి అనేక వీర గణాలు పుట్టుకొచ్చాయి. పోరు ఘోరంగా సాగుతోంది. వారిలో కొందరిని మహిషుడు డెక్కలతో, కొందరిని కొమ్ములతో, మరికొందరిని ముట్టెతోను, తోకతోను పలుమార్లు కొట్టి సంహరించాడు. ముందుకు ఉరికాడు. దేవి సైన్యం అడ్డం వచ్చింది. చెంతనున్న పర్వతాలను తోకతో కొట్టాడు. పర్వతాలు పగిలి బండరాళ్ళు దొర్లిపడగా వాటి క్రింద పడి నలిగి మరణించారు దేవీగణం. దానికాగ్రహించిన దేవి వానిపైకి పాశాన్ని విసిరి బంధించింది. వెంటనే మాయావి అయిన మహిషుడు ఆ రూపాన్ని వదలి సింహ రూపాన్ని ధరించి దేవీగణాలను చీల్చటం మొదలు పెట్టాడు. దానికి కోపించిన దేవి కత్తితో వానితల నరకబోగా వాడు మదగజరూపుడై దేవి వాహనమైన సింహాన్ని తన తోకతో లాగేడు. దేవి కత్తితో వాని తోకను నరికింది. అపుడా రాక్షసుడు తన వాస్తవ రూపాన్ని ధరించాడు. ధరించి ముల్లోకాలను దద్దరిల్ల జేశాడు.

వెంటనే దుర్గ వాడిని ఉపేక్షించటం లోకాలకుమేలు కాదని యెంచి వానిపైకి కుప్పించి దూకి కావితో ఆ రాక్షసుని కంఠాన్ని త్రొక్కిపట్టి భయంకరమైన శూలంతో పొడిచి కత్తితో నరికి వాణ్ణి యమసదనానికి పంపింది. దేవతలందరు హర్షధ్వానాలు చేశారు. గంధర్వాప్సరగణాలు బృందనాట్యం చేశాయి. ఈ గాథ పరమ పావనమైనది.

మహా సరస్వతీ ఆవిర్భావగాథ – శుంభ నిశుంభుల వృత్తాంతం

సూతుడు మునులతో ఇలా అంటున్నాడు. "మునులారా! మీకిప్పుడు మహా సరస్వతీ ప్రాదుర్భావ చరితను చెపుతున్నాను వినండి! పూర్వం శుంభుడు-నిశుంభుడు అనే ఇద్దరు క్రూరులైన రాక్షసులు ఉండేవారు. వారు తమ ప్రతాపంచే ముల్లోకాలను ఆక్రమించారు. వారిచే పీడింపబడిన దేవతలు హిమగిరి ప్రాంతాలకు వెళ్ళి సర్వభూత జనని, కామదాత్రి అయిన గౌరీదేవికి నమస్కరించి ఇలా ప్రార్థించారు. "ఓ దుర్గా! ఓ మహేశ్వరీ! భక్తజనప్రియా! నీకు జయమగు గాక! శివకామినీ! ముక్తి ప్రదాయినీ! సంసారోత్పత్తి స్థిత్యంతకారిణీ! నీకు జయము! తల్లీ! కాళికా-తారా-ఛిన్నమస్తా-శ్రీవిద్యా-బగళాముఖి-ధూమావతి-త్రిపుర సుందరి-మతంగపుత్రి అను నామధేయాలతో యోగులచే ఉపాసింపబడే లోక సామ్రాజ్ఞివి నీవే! అపరాజిత-నిత్య- రుద్రాణి-గోరూపిణి-మంగళగౌరి అనునీకు నమస్కారం. ఉపనిషత్తులచే మాత్రమే తెలియబడే జ్ఞానరూపిణి అగునీకు ప్రణామాలు. మమ్ములను రక్షించు!"

ఆ సమయంలో దేవతల ప్రార్థనకు ప్రసన్నురాలైన గౌరీదేవి యొక్క దేహం నుండి ఒక కుమారి ఆవిర్భవించింది. పార్వతియొక్క దేహము అనే కోశమునుండి ఉద్భవించింది కనుక ఆమె 'కౌశికి' అనుపేర వాసికెక్కింది. ఆమెకు ఉగ్రతారిక, మహోగ్రతారిక అనే పేర్లుకూడా ఉన్నాయి. తల్లి యొక్క శరీరంనుండి సాక్షాత్తుగా పుట్టింది కనుక లోకంలో 'మాతంగి' అను పేరుతో ప్రసిద్ధురాలైంది. ఆమెదేవతలతో "మీరు నిర్భయులై ఉండండి! మీ అభిలాష త్వరలోనే నెరవేరుతుంది" అని అభయమిచ్చి పంపించి వేసింది.

ఆ సమయంలో శుంభ-నిశుంభుల సేవకులు చండ-ముండులనే వారు ప్రచ్ఛన్నంగా ఉండి గౌరీదేవి యొక్క మనోహరమైన కుమారీ రూపాన్ని చూచి విశేషమైన మోహాన్ని పొంది వెంటనే తేరుకొని శుంభుని వద్దకు వెళ్ళి ఇలా అన్నారు: "ఓ! దైత్య సార్వభౌమా! త్రిలోకాధిపా! మేమిప్పుడే ఒక అతిలోక సుందరిని చూచాం. ఆమె సింహవాహిని. హిమగిరి శిఖరంపై ఆ సొగసులన్నీ చూస్తూ చెలికత్తెలతో విహరిస్తూ ఉంటుంది. ఆ సౌందర్యం

వర్ణనాతీతం. గరుడ, గంధర్వ, యక్ష, రాక్షస, కిన్నర, కింపురుష, విద్యాధర, వీణాధర, శోణాధర స్త్రీలలో ఎవరూ కూడా ఆమెకు సాటిరారు. దేవతా స్త్రీలు, దిక్పాలకుల కాంతలు ఆ దేవిని అనేక విధాలుగా సేవిస్తున్నారు. ఓ దానవ శ్రేష్ఠా! ఆమె తమకు పట్టపు రాణిగా ఉండతగును." ఇలా చెప్పి ప్రక్కకు తప్పుకొన్నారు చండ-ముండులు. వారి పల్కులను విని వెంటనే మోహవిభ్రాంతిలో మునిగిపోయిన శుంభుడు సుగ్రీవుడనే దూతకు చెప్పవలసిన మాటలను చెప్పి జగన్మాత అయిన మహేశ్వరి వద్దకు రాయబారిగా పంపించాడు.

వాడు మహామాయ వద్దకు వెళ్ళి శుంభుని సందేశాన్ని చెప్పి శుంభ-నిశుంభులలో ఎవరినో ఒకరిని వరించమని తన రాజు ఆజ్ఞగా దేవికి విన్నవించాడు. వెంటనే దేవి మందహాసం చేసి "ఓ దూతా! నువ్వు మీ రాజు చెప్పిన సందేశాన్నే చెప్పి సత్యాన్నే పలికావు. నా ప్రతిజ్ఞను విను. ఎవడైతే నన్ను యుద్ధంలో జయిస్తాడో వానినే నేను పతిగా వరిస్తాను. ఇతరులు నాకు ఇష్టులు కారు. నా ప్రతిజ్ఞను మీ రాజుతో చెప్పు" అని చెప్పి పంపించింది. వాడు వెంటనే వచ్చి భువనేశ్వరి యొక్క ప్రతిజ్ఞను శుంభుని కెరిగించాడు.

భండనాన్ని పండుగగా భావించే శుంభుడు దూతనోట పరమేశ్వరి ప్రతిజ్ఞను విని మహదానంద పడ్డాడు. ధూమ్రాక్ష చండ-ముండ-రక్తబీజులనే సైన్యాధిపతులను యుద్ధానికి సైన్యాన్ని సిద్ధం చేయమని ఆజ్ఞాపించాడు. తమ్ముడైన నిశుంభుని వెంటపెట్టుకొని శుంభుడు బొబ్బలు పెడుతూ, జబ్బలు చరుస్తూ ఉత్సాహం ఉరకలు వేయగా, శౌర్యాగ్ని దీపింప, అక్షులు అగ్ని గోళాలై వెలుగ వీరరసాతిరేకంతో పెండ్లికొడుకులా రణరంగానికి కదిలాడు. అతనివెంట సకలాయుధ సంపన్నమై సమరోత్సాహంతో సైన్యం కదిలింది. అతని సేన కదులుతూ ఉంటే చూచు వారికి ప్రవహిస్తూన్న నదిలా తోచింది. రెపరెప లాడుతూన్న తెల్లటి జండాలు నదిపై ఎగురుతూన్న కొంగల గుంపులా ఉన్నాయి. సైన్య పదాహతికి రేగిన ధరాపరాగం ఆకాశాన్ని క్రమ్మి పగటిచీకట్లు వ్యాపించాయి. రథ, గజ, తురగ పదాతులతో కూడిన సైన్యం హిమాలయగిరి ప్రాంతాలకు చేరింది.

రాక్షస సైన్యాన్ని దూరాన్నుండే చూచింది అంబిక. లేళ్ళకదుపును చూచిన వ్యాఘ్రంలా ఉత్సాహంతో; నారిని వింట తొడిగి ఒక్కసారి ధనుష్టంకారం చేసింది. రాక్షసులకా శబ్దం పిడిగుపాటైంది. శత్రుభయంకరమైన ఘంటను మ్రోగించింది. ఆ నాదం రాక్షస సైన్యంలో మంటలను పుట్టించింది. ఆహవోత్సాహంతో వచ్చి అంబికకు ఎదురుగా రథస్థుడై నిలిచాడు శుంభుడు. చారుకుంతల, చంపకనాసాభ, పద్మపత్ర విశాలాక్షి, పక్వబింబాధరోష్ఠి, అర్ధచంద్రధర,

అసితేక్షణ, మణికుండల ధారిణి, గ్రైవేయకలసత్కంఠి, రమ్యవేణి, దివ్యమాల్యాంబర ధారిణి, లోచనత్రయ విరాజిత, లాక్షారంజిత చరణద్వయ శోభిత, అష్టభుజ ఆయుధ పాణి అయిన అంబికను చూచాడు. దిగ్భ్రమ చెందాడు. ఫాలభాగాన్ని కేల్దోయి సోకగా మ్రొక్కాడు. అంతలోనే ఆ జ్ఞానం కనుమరుగైంది. మబ్బు కమ్మేసింది. జగద్వ్యాప్తమైన ఆ జగన్మాత మహా సౌందర్యాన్ని స్వంతం చేసికొనాలని ఉవ్విళ్ళూరాడు. పంచభూతాత్మకమైన ప్రకృతి ఎవరికీ కైవశం కాదు అని గ్రహించలేక పోయాడు. ఉమాదేవితో ఇలా అన్నాడు:

"ఓ చతుర్దశ భువనైక మోహినీ! సుకుమార వాసంతికా! కుసుమ స్పర్శకే వాడిపోయే మేను నీది! చందనాగరు కస్తూరీ కుంకుమ పంకం నీ మేనికి బరువు! అలకామోదం నీ కుంతలాలకు భారం! లాక్షాద్రవ స్పర్శకు నీ చరణ పల్లవాలు ఓర్చుకోలేవు! అట్టి సుకుమారివైన నీవు నాతో ఎలా యుద్ధం చేయగలవు? మావిచిగురు స్పర్శకే కందిపోయే నీపైకి నిశిత శరాలను, క్రూర నారాచాలను గుప్పించటం నాకిష్టం లేదు. నా మాట విను! లొంగిపో! నిన్ను చతుర్దశ భువనాధీశ్వరిని చేస్తాను!"

అప్పుడు దేవి తగురీతిగా సమాధానం చెప్పి శుంభుని యుద్ధానికి పురిగొల్పింది. ఆమె మాటలకు క్రుద్ధుడైన రాక్షసుడు శరపరంపరలను ఆమె మీదికి నేర్పుతో మర్మభేదనంగా అంపవానలా కురిపించాడు. ఆమె వాటిని మధ్యలోనే తెగనరికింది. రాక్షసుని ప్రోత్సాహంతో సైన్యం ఉమాదేవిని చుట్టుముట్టింది. అసురులు వివిధ మారణాయుధాలను ప్రయోగిస్తున్నారు. తానొకతయే ఐనా తలకొక రూపై లోకభీకరంగా రణం చేస్తున్నది గౌరి. రేగిన ధరాపరాగం మబ్బులు కాగా నిశిత ఆయుధాల తళతళలు మెరుపులు కాగా, ఆభరణాల కాంతులు భూమిపై తటిల్లతా ద్యుతులు కాగా, రివ్వురివ్వున దూసుకుపోయే అలుగుల సవ్వడి ఈదురుగాలి హోరు కాగా, తెగిపడుతూన్న సైనికుల తలకాయలు వడగళ్ళు కాగా, శరపరంపర వర్షపు జల్లు కాగా, యుద్ధభేరీల మ్రోత పిడుగు చప్పుళ్ళు కాగా, భండన భూమి ప్రళయకాల పుష్కలావర్త సంవర్తక మేఘాడంబరంతో విలసిల్లే ఆకాశంలా భీతావహంగా ఉంది. రక్తసిక్తమైన రణరంగం రక్తార్ణవంలా ఉంది. రుధిరంలో తేలియాడుతున్న శవాలు మహాసాగరంలో కదలియాడుతున్న జలచరాల్లా ఉన్నాయి.

ఇట్టి సమయంలో బీరాలను పల్కుతూ నిశుంభుడు దేవిని ఎదుర్కొన్నాడు. ఆమె ఆశీవిష సమమైన బాణాలతో వాణ్ణి సంహరించింది. తమ్ముని మరణాన్ని చూచి కించిత్తు దైన్యాన్ని పొంది అంతలోనే తేరుకొని అష్టభుజుడైన శుంభుడు తేరెక్కి దేవికి అభిముఖంగా

స్థిరంగా నిల్చుని శ్రవణపుట భేదనంగా శంఖధ్వని చేసి, పిడికిట ధనుర్మధ్యాన్ని పట్టి, అల్లెత్రాటిని కొనకు చుట్టి, నాకలోక వాసులు శోక వికలు లయ్యేటట్లు నారిని సారించి, మహా భుజంగాల వంటి మార్గణాలను దేవి మీదికి ప్రయోగించి సింహనాదం చేశాడు. అపుడు దేవి వాని బాణాలను నేర్పుతో నడుముకు త్రెంచి త్రిశూలంతో పొడిచింది. దానికి వాడు నేలకూలి యమ సదనానికి చేరుకొన్నాడు.

దేవి చేతిలో మరణించిన వారందరూ శివ సాయుజ్యాన్ని పొందారు. ఇది ఉమనుండి ఆవిర్భవించిన మహా సరస్వతీ దేవి ప్రాదుర్భావ గాథ. ఈ గాధను చదివినా వినినా సకలాభీష్టములు నెరవేరుతాయి.

ఉమా ప్రాదుర్భావం

ఇంతవరకు శ్రద్ధతో ఆలకించిన మునులు సూతుని ఉమాదేవి ప్రాదుర్భావాన్ని చెప్పవలసిందని కోరగా సూతుడిలా చెప్పసాగేడు: "మునులారా! పూర్వం జరిగిన దేవాసుర సంగ్రామము లన్నిటి యందు మహామాయా ప్రభావంచే దేవతలకే విజయం దక్కింది. అన్ని యుద్ధములందు చివరకు రాక్షసులు పరాజితులయ్యారు. దేవతలు గర్విష్ఠులయ్యారు. ఒక రోజున దేవతలందరు ఒక చోటున చేరి, సాధించిన యుద్ధ విజయాలను గురించి ముచ్చటించుకొంటూ, పరస్పరం ప్రశంసించుకొంటూ, వీరాలాపా లాడుకొంటూ ఉండగా దూరంగా ఒక అద్భుతమైన తేజస్సు గోచరించింది. దానిని చూచి వారు ఆశ్చర్యచకితులయ్యారు. "మీరు వెళ్ళి దాని యధార్థ స్వరూపాన్ని తెలుసుకొని రండి" అని దేవరాజు ఆజ్ఞాపించగా దేవతలలో మొదటి వాడైన వాయువు ఆ తేజస్సును సమీపించాడు.

"నీవెవరు?" అని ఆ తేజస్సు వాయువును ప్రశ్నించింది. "నేను వాయువును. దేవతలందరిలోను అతి బలవంతుడను! నా మీద ఆధారపడి ఈ లోకాలన్నీ జీవిస్తున్నాయి!" అని గర్వంతో సమాధాన మిచ్చాడు వాయువు. వాయువు యొక్క అజ్ఞానానికి నవ్వుకొని ఆ తేజస్సు ఒక గడ్డిపరకను అతని ముందుంచి దానిని కదల్చమని కోరింది. సంపూర్ణంగా ప్రయత్నించి కదల్చలేక విఫలుడై వాయువు సిగ్గుతో వెనుదిరిగి దేవరాజుకు ఆ విషయాన్ని చెప్పాడు. అప్పుడు అమరేంద్రుడు మిగతా దేవతల నందరిని పంపాడు. వారందరు కూడా ఆ గడ్డిపోచను కదల్చలేక విఫలులై అవమాన భారంతో తిరిగి వచ్చారు. అపుడింద్రుడు తానే స్వయంగా బయలుదేరాడు. ఇంద్రుని చూచి ఆ శక్తి అదృశ్యమైంది. తక్షణం దేవతలందరు పునరాలోచనలో పడి తర్కించుకొని తమకింతవరకు తెలియని అదృశ్య శక్తియేదో ఈ

సృష్టిని నడిపిస్తోంది అనే నిశ్చయానికి వచ్చారు. అందరూ కూడి ఆ శక్తినే ధ్యానించారు. దానికే మ్రొక్కి దానినే శరణువేడారు.

అపార కృపారాశి అయిన పార్వతి దేవతల అజ్ఞానాన్ని పోగొట్టి వారిని అనుగ్రహించే నిమిత్తమై చైత్రశుక్ల నవమినాడు సూర్యుడు నడినెత్తిపై ఉండగా ఉమాదేవిగా సాక్షాత్కరించింది. రక్తాంబర ధారిణి, రక్తమాల్యానులేపన అయిన ఆమె నాల్గుచేతులలోను వరదాభయ ముద్రలను, పాశాంకుశాలను దాల్చి, వేదములు బోటులై సేవిస్తూండగా స్పష్టంగా దేవతల కందరికి "బ్రహ్మమును నేనే" అను మహా వాక్యాన్ని బోధించింది. ఇంకా ఇలా చెప్పింది:

"దేవతలారా! సర్వజగత్తుకు కారణమైన చైతన్యాన్ని నేనే! ఓంకారాన్ని నేనే! నాకంటె భిన్నంగా ఏదీ లేదు. త్రిమూర్తులు సైతం నా ఆజ్ఞనే పాలిస్తున్నారు. ఇక ఇతరుల గురించి చెప్పేదేముంది? ఐంద్రజాలికుడు కట్టబొమ్మలను ఆడించునట్లు నేనే ప్రాణులందరి చేత జీవ నాట్యాన్ని చేయిస్తున్నాను. పంచ మహాభూతములు నా ఆజ్ఞచేతనే వాటి వాటి కర్మల యందు ప్రవర్తిస్తున్నాయి. నాకు రెండు రూపాలున్నాయి. మాయ ఉపాధిగా గలది సగుణం. మాయాతీతమైనది నిర్గుణము. కనుక మీరు అహంకారాన్ని విడిచి సనాతన మూల ప్రకృతి అయిన నన్ను సేవించండి" అని పల్కి అంతర్హితమైంది.

ఇదీ ఉమాప్రాదుర్భావ గాథ. ఈ గాథ యొక్క ఆంతర్యాన్ని, తత్త్వాన్ని చింతన చేసిన మానవుడు తప్పక జ్ఞానియై పునరావృత్తి రహితమైన అద్వైత సిద్ధిని పొందుతాడు."

దుర్గా చరితము

మునులు సూతుణ్ణి దుర్గాదేవి తత్త్వాన్ని తెలిపే మరొక గాథను చెప్పమని కోరగా సూతుడిలా చెప్పసాగేడు: "మునులారా! పూర్వం రురు పుత్రుడైన దుర్గముడు అనే రాక్షసుడుండేవాడు. వాడు బ్రహ్మవర ప్రభావంచే నాలుగు వేదాలను స్వాధీనం చేసికొన్నాడు. వెంటనే భూలోకంలో వేదములు అంతర్హితమైనాయి. వేదోక్త కర్మలు నశించాయి. దేవతలకు హవ్యములు లేవు. పితృదేవతలకు కవ్యములు లేవు. సూర్యునకు అర్ఘ్యంలేదు. స్వర్గంలో దేవతలు, భూలోకంలో బ్రాహ్మణులు దురాచార పరాయణులయ్యారు. ముందు బ్రాహ్మణుడు పతనం కాగానే మిగతా వర్ణముల వారు సహజంగానే ఆచార భ్రష్టులు, ధర్మ భ్రష్టులు అయ్యారు. దాన-ధర్మాలు లేవు. జప-తపాదులు లేవు. యజ్ఞ-యాగాదులు లేవు. అగ్న్యారాధన లేదు. హోమాదులు లేవు. పూజలు లేవు. పురాణ పఠనాదులు లేవు. ఫలితంగా వంద సంవత్సరాలు అనావృష్టి ఏర్పడింది. భూమిమీదగల జల వనరులన్నీ ఇంకిపోయాయి. ప్రజల హాహాకారాలు, ఆర్తనాదాలు మిన్నుముట్టాయి.

భూలోకంలోని జనుల దైన్యస్థితిని చూచి జాలిపడిన దేవతలు యోగమాయా స్వరూపిణి అయిన మహేశ్వరిని అనేక విధాల ప్రార్థించారు. అపరాధాలను క్షమించమని స్తుతించారు. వెంటనే దయామూర్తి అయిన ఉమాదేవి వారి ప్రార్థనను మన్నించి అనంతమైన నేత్రాలతో, ప్రసన్నమైన చూపులతో, పద్మంవంటి ముఖంతో సాక్షాత్కరించింది. ఆమె నాలుగు చేతులలోను ధనుస్సు, బాణము, పద్మము, అనేకమైన దుంపలు, కూరలు, ఫలాలు ఉన్నాయి. ఆ తల్లి తన బిడ్డలైన మానవుల కష్టాలను, దుఃఖాన్ని చూడలేక వారి ఆర్తనాదాలకు కుమిలిపోయి తొమ్మిది రాత్రుళ్ళు, తొమ్మిది పగళ్ళు రోదించింది. అపుడామె కన్నులనుండి సంతతధారాపాతంగా కన్నీరు ప్రవహించింది. ఆ కన్నీటి ధారలచే భూమి అంతా తడిసి జల వనరులన్ని నిండాయి. తరులతాగుల్మాదులు వృద్ధిచెందాయి. పంటలు పుష్కలంగా పండాయి. కందమూలాదులు పెరిగాయి. కూరలు విపరీతంగా కాపుకొచ్చాయి. పచ్చిక చేయెత్తు దుబ్బులుగా ఎదిగింది. ఫలభారంచే తరువులు వంగాయి. ఆ తల్లి దయామృత వర్షధారలచే భూమిమీద చైతన్యం వెల్లి విరిసింది.

ఆ దేవి దేవతలను "నావల్ల జరగవలసిన దానిని మీరు కోరుకోండి!" అని వరమీయగా వారు వేదాలను తిరిగి అనుగ్రహించమని ప్రార్థించారు. తక్షణం ఆమె దేవతల రక్షణ కొరకు తేజోరూపమైన చక్రాన్ని ఏర్పాటు చేసి దుర్గముని మీదికి దండెత్తింది. నూరు అక్షౌహిణీల సైన్యంతో వాడు ఆమెను ఎదిరించాడు. దేవి శరీరం నుండి కాలి, తార, భిన్నమస్త, శ్రీవిద్య, భువనేశ్వరి, భైరవి, బగళ, ధూమ్ర, శ్రీమత్త్రిపుర సుందరి, మాతంగి అను పదిమంది స్త్రీమూర్తులు బయల్వెడలి వాడి సైన్యాన్ని నిశ్శేషంగా సంహరించారు. శివాదేవి శూలాగ్రంతో పొడిచి దుర్గముని సంహరించి నాల్గు వేదాలను తెచ్చిదేవతలకిచ్చింది.

అంత దేవతలాతల్లిని ఇలా కీర్తించారు: "ఓ అంబికా! నీవు మా కొరకు అనంత నేత్రాలతో అవతరించావు కనుక నీ భక్తులు నిన్ను శతాక్షి అని కీర్తిస్తారు. నీవు నీ దేహంనుండి ఉద్భవించిన శాకములతో జనులను పోషించావు కనుక నిన్ను నీ భక్తులు శాకంభరి అనే పేరుతో పూజిస్తారు. ఓ శివాదేవి! నీవు దుర్గముడనే రాక్షసుని సంహరించావు కనుక మానవులు నిన్ను దుర్గ, భగవతి, భద్ర అను పేర్లతో కొలుస్తారు. అమ్మా! ఎవరైనా కలిమి కలిగియుంటే కలిగినంతలో కడుపు నింపుతారుగాని తొమ్మిది రోజులు అహోరాత్రాదులు సంతత ధారాపాతంగా బిడ్డలకొరకు కన్నీరు కార్చిన అమ్మలగన్న అమ్మవు నీవే! ఇంతటి దయను ఎవరు చూపుతారు తల్లీ! ముల్లోకాలలోను నీ భక్తులకు ఎప్పుడూ ఎట్టి ఆపద, పరాభవము లేకుండా ఉండేటట్లు ఇట్టి దయనే ఎప్పుడూ చూపు."

అపుడా తల్లి ఇలా అంది: "బిడ్డలారా! దూడ 'అంబా' అని అరవగానే ఆవు ఎలా కంగారుగా పరుగెత్తుకొచ్చి తన దూడను నిమురుతుందో నేనూ అలాగే నా భక్తులు 'అమ్మా!' అని పిలువగానే... "నా బిడ్డలకు ఏ ఆపద వచ్చిందో?" అని అక్కడ ప్రత్యక్షమవుతాను. మీరు నన్ను తలచుకొనక పోతే నేనెంత కుమిలిపోతానో తెలుసా! అందరూ నా సంతానమే. గతంలో వలెనే భవిష్యత్తులో కూడ నా సంతానాన్ని రక్షించుకొంటాను. భవిష్యత్తులో శుంభనిశుంభులు ఉదయించగలరు. నేను నందుని భార్య అయిన యశోదయందు నందజనై జన్మించి వారిని సంహరిస్తాను. నేను తుమ్మెద రూపాన్ని దాల్చి అరుణుడనే రాక్షసుని హతమారుస్తాను. ఆ కారణంగా నన్ను భ్రామరి అని పిలుస్తారు. భయంకర రూపాన్ని దాల్చి రాక్షసులను భక్షిస్తాను. అప్పుడు నన్ను భీమాదేవి అంటారు. నా బిడ్డలకు ఏ ఆపద వచ్చినా నేరక్షిస్తాను" అని చెప్పి దేవి అదృశ్యమైంది."

క్రియాయోగ నిరూపణం

సూతుడు మునులతో ఇలా అంటున్నాడు: "మునులారా! మీకిప్పుడు జగన్మాత అయిన ఉమాదేవి యొక్క క్రియాయోగమును గూర్చి చెపుతున్నాను వినండి. శ్రీమాతను చేరే ఉపాయాలు మూడున్నాయి. అవి జ్ఞాన-కర్మ-భక్తి యోగములు. అవి భుక్తిని, ముక్తిని కూడ ఇస్తాయి. సాధకుని మనస్సు ఆత్మతో కలియుటయే జ్ఞానయోగం. బాహ్య వస్తువులతో కలియుట క్రియాయోగం. దేవికి-ఆత్మకు ఐక్యాన్ని భావన చేయుట భక్తియోగం. నేనిప్పుడు క్రియా యోగాన్ని గురించి చెపుతున్నాను. కర్మవలన భక్తిపుడుతుంది. భక్తిచే జ్ఞానం కలుగుతుంది. జ్ఞానంచే ముక్తి కలుగుతుంది. మోక్షానికి ప్రధాన హేతువు యోగం. యోగ ఫలాన్ని పొందటానికి క్రియా యోగం సర్వోత్తమ సాధనం. సర్వమైన జగత్తుకు కారణం మాయ. ఆ మాయను వశంచేసికొన్నది శాశ్వత బ్రహ్మ తత్త్వం. దేవి యొక్క రూపం బ్రహ్మము కంటె భిన్నము కాదని తెలుసుకొన్న వాడు ముక్తుడవుతున్నాడు.

ముందుగా దేవీ మందిరాన్ని నిర్మించుకొనాలి. అందులో దేవిని ప్రతిష్ఠించి నిత్యము నాలుగు దిక్కులయందు శివ, విష్ణు, సూర్య, గణపతులను స్థాపించాలి. నిత్యము షోడశోపచార పూజా విధానంతో అర్చించాలి. కృష్ణ పక్షంలోని పంచమి, అష్టమి, నవమి, దశమి, అమావాస్య తిథులలో విశేషంగా అర్చించాలి. విష్ణుక్రాంత మరియు తులసిని మినహాయిస్తే మిగిలిన పువ్వులన్ని శ్రీమాతకు ఇష్టమే. పూజ పూర్తయ్యాక దేవ్యపరాధ స్తోత్రాన్ని విధిగా పఠించాలి. చైత్ర శుక్ల తదియ నాడు భవాని వ్రతాన్ని చేసిన భక్తుడు నిస్సందేహంగా పరమ పదాన్ని

పొందుతాడు. అలాగే వైశాఖ శుక్ల తదియకు అక్ష తదియ అని పేరు. ఆనాడు దేవీ వ్రతాన్ని విధిగా చేయాలి. కనీసం చూడాలి. ఆషాఢ శుక్ల తదియ నాడు దేవికి ప్రియమైన రథోత్సవం చేయాలి లేదా ఉత్సవంలో పాల్గొనాలి. ఆ రథమే భూమి అని, చక్రములే సూర్యచంద్రులని, వేదములే గుర్రములని, సారథియే బ్రహ్మయని భావన చేయాలి. లోకులను రక్షించే ఉద్దేశ్యంతో జగన్మాత సంచారం చేస్తున్నదని సాధకుడు రథోత్సవాన్ని భావన చేయాలి. అన్ని మాసములలోను శుక్లపక్ష తదియ దేవికిష్టమైన తిథి.

ఉమా సంహిత సమాప్తము

హరిః ఓం తత్సత్

శ్రీకృష్ణార్పణమస్తు